**నెల్లూరు కార్పొరేషన్, అక్టోబరు 29, ప్రభాతవార్త:** శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు నగరంలోని శనివారం ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నెల్లూరు జిల్లా ఎస్పీ సి.హెచ్.విజయరావు మాట్లాడుతూ యువతనే ప్రధానంగా టార్గెట్‌చేస్తూ సైబర్‌మోసాలకు పాల్పడుతున్న వివిధ ప్రాంతాలకు చెందిన నలుగురిని అరెస్టు చేసి వీరిని విచారించగా విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయన్నారు. సైబర్ నేరగాళ్లు మొబైల్ ఫోన్లకు లింకులు పంపుతూ వీటిని ఓపెన్ చేయడం ద్వారా లిజనింగ్ యాప్ ద్వారా మన ఫోన్‌లోని డేటాతో పాటు కాంటాక్ట్ లిస్ట్ మొత్తం సైబర్ నేరగాళ్లకు చేరుతుందని తెలిపారు. దీంతో వారు బాధితుల ఫోటోలు మార్ఫింగ్ చేయడం, అకౌంట్‌ల లోని నగదు దొంగలించడం, మనకు తెలిసిన కాంటాక్ట్స్ ద్వారా బెదిరించడం లాంటి పనులకు పాల్పడే వారని తెలిసిందన్నారు. సైబర్ నేరగాళ్ల ఓపెన్ చేసిన 29 అకౌంట్‌ల ద్వారా రూ.34 కోట్లను సీజ్ చేశామన్నారు. అలాగే వివిధ రకాల పేర్లతో 12 కంపెనీలు ఓపెన్ చేయడం ద్వారా పలువురిని మోసం చేశారని వెల్లడించారు. లీసా అనే విదేశీ మహిళ ఫిలిప్పీన్స్, హాంకాంగ్ దేశాల ద్వారా ఇన్‌స్టాగ్రామ్ అనే సోషల్ ఫ్లాట్‌ఫారం ద్వారా వివిధ రకాల మెసేజ్‌లు పంపుతూ వర్క్ ఫ్రమ్ హోం అనే మెసేజ్ ద్వారా ఫోన్‌ను హ్యాక్ చేస్తూ, లిసనింగ్ యాప్ ద్వారా మీ మొబైల్‌లో ఇన్‌స్టాల్ అయి ఫోన్‌లోని ఫోటోలు, డేటా మొత్తం మోసగాళ్ల చేతిలోకి వెళ్లిపోతాయని వివరించారు. నగరాల్లో యువత ఎక్కువగా ఈ ముఠా బారిన పడుతున్నారని, కావున పై విషయాలు దృష్టిలో ఉంచుకుని యువత జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్పీ విజయరావు కోరారు. ఇంత పెద్ద సైబర్ కేసు చేధించడంలో ప్రధాన పాత్ర వహించిన నెల్లూరు జిల్లా క్రైం ఎఎస్పీ చౌడేశ్వరితో పాటు ఉదయగిరి సిఐ గిరిబాబు, బాలాజీనగర్ సిఐ రాములు నాయక్, సైబర్ టీం సిబ్బందికి జిల్లా ఎస్పీ విజయరావు నగదు ప్రోత్సాహకంతో పాటు ప్రశంసా పత్రాలు అందించారు.

# మరో ఎల్‌విఎం3 ప్రయోగానికి ఇస్రో సిద్ధం

### మహేంద్రగిరిలో కీలక క్రయోజనిక్ ఇంజన్ పరీక్ష విజయవంతం

**శ్రీహరికోట (తడ), అక్టోబరు 29 ప్రభాతవార్త:** శ్రీహరికోట నుంచి మరో భారీ ఉపగ్రహ ప్రయోగ వాహక నౌక ప్రయోగానికి శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ సహకారంతో ఎల్‌వీఎం3 ఎం3పేరుతోరాకెట్‌ను రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా మహేంద్ర గిరిలోని ఎల్‌పీఎస్‌ఈ కేంద్రంలో క్రయోజనిక్ మోటారు స్థిర పరీక్ష విజయవంతంగా పూర్తి చేసినట్లు ఇస్రో శనివారం ప్రకటించింది. ఈ స్థిరపరీక్ష 25 సెకన్ల పాటు విజయవంతంగా మండింది. ఘన, ద్రవ ఇంధనాలతో కూడిన ఇంజన్లతో పాటు ఎల్‌వీఎం 3 రాకెట్‌తో క్రయోజనిక్ దశ కూడా కీలకంగా ఉంది. ఈదశలో 25 టన్నుల అతిశీతల క్రయో ఇంధనాన్ని వాడతారు. కీలకమైన ఈ పరీక్ష విజయవంతం కావడంతో వచ్చే జనవరి, ఫిబ్రవరిలలో రాకెట్‌ను ప్రయోగించడానికి మార్గం ఏర్పడినట్లు ఇస్రో శాస్త్రవేత్తలు అంటున్నారు. యూకేకి చెందిన వన్‌వెబ్ ఇండియావారి మరో 36 ఉపగ్రహాల శ్రేణిని ఈ రాకెట్ ద్వారా అంతరిక్షంలోని లోఎర్త్ ఆర్బిట్‌లో ప్రవేశపెట్టాల్సి ఉంది. ఇటీవలే ఇందులో మొదటి ప్రయోగాన్ని విజయవంతంగా ప్రయోగించి విశ్వ వ్యాప్తంగా ఇస్రో జేజేలు అందుకుంది.

## ఆప్కాస్ పరిధిలోకి గురుకులపాఠశాలల్లోని వంట కార్మికులు

**విజయవాడ,అక్టోబరు29,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని గురుకులాల్లో పనిచేసే వంటకార్మికులను ఎపి కార్పోరేషన్ ఫర్ అవుట్ సోర్సుడ్ సర్వీసెస్(ఆప్కాస్) పరిధిలోకి తీసుకుని వచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటున్నట్లు సంబంధిత శాఖాధికారులు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాల్లో 1100 మంది పనిచేస్తున్నారు.వీరిలో 600మందిని గత ఏడాది డిసెంబరులో ఆప్కాస్ పరిధిలోకి తీసుకున్నారు.పోస్టుల మంజూరు కానందున వీరిని ఆప్కాస్ పరిధిలోకి తీసుకోలేమని అప్పట్లో ఆ సంస్థ ఎండి లిఖిత పూర్వకంగా లేఖ రాసారు. కుకింగ్, క్యాటరింగ్ పరిధిలోని ఈ ఉద్యోగులకు పోస్టింగ్‌లను ఆప్కాస్ పరిధిలో చూపించే విషయం వివాదస్పదంగా మారింది.వారు తమ విధుల్లో కొనసాగుతున్నారు.ఈ క్రమంలో మిగిలిన 500 మందిని ఆప్కాస్ పరిధిలో చేరుస్తున్నామని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ సందర్భంలోనే గతంలో మాదిరిగా సాంకేతిక అంశాలు తలెత్తకుండా ఈ కార్మికులను ఆప్కాస్ పరిధిలోకి తీసుకుని వెళ్లామని, వారికి నిబంధనలను అనుసరించి జీతభత్యాలు ఇబ్బంది ఉండదని చెబుతున్నారు.

# చంపావతి నదిలోదిగి ఇద్దరు యువకులు మృతి

**నెల్లిమర్ల, అక్టోబరు 29 ప్రభాతవార్త:** విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండల పరిధిలోని సారిపల్లి వద్ద చంపావతి నదిలో స్నానానికి దిగి ఇద్దరు యువకులు శనివారం ప్రాణాలు కోల్పోయారు.ఫలితంగా పండుగ పూట వారి కుటుంబాల్లో తీవ్ర విషాదంచోటు చేసుకుంది. నాగులచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని విజయనగరం నగరానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన 16 మంది చంపా వతి నదీ తీరానికి పుట్టలో పాలువేసేందుకు వచ్చారు. అందరు కుటుంబీకులతో నెల్లిమర్ల మండలం సారిపల్లి సమీపంలోని చంపావతి నదీ తీరంలో ఉన్న తోటలోని పుట్టలో పాలువేసిన తర్వాత తల్లిదండ్రులు, కుటుంబీకులు చంపావతి నదికి సమీపంలో సేద తీరుతున్నారు. ఆ కుటుంబాలకు చెందిన ఇద్దరు యువకులు వనమాలి సతీష్‌కుమార్ (21),కర్రి సత్యవీర వెంకట సాయి హర్షవర్ధన్ (14) అందరి చూస్తుండగానే నదిలో స్నానానికి దిగి మునిగిపోయి కానరాని లోకాలకు వెళ్లిపోయారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం అద్దేపల్లివారి వీదికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన సుమారు 16 మంది పిల్లా పాపలతో సుమారు 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న సారిపల్లి చంపావతి నది తీరానికి శనివారం ఉదయం 10 గంటల సమయంలో చేరుకున్నారు. పూజల అనంతరం సమీపంలో ఉన్న పురాతన దిబ్బేశ్వరాలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. తర్వాత నది పక్కనే ఉన్న ఆయుర్వేద ఆసుపత్రి వద్ద తల్లిదండ్రులు, పెద్దలు సేదతీరుతుండగా వనమాలి సతీష్‌కుమార్ (21), కర్రి సత్యవీర వెంకట సాయి హర్షవర్ధన్ (14) ఇద్దరు అందరూ చూస్తుండగానే సరదాగా స్నానానికి దిగారు. ఇంతలోనే అక్కడ లోతైనప్రాంతం ఉండడంతో మునిగి పోవడాన్ని కుటుంబీకులు గమనించారు. వారిని రక్షించేందుకు కుటుంబీ కులు, స్థానికులు ప్రయత్నించిన ప్పటికి ప్రయోజనం లేకపోయింది. వారికి బయటకు తీసుకువచ్చి సపర్యలు చేసి 108 వాహనం ద్వారా నెల్లిమర్ల మిమ్స్ ఆసుపత్రికి తరలించినప్పటికి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు చెబుతున్నారు. మృతుల్లో సతీష్‌కుమార్ ఇటీవలే పోలి టెక్నిక్ డిప్లోమో పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడని చెబుతున్నారు. కాగా మరో మృతుడు హర్షవర్ధన్ విజయనగరం లోని కస్పా ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఈయనకు అక్క ఉంది. నెల్లిమర్ల ఎస్ఐ పి.నారాయణరావు సంఘటనా స్థలానికి చేరుకుని పూర్తి వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ
(ఇంధన మంత్రిత్వశాఖ క్రింద చట్టబద్ధమైన సంస్థ, భారత ప్రభుత్వము)
4వ అంతస్థు, సేవాభవన్, ఆర్.కె.పురం, న్యూఢిల్లీ-110066 (ఇండియా)
వెబ్‌సైటు: www.beeindia.gov.in, ఫోన్: 011-26766700

బహిరంగ ప్రకటన

కొంతమంది తయారీదారులు విద్యుత్ ఆదా చట్టం విభాగము 14ని ఉల్లంఘిస్తూ BEE స్టార్ రేటింగు లేని LED బల్బులను విక్రయించుచున్నారు. కావున ఉత్పత్తుల కొనుగోలుకు ముందు స్టార్ లేబుల్‌ను పరిశీలించాల్సిందిగా సలహానివ్వబడుచున్నారు.

ఉత్పత్తి పై చూపబడిన స్టార్ లేబుల్ ప్రామాణికతను పరిశీలించేందుకు, BEE పోర్టల్‌ను దర్శించండి:

www.beestarlabel.com/searchCompare





CBC 34106/12/0008/2223

విద్యుత్ ఆదా కోసం ఎల్లప్పుడూ BEE స్టార్ రేటెడ్ పరికరాలను ప్రాధాన్యమివ్వండి

30-10Pg4 :Layout 1 10/30/22 11:54 PM Page 1



నాలుగు వందల కోట్ల రూపాయలతో నలుగురు అధికార టిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసే భారీడీల్ ప్రకంపనలు సృష్టించింది. పార్టీ ఫిరాయిస్తే ఒక్కొక్కరికీ రూ.100 కోట్లతోపాటు కాంట్రాక్టుల ఆశచూపుతూ ఢిల్లీలో అధికార బిజెపికి చెందిన ఒక అగ్రనేతతో ఫోన్‌లో మాట్లాడించే యత్నంచేసిన మధ్యవర్తులను రాష్ట్ర పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గాపట్టుకున్నారు. ఎమ్మెల్యేలు ఇచ్చిన సమాచారంతోనే పక్కాగా వల పన్ని, మొత్తం బేరసారాలనూ దాదాపు గంటన్నరపాటు ఆడియో, వీడియో రికార్డింగ్ చేసిన ఆధారాలతో సహా వారిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మునుగోడు ఉప ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ తెలంగాణ రాజకీయాల్లో పెనుప్రకంపనలుచోటు చేసుకున్నాయి. అధికార టిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను రూ.400 కోట్లతో కొనుగోలు చేసేందుకు కొందరు చేసిన యత్నాన్ని సైబరాబాద్ పోలీసులు భగ్నం చేశారు. ఎమ్మెల్యే కొనుగోలుకు యత్నించిన మధ్యవర్తులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వ్యవహారం ట్విస్ట్ చోటు చేసుకుంది. ఈ విషయంలో తెలంగాణ బిజెపి హైకోర్టును ఆశ్రయించింది. కేసును సీబిఐకి బదిలీ చేయాలని కోరుతూ ఉన్నత న్యాయస్థానంలో రిట్‌పిటీషన్ దాఖలు చేసింది. ఘటనపై సిట్‌ను నియమించాలని పిటీషన్‌లో కోరింది. బిజెపి తెలంగాణరాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జల ప్రేమేందర్‌రెడ్డి హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. బిజెపి పార్టీ ప్రతిష్ట దెబ్బతీసే విధంగా టిఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆ పిటీషన్‌లో పేర్కొన్నారు. మునుగోడు ఉపఎన్నికల నేపథ్యంలో తమపార్టీకి వస్తున్న ఆదరణ చూడలేకనే టిఆర్‌ఎస్ కుట్ర చేసిందని పిటీషనర్ పేర్కొన్నారు. సిబిఐ, సిట్టింగ్ జడ్జితో ఈకేసును సమగ్రంగా విచారణ జరిపించాలని కోరారు. పిటీషన్‌లో 8 మందిని ప్రతివాదులుగా చేర్చారు. తెలంగాణ హోం ప్రిన్సిపల్ సెక్రటరీ, తెలంగాణ డిజిపి, సైబరాబాద్ పోలీస్ కమీషనర్, రాజేంద్రనగర్ ఏసీపీ, మొయినాబాద్ ఎస్‌హెచ్‌వో, కేంద్ర హోంఅఫైర్స్, సిబిఐ, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని ప్రతివాదులుగా చేర్చారు.

# హీటెక్కిన పార్టీ ఫిరాయింపుల వ్యవహారం

**డాక్టర్ వై.నాగేశ్వర్‌రావు**

ఫిరాయింపు తెలంగాణ రాజకీయాలకు పర్యాయపదంగా మారింది. 2014లో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ హోరు పెరిగింది. రాజకీయ ఫిరాయింపులు దేశంలో అందునా తెలుగు రాష్ట్రాల్లో కొత్తేమీ కాదు. సందర్భాన్ని బట్టి ప్రభుత్వాన్ని కూల్చడానికో, ప్రభుత్వాన్ని ఏర్పటు చేసేందుకో ఫిరాయింపులు జరిగిన ఉదంతాలు ఉన్నాయి. ఎన్నికల్లో విజయం సాధించి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతిపక్షాలు లేకుండా చేసేందుకు ఫిరాయింపులను ఒక నిరంతర వ్యూహంగా మార్చుకోవడం అనేది తెలంగాణ రాష్ట్ర సమితి వినూత్న ప్రయోగమన్న విమర్శల ప్రతిపతాల నుంచి వినిపిస్తూ ఉంటుంది. ఇప్పుడు తాజాగా టిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు నలుగురిని బిజెపిలోకి ఆ పార్టీ యత్నాలు చేసిందని, రూ.100 కోట్లకు ఒకరు చొప్పన కొనుగోలు చేసేందుకు బేరసారాలు ఆడిందని వీడియో, ఆడియో లీక్‌లు బయటకు వస్తున్నాయి. ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారానికి బిజెపి డబ్బుఆశ చూపినట్లుగా ఆరోపణలు ఉన్నా, రెడ్‌హ్యాండెడ్‌గా డబ్బులు దొరకనందున ఏసీబీ న్యాయమూర్తి సదరు ముగ్గురు వ్యక్తులను పోలీసుల రిమాండ్‌కు అంగీకరించలేదు. 41 సిఆర్‌పీసీ నోటీసు జారీచేసి నిందితులపై విచారణ జరపాలని ఆదేశించారు. ఈ మేరకుముగ్గురు నిందితులకు 41 సిఆర్పీసీ కింద నోటీసులు ఇచ్చారు. 24 గంటల్లోగా పోలీస్ స్టేషన్‌లో హాజరవ్వాలని అందులో పేర్కొన్నారు. కానీ ఎమ్మెల్యేల కొనుగోలుకు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డితో నిందితులు బేరసారాలు జరిగినట్లు శుక్రవారం సాయంత్రం కూడా రెండు ఆడియోలీక్‌లు వచ్చాయి. మొత్తంగా రోహిత్ రెడ్డితోపాటు మరో ముగ్గురు టిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను పార్టీ ఫిరాయించి బిజెపిలోకి వచ్చేందుకు వీలుగా ప్రోత్సహించారన్న ప్రయత్నం జరిగినప్పటికీ, ఆ ఫిరాయింపు జరగలేదు. పైగా తమను కొనుగోలు చేసేందుకు యత్నాలు జరుగుతున్నాయనే ఎమ్మెల్యేలు స్వయంగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు ఫిర్యాదు చేశారుకూడా. దీనికి సంబంధించి మొయినాబాద్‌లో రోహిత్‌రెడ్డి ఫామ్‌హౌజ్‌పై దాడులు చేసి ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో ఉన్నట్లుగా భావిస్తున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నలుగురు టిఆర్‌ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం (మొయినాబాద్ ఫామ్ హౌస్) కేసులో అరెస్టయిన ముగ్గురు నిందితులను గురువారం రాత్రి సరూర్‌నగర్‌లోని ఏసీబీ కోర్టున్యాయమూర్తి ఎదుట హాజరు పర్చారు. పోలీసులు భారీ బందోబస్తు నడుమ 8 పోలీస్ వాహనాల్లో నిందితులను నివాసానికి తీసుకొచ్చారు. కాగా, ఈ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. పోలీసుల విజ్ఞప్తి మేరకు నిందితులను రిమాండ్‌కు ఇచ్చేందుకు న్యాయమూర్తి తిరస్కరించారు. సరైన ఆధారలు లేవని న్యాయ



మూర్తి పేర్కొన్నారు. ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ పీసీయాక్ట్ కింద ఈ కేసువచ్చిందని, 41 సిఆర్‌పీసీ నోటీసు ఇచ్చి విచారించాలని ఆదేశించారు. కాగా, బుధవారం రాత్రి హైదరాబాద్ శివారు మొయినాబాద్ అజీజ్‌నగర్‌లోని తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో సోదాలు చేసిన పోలీసులు ఫరీదాబాద్‌కు చెందిన రామచంద్ర భారతి, హైదరాబాద్‌కు చెందిన నంద కుమార్, ఏపీలోని అన్నమయ్య జిల్లా చిన్న మండెం మండలంలో శ్రీమంత్రరాజ పీఠం నిర్వహిస్తున్న సింహయాజ్‌లను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. రాత్రి నుంచి శంషాబాద్ గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లోనే ముగ్గురు నిందితులను విచారించారు. అనంతరం గురువారం సాయంత్రం శంషాబాద్ గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లోనే వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆ తర్వాత నిందితులను సరూర్‌నగర్‌లోని న్యాయమూర్తి ముందు పోలీసులు హాజరుపరిచారు. జడ్జిఇంటి ముందు పోలీసులు పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు. కాగా, శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలోనే వైద్య పరీక్షలు పూర్తి చేసినట్లు వైద్యులు చెప్పారు. నర్కుడ పీహెచ్‌సీ వైద్యుడు పీఎస్‌కు వచ్చి నిందితులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ముగ్గురి సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఫోన్ డేటా ఆధారంగా వీరు ఎవరితో టచ్‌లో ఉన్నారన్న కోణంలో ఎంక్వయిరీ చేస్తున్నారు. ఈ ముగ్గురూ, టిఆర్‌ఎస్‌కు చెందిన అచ్చంపేట, పినపాక, కొల్లపూర్, తాండూరు ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, రేగా కాంతరావు, హర్షవర్ధన్‌రెడ్డి, రోహిత్ రెడ్డిలు పార్టీ మారితే డబ్బు, కాంట్రాక్టులు, పదవులుఇస్తామంటూ ప్రలోభ పెట్టారని పోలీసుల అభియోగం. ఈ కుట్రను సైబరాబాద్ పోలీసులు భగ్నం చేయడంతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. సిఎం కెసిఆర్ ప్రెస్‌మీట్ పెడతారని ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. ఈ ప్రెస్‌మీట్‌లో ఎమ్మెల్యేలకు ఎరపై అన్ని వివరాలు చెబుతారని అంటున్నారు. ప్రగతి భవన్‌లో నలుగురు ఎమ్మెల్యేలు మూడు రోజులుగా ఉన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫాంహౌస్ వేదికగా టిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కొనుగోలుకు యత్నించిన ఘటనలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ప్రలోభాలకు గురిచేసేందుకు ప్రయత్నించిన ముగ్గురు నిందితుల్ని పోలీసులు విచారించారు. ఎమ్మెల్యేల బేరసారాల వెనుక ఎవరున్నారనే విషయంపై ప్రశ్నిస్తున్నారు. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్-8, సెక్షన్-120 బి కింద మొయినాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో ఏ1గా ఢిల్లీకి చెందిన రామచంద్ర భారతి, ఏ2గా హైదరాబాద్‌కు చెందిన నందకిశోర్, ఏ3గా తిరుపతికి చెందిన సింహయాజులును చేర్చారు. నిందితుల నుంచి వివరాలను సేకరించిన తర్వాత ఏసీబీ న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. కాగా, ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బిజెపిలో చేరితే వంద కోట్లు ఇప్పిస్తామని సతీశ్ శర్మ అలియాస్ రామచంద్ర భారతీ ఆఫర్ చేశారని రోహిత్ రెడ్డి పేర్కొన్నారు. నందు మధ్యవర్తిత్వంతో ఫామ్‌హౌజ్‌కు సతీశ్‌శర్మ, సింహయాజులు వచ్చారని ఫిర్యాదులో తెలిపారు. టిఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి బిజెపిలో చేరితే వంద కోట్ల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చినట్లు రోహిత్‌రెడ్డి ఆరోపించారు. బిజెపిలో చేరకపోతే ఈడీ, సిబిఐ వంటి దర్యాప్తు సంస్థలతో కేసులు నమోదు చేస్తామని బెదిరించినట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. టిఆర్‌ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం దేశవ్యాప్తంగా పెను సంచలనం రేపింది. ఇప్పుడు ఈ వ్యవహారం ఢిల్లీకి చేరింది. పూర్తి సమాచారం కోసం కెసిఆర్ వేచి చూస్తున్నారు. పూర్తి సమాచారం రాగానే బిజెపికి వ్యతిరేకంగా ఢిల్లీ కేంద్రంగా దేశ వ్యాప్తంగా మద్దతు కూడగట్టేందుకు యత్నాలు చేయనున్నారు. ఈ పర్యటనలో పలువురు జాతీయ, ప్రాంతీయ పార్టీల నేతలను కెసిఆర్ కలవనున్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారాన్ని హైదరాబాద్‌లో ఎండగట్టాలని మొదట్లో భావించినా ఢిల్లీ వేదికగా మీడియా సమావేశం నిర్వహించాలని కెసిఆర్ నిర్ణయం తీసుకున్నారని సమాచారం. 2014 ఎన్నికల్లో మెజారిటీ సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటి నుంచి తిరుగులేని శక్తిగా మారేందుకు టిఆర్‌ఎస్ నిరంతరం వాడుతూ వస్తున్న ఆయుధం ఇది. 2020 దాకా ఫిరాయింపులనేవి కేవలం ప్రముఖంగా టిఆర్‌ఎస్‌లోకి మాత్రమే జరిగేవి. అప్పుడు కాంగ్రెస్, బిజెపిలకు రాష్ట్రంలో భవిష్యత్తు ఉన్నట్లు ఎవరికీ అనిపించ లేదు. అందువల్ల ఫిరాయింపుదారుల ఏకైక గమ్యస్థానం టిఆర్‌ఎస్ మాత్రమే. దుబ్బాక ఉప ఎన్నికల్లో బిజెపి విజయం సాధించాక పరిస్థితి మారింది. జిహెచ్‌ఎంసీ, హుజురాబాద్ ఎన్నికల తర్వాత బిజెపి మరింత స్పష్టంగా కనిపిస్తోంది. దీంతో పార్టీలు మారాలనుకునే వారికి బిజెపి మరొక గమ్యం అయింది. ఈ విషయంలో కాంగ్రెస్ వెనుకబడింది. ఇలా 2014లో మొదలైన ఫిరాయింపుల మునుగోడు ఉప ఎన్నికల నాటికి వికార రూపం తీసుకున్నాయి. పంచాయతీ వార్డు మెంబర్ నుంచి మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేల దాకా ఫిరాయింపు వార్తలకెక్కని నాయకుల పేర్లు తక్కువ. పొద్దున ఒక పార్టీలోకి దూకి సాయం కాలానికి మరొక పార్టీలో తేలినవారూ ఉన్నారు. ఒక పార్టీ మారబోతున్నారని ఊహాగానాలకెక్కిన పేర్లకు లెక్కే లేదు. ఇప్పుడు పార్టీ అధ్యక్షులు, కుటుంబ సభ్యులు తప్ప మిగతా వాళ్లంతా పార్టీ మారరన్న గ్యారంటీ లేదు. ఇప్పుడు టిఆర్‌ఎస్‌లో ఉన్నా, కాంగ్రెస్‌లో ఉన్నా, బిజెపిలో ఉన్నా రేపు ఎక్కడ ఉంటారో వాళ్లు కూడా చెప్పలేరని వ్యాఖ్యానాలు వస్తున్నాయి. ●

# ‘ఆధిక్య’పోరు!

కేరళ

**ఎ.వి.వి ప్రసాద్**

వివాదం మొదలవకూడదు.. కానీ మొదలైతే అది తాడుతెగే దాకా వెడుతుంది. కేరళలో కనిపిస్తున్న పరిస్థితి అదే. అక్కడ వామపక్ష ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అధికారంలో ఉంది. గవర్నర్‌గా కేంద్రంలోనిబిజెపి ప్రభుత్వం నియమించిన ఆరిఫ్ మహ్మద్ ఖాన్ ఉన్నారు. ఇద్దరిమధ్య మొదటి నుంచి పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితే ఉన్నా, అది ఇటీవల మరింతగా రాజుకొని ఒకరి ఆధిక్యతను మరొకరు ప్రశ్నించుకునే స్థాయి వరకు వెళ్లింది. ముఖ్యమంత్రిగా ఉన్న వామపక్ష నేత, పినరైవిజయన్, గవర్నర్ ఇద్దరూ కత్తులు ఝుళిపిస్తున్నారు. ఎవరి కత్తికి ఎక్కువ పదును ఉందన్నదే ప్రస్తుతం ప్రశ్నార్థకం. విజయన్ ప్రభుత్వం, గవర్నర్ ఆరిఫ్‌ఖాన్ మధ్య చాలాకాలం నుండి వివాదాలు నడుస్తున్నా, తాజాగా చెలరేగిన విసిల వివాదంతో అవి మరింత ముదురు పాకాన పడినట్లు కనిపిస్తుంది. అక్రమంగా నియామకాలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో 11మంది వైస్‌ఛాన్సలర్ల పదవులకు రాజీనామా చేయాలంటూ గవర్నర్ ఇటీవల ఆయా విసిలకు రాసిన లేఖలు ఇప్పుడు పెద్ద దుమారాన్నే సృష్టిస్తున్నాయి. అక్కడితో ఆగకుండా, రాష్ట్ర ఆర్థిక మంత్రిగా ఉన్న కె.ఎన్. బాలగోపాల్‌ను పదవి నుంచి తొలగించాలని సూచిస్తూ ముఖ్యమంత్రి విజయన్‌కు రాసిన లేఖ కూడాపెద్ద సంచలనాన్నే సృష్టిస్తోంది. గవర్నర్ ఈ రెండు చర్యలు సమర్థనీయమా, కాదా అన్నది పక్కన పెడితే, అసలు గవర్నర్ ప్రభుత్వాన్ని, ప్రభుత్వ చర్యలను ఎందుకు ఇంతలా టార్గెట్ చేస్తు న్నారనేది పెద్ద ప్రశ్నగా కనిపిస్తోంది. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం సహజమే అయినా, గవర్న మెంట్ అత్యున్నత రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న వ్యక్తి ఎందుకు ఈవిధంగా వివాదాస్పదమవుతున్నా డనేది పరిశీలించవలసి ఉంది. 11మంది విసిలు రాజీనామా చేయాలని గవర్నర్ డిమాండ్ చేయడంతోలుత అందరిని సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తే, ఆర్థికమంత్రిని తొలగించాలని ముఖ్యమంత్రికి రాసిన లేఖ చాలా మందిలో ఆగ్రహాన్ని కూడా కలిగించింది. తాను ప్రమాణం చేయించిన వ్యక్తి తనవిశ్వాసాన్ని కోల్పోయినప్పుడు అతడిని తాను ఎలా కొనసాగించగలనంటూ గవర్నర్ వేస్తున్న ప్రశ్న కూడా వివిధ వర్గాలలో ఆలోచనను రేకెత్తిస్తోంది. గవర్నర్ లేఖకు విజయన్ సమాధానమిస్తూ ఆ మంత్రిపై తనకు విశ్వాసం తగ్గలేదనీ, అందువల్ల ఆయన్ని తాను కొసాగించదలిచాననీ పేర్కొనడంతోరెండు మదగజాలు ఢీకొన్నట్లుగా పరిస్థితిమారింది. ఆ 11 మంది విసిలు గవర్నర్ లేఖపై హైకోర్టుకువెళ్లడంతో కోర్టు స్టేఇచ్చింది. దానితో పరిస్థితి మరింత గందరగోళంగా తయారైంది. ఎవరి కత్తులకు వారు మరింత పదును పెట్టడంలో నిమగ్నమయ్యారు. ఇటువంటి ఘటనలే కేజ్రీవాల్ ఆప్ ప్రభు త్వం అధికారంలో ఉన్న ఢిల్లీ, పంజాబ్‌లోను, మమతా బెనర్జీ అధికారంలో ఉన్న పశ్చిమ బెంగాల్‌లోను, స్టాలిన్ అధికారంలో ఉన్న తమిళనాడులో కూడా సంభవించాయి. అంత ఎక్కువగా కాకపోయినా, తెలంగాణలో కూడా గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వం మధ్య రుసరుసలు సాగుతూనే ఉన్నాయి. వర్సిటీలపై గవర్నర్ పెత్తనాన్ని తొలగిస్తూ మమత, స్టాలిన్ ప్రభుత్వాలు అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాయి. ఢిల్లీ, పంజాబ్‌లో రగడ కొనసాగుతోంది. అదే తరహాలో తమ గవర్నర్ అధికారాలకు కూడా కత్తెర వేయడానికి విజయన్ ప్రభుత్వం ఆలోచనలు సాగిస్తోంది. విశ్వవిద్యాలయాలకు ఛాన్సలర్‌గా వ్యవహరిస్తున్న గవర్నర్‌ను ఆపదవి నుంచి తొలగిస్తే సగం సమస్యలు పరిష్కారమవుతాయన్నది విజయన్ ప్రభుత్వ వ్యూహం. రేపోమాపో ఆ బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టే సూచనలున్నాయి. అయితే ఈలోగానే తన ప్రత్యేకాధికారాలను ఉపయోగించి రాష్ట్రప్రభుత్వంపై గట్టి చర్యలు తీసుకోవాలన్నది ఆరిఫ్‌ఖాన్ ఆలోచన. ఈ రెండు కత్తుల్లో ఏ కత్తికి పదును ఎక్కువో కొద్ది రోజుల్లో తేలవచ్చు. ఆ మధ్య కలాం వర్సిటీ విసిగా డా.ఎం.ఎస్ రాజశ్రీ నియామకం రద్దుచేస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిన తర్వాత ఆయా రాష్ట్రాల్లోని వర్సిటీల్లో గవర్నర్‌జోక్యం ఎక్కువైందని పరిశీలకులు భావిస్తున్నారు. నిజానికి అవకతవకలు ఎక్కువగా జరిగేది విద్యారంగమే కావడంతో వివాదాలు కూడా వాటి చుట్టూరా ఎక్కువగా ముసురుతున్నాయి. తనకు అధికారం ఉన్న చోట గవర్నర్లు అందుకే కొరడా ఝుళిపిస్తున్నారు. ఆరిఫ్ ఖాన్ రాష్ట్ర ఆర్థిక మంత్రిపై ఇంత ఆగ్రహం వ్యక్తం చేయడానికి కొన్ని కారణాలు కనిపిస్తాయి. ఒక సందర్భంలో బాలగోపాల్ మాట్లాడుతూ ‘కేరళలోని విశ్వవిద్యాలయాల గురించి యుపి నుంచి వచ్చిన వారికి ఏం తెలుస్తుంది? బెనారస్ వర్సిటీలో సెక్యూరిటీ గార్డులు ఐదుగురువిద్యార్థుల్ని కాల్చిచంపారు. అప్పట్లో ఎంపిగా ఉన్ననేను అక్కడికి వెళ్లి చూశాను. విసికి కొన్ని డజన్లమంది గార్డులు రక్షణగా ఉన్నారు. అక్కడ చాలా విశ్వవిద్యాలయాల పరిస్థితిఇంతే’ అని వ్యాఖ్యానించడంతో దానిని నిరసిస్తూ గవర్నర్ సిఎంకుతొలుత ఓ లేఖరాశారు. దానికి సిఎం నుంచి స్పందన లేకపోవడంతో బాలగోపాల్ వెంటనే రాజీనామా చేయాలంటూ మరో లేఖ రాశారు. ఆ రెండో లేఖతో గవర్నర్, ప్రభుత్వం మధ్య ఉద్రిక్తపరిస్థితి పెరిగిపోయింది. యేడాదిగా గవర్నర్, ప్రభుత్వంమధ్య వివాదాలు నడుస్తుండడంతో, గవర్నర్ అధికారాలు కత్తిరించడానికి కేరళ న్యాయశాఖ కమిషన్ చేసిన సిఫారసులను అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అవి అమలు చేయాలంటే రాష్ట్రపతి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రపతి అనుమతిస్తారా? అన్నది సందేహమే. ఈలోగా వివాదాలు మరింత ముదిరితే అది ప్రజాస్వామ్య మనుగడకు ప్రమాదంగా పరిణమించవచ్చు. అందుకే గవర్నర్, సిఎం తమ కత్తులను ప్రస్తుతానికైనా దాచి వేయడం ఉత్తమం. ●



ఆరిఫ్ మహ్మద్‌ఖాన్

# రష్యాకు ‘డర్టీబాంబ్’ ముప్పు

ఉక్రెయిన్

**గన్ని మోహన్**

ప్రపంచదేశాల్లో ఇపుడు ఒకే ఒక్కపేరు వినిపిస్తోంది. అది అణుబాంబా అంటే కానేకాదు. సామూహిక విధ్వంసమా అంటే అసలే కాదు. ఒకే ఒక్క చిన్న పేరుతో ఇపుడు ఉక్రెయిన్ ప్రపంచదేశాలను సైతం కలవరపాటుకు గురిచేసింది. అందులోను దండయాత్ర చేస్తున్న రష్యా ఇపుడు నిలువెల్లా వణికిపోతోంది. కారణం ఉక్రెయిన్ దేశం ఇపుడు ఒకే ఒక్క బాంబును ప్రయోగించేందుకు సిద్ధం అవుతోందని ప్రకటించి ఆందోళన వ్యక్తంచేసింది. అదే ‘డర్టీబాంబ్’ ఈపేరు గతంలో విన్నా అంతగా ప్రాచుర్యంలోకి రాలేదు. అణుబాంబు విధ్వంసం, వాటివల్ల ఒనగూరే ప్రమాదాలను హీరోషిమా, నాగసాకి నగరాలు ప్రత్యక్ష సాక్షులుగా ఇప్పటికీ మనకు చరిత్రలో కనిపిస్తుంటాయి. అలాంటిది ఇపుడు రష్యా ఆరోపిస్తున్నట్లుగా ఉక్రెయిన్ ప్రయోగించే ఈ డర్టీ బాంబువల్ల వచ్చే నష్టాలేమిటి? అసలు డర్టీబాంబ్ అంటేనే అణుబాంబా? లేక ప్రత్యామ్నాయమా? అన్నదే ఇపుడు ప్రపంచ వ్యాప్తంగా నలుగుతోంది. యురేనియం వంటి అణుధార్మిక పదార్థాలను కలిపి మిశ్రమంచేసి తయారు చేస్తారు. సాంప్రదాయ పేలుడు పదార్థాలు పేలినపుడు వాటితోపాటు ఉన్న అణుధార్మిక పదార్థాలు గాలిలో కలిసి అపారమైనప్రాణనష్టం కలిగిస్తుంది. ఈ బాంబుకు అణుబాంబులో ఉపయోగించే తరహా అత్యంతశుద్ధి చేసిన అణుధార్మికపదార్థం ఏమీ అవసరం లేదని ఆసుపత్రులు, అణువిద్యుత్‌ప్లాంట్లు, పరిశోధన ల్యాబ్‌లో ఉండే అణుధార్మిక పదార్థాలనే ఈ బాంబుల్లో ఉపయోగిస్తారు. ఇప్పటివరకూ డర్టీబాంబు విజయవంతంగా ప్రయోగించలేకపోయారు. కొన్ని ప్రయత్నాలే జరిగాయి. ఇపుడు గడచిన ఏడునెలలుగా ఉక్రెయిన్‌పై దండయాత్రసాగిస్తున్న రష్యాపై ఫోకస్‌పెంచిన ఉక్రెయిన్ డర్టీబాంబు ప్రయోగిస్తోందన్న ఆరోపణలు పెంచింది. అమెరికా, ఫ్రాన్స్, తుర్కియే దేశాల రక్షణమంత్రులతోకూడా రష్యా రక్షణమంత్రి సెర్గేయి షోయిగు ఈ అంశం ప్రస్తావించారు. అంతేకాకుండా ఐక్యరాజ్య సమితి భద్రతామండలిలోకూడా రష్యా ఇదే ఆరోపణలుచేసింది. డర్టీబాంబు ఉపయోగించడం అణు ఉగ్రవాదచర్యలకు బీజం వేసినట్లేనని, అదేజరిగితే రష్యా అణుయుద్ధానికి మొగ్గుచూపించక తప్పదన్న పరోక్ష హెచ్చరికలుకూడా చేసింది. అయితే రష్యా వ్యాఖ్యలను బ్రిటన్, ఫ్రాన్స్ అమెరికా దేశాలు తిరస్కరించినా రష్యా తనకుమద్దతున్న దేశాల సాయంతో ఈ ప్రచారాన్ని ముమ్మరంచేసింది. వాస్తవానికి డర్టీబాంబును ప్రయోగిస్తున్నట్లు ఉక్రెయిన్‌నుంచి కూడా ఎలాంటి నిఘా సంస్థల హెచ్చరికలులేవు. దేశ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్‌స్కీమాత్రం యుద్ధంలో వెలువడే చెత్త, విషవాయువు అంతా కూడా రష్యావల్లనేవస్తోందని ప్రత్యారోపణలుచేసారు. అంతేకాదు రష్యా తనకు వ్యూహాత్మక మిత్రదేశంగా ఉన్నభారత్‌ను కూడా ఈ విషయమై సంప్రదింపులు జరిపి ఉక్రెయిన్ చర్యలను ఖండించేవిధంగా ప్రయత్నాలుచేసింది. అందులో భాగమే రక్షణమంత్రి చేసిన ప్రకటన అని తెలుస్తోంది. అణ్వాయుధాలకంటే చౌకగా వేగంగా ఇలాంటిపదార్థాలతో డర్టీబాంబును తయారు చేయవచ్చని అణుపరిశోధనరంగాల నిపుణుల విశ్లేషణ. వీటిని వాహనాల్లోకూడా సులువుగా తీసుకుపోవచ్చు. ఈ అణుధార్మికత సోకితే కేన్సర్ వంటి తీవ్రజబ్బులు వస్తాయి. ఈ బాంబుపేలిన ప్రాంతం చుట్టూ అత్యంత భారీ విస్తీర్ణంలో జనావాసాలను పూర్తిగాఖాళీచేయాలి. అమెరికా శాస్త్రవేత్తల సమాఖ్య లెక్కలప్రకారంతొమ్మిది గ్రాముల కోబాల్ట్60ని, ఐదు కిలోల టిఎన్‌టిని న్యూయార్క్‌లోని మన్‌హట్టన్ శిఖరాగ్రంపై పేల్చితే ఈ నగరం దశాబ్దాలపాటు నివాసయోగ్యంకాకుండాపోతుంది. అందువల్లనే ఈ డర్టీబాంబులను‘సామూహికవిధ్వంసక ఆయుధం’గా కూడాపిలుస్తారు. ఈ డర్టీబాంబులోనింపే పొడి మరీపలుచగా ఉండి బాంబుపేలినపుడుగాలిలోకి విడుదలై భారీప్రాంతాలను చుట్టుముట్టేస్తుంది. ఫలితంగా అత్యధికశాతం ప్రాణనష్టం, విధ్వంసం కూడా జరుగుతుందని అంచనా. 1996లో చెచెన్యా తిరుగుబాటుదారులు మాస్కోలోని ఇజమాయిలోవోపార్కులో డైనమైట్ సిజిఎం137 బాంబును పెట్టినా భద్రతా సంస్థలు నిర్వీర్యం చేసాయి. 1998లో చెచెన్యాలోని రైల్వేస్టేషన్‌వద్ద పెట్టిన డర్టీబాంబుకూడా ఆ దేశ ఇంటెలిజెన్స్‌సర్వీస్ నిర్వీర్యం చేసింది. అల్‌ఖైదా సంబంధాలున్న బ్రిటిషర్ ధీరేన్‌బాలోట్‌ను డర్టీబాంబుతో అమెరికా బ్రిటన్‌లలో దాడిచేసాడన్న అభియోగాలపై30ఏళ్ల జైలుశిక్ష విధించారు. అలాగే ఆల్‌ఖైదాతో లింకులున్న మరోఅమెరికన్ డర్టీబాంబుదాడికి ప్లాన్‌చేసాడన్నఆరోపణలపై చికాగోలో అరెస్టుచేసి 21సం॥ జైలుశిక్ష విధించారు. దీన్నిబట్టే చరిత్రలో ‘డర్టీబాంబ్’కుఉన్న ప్రాధాన్యత తెలిసిపోతోంది. రష్యాకు ఇప్పటివరకూ చెచెన్యా, చైనా, పాకిస్థాన్ వంటిదేశాలు ఉక్రెయిన్‌పై దండయాత్రలో మాటసాయం చేస్తున్న సంగతి తెలిసిందే. కొన్ని దేశాలనుంచి పరోక్షంగామిలిటరీ వలంటీర్లు సైనిక సేవలందిస్తూనాటో చర్యలను తిప్పికొట్టే యత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్ డర్టీబాంబు ప్రకటించిన పక్షంలో కేవలం అది రష్యాను టార్గెట్ చేసుకుని మాత్రమే ఉంటుంది. రష్యాపై డర్టీబాంబు ప్రయోగం మద్దతిస్తేరానురాను ప్రపంచదేశాల్లో ఈ అణుధార్మికశక్తి ఉన్న డర్టీబాంబు ప్రయోగాలు పెచ్చుమీరిపోతాయి. అందుకే ముందు రష్యాను‘అణుయుద్ధం’మాటలనుంచి తప్పించేందుకు ప్రపంచదేశాలు నడుంబిగించాయి. అమెరికా అధ్యక్షుడు జోబైడెన్‌సైతం అణు యుద్ధానికి తెరతీస్తే తీవ్రపరిణామాలుంటాయని హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఇపుడు ఉక్రెయిన్‌పై రష్యాచేస్తున్న ‘అణు’ హెచ్చరికలకు దీటుగా జెలెన్‌స్కీ‘డర్టీబాంబు’ ప్రయోగానికి తెరతీస్తే రష్యాకే ఎక్కువముప్పు ఉంటుంది. అంతేకాకుండా పరిసరాల్లోని బెలారస్, మాల్డోవా, హంగరీ, స్లోవేకియా, పోలెండ్ వంటిదేశాలకు అణుధార్మికముప్పు ఎదురవుతుంది. ఇందుకోసమే రష్యాతోపాటు ఇపుడు ఉక్రెయిన్‌ను కూడా ఈ చర్యలనుంచి వారించేపరిస్థితి అగ్రరాజ్యాలకు ఎదురైందని చెప్పకతప్పదు. ●



డర్టీబాంబ్

# మాటల్లోనే పర్యావరణ పరిరక్షణ!



రుద్రరాజు

వాతావరణ మార్పులతో కలిగే వినాశకరమైన పర్యవసానాల నుంచి భూగ్రహాన్ని రక్షించేందుకు భారత్ నేతృత్వంలో అంతర్జాతీయ కార్యాచరణకు మరోఅడుగుపడింది. అదే మిషన్ లైఫ్ (ఎల్ఐఎఫ్ఇ) లైఫ్‌స్టైల్ ఫర్ ది ఎన్విరాన్‌మెంట్. అంటే పర్యావరణ పరిరక్షణను ఒక సామూహిక ఉద్యమంగా మార్చే దిశగా ప్రజలందరూ తమ జీవన శైలిని మార్చుకోవడం. ప్రధాని నరేంద్రమోడీ ఈ మధ్యగుజరాత్‌లో కేవడీయాలోని ఐక్యతా విగ్రహం వద్ద ప్రధానితోపాటు ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ ఈమిషన్‌ఆరంభించారు. గ్లాస్గోలో నిర్వహించిన కాప్ 26 సమావేశంలోనే భారత ప్రధాని ఈ లైఫ్ కార్యక్రమాన్ని ప్రతిపాదించడం జరిగింది. ఈ కార్యక్రమ ప్రతిపాదనకు గల కారణాలు పరిశీలిస్తే ప్రపంచంలో ప్రతిచోట వాతావరణ మార్పుల ప్రభావం కనిపిస్తూ ఉంది. అయితే వాతావరణ మార్పుల ప్రభావం అనేది విధానపరమైన సమస్య తప్ప వ్యక్తిగత బాధ్యతకాదు అనేఅభిప్రాయం సాధారణంగా ఎక్కువ మంది ప్రజల్లో నెలకొని ఉంది. దీని కారణంగానే పర్యావరణానికి జరిగే హానిని అరికట్టవలసిన బాధ్యత దేశీయ ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంస్థలదే అనే భావం అందరిలో నాటుకుపోయింది. అయితే ఈ వాతావరణ మార్పులకు ప్రజలు కూడా కారణం అనేది దానికి విస్తృత ప్రచారం కలుగలేదనే చెప్పవచ్చు. ముఖ్యంగా పర్యావరణ విధ్వంసానికి ప్రపంచంలో గల కొన్ని దేశాలు ఎక్కువ కారణం కాగా దాని ఫలితాన్ని మాత్రం అన్ని దేశాలు భరిస్తున్నాయి. అయితే ఈ విషయంలో సదస్సులు పేరిట ప్రభుత్వాలు అంతర్జాతీయ సంస్థలు చర్చలు చేయడం లక్ష్యాలు ప్రకటించడం తప్ప వాస్తవంలో వాతావరణ మార్పులను అరికట్టగలగడం అనేది జరగడం లేదనే చెప్పవచ్చు. ఈ విషయంలో ప్రజలను దీనిలో భాగస్వామ్యం చేసి పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజల జీవన శైలిని మార్చుకోవడం తప్పనిసరి అని వారిని చైతన్యవంతులను చేయగలిగితే మంచి ఫలితాలు సాధించగలం అనేది లైఫ్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. అంటే ప్రతీ ఒక్కరూ దీనిని ప్రాథమిక బాధ్యతగా గుర్తించాలి. అప్పుడే జీవన శైలిలో వచ్చే మార్పుల ద్వారా పర్యావరణానికి గొప్పలు చేసిన వారం అవుతాం. అయితే ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవడంలో మాత్రం మన శ్రద్ధ చూపడం లేదు. ముందుగా మనం తీర్చుకునే అవసరాలు, పొందే సౌకర్యాలవలన పర్యావరణానికి ఎంత హాని కలుగుతుంది అనేది మనం గుర్తించగలగాలి. అంటే ఇక్కడ అవసరాలు వాయిదా వేయమని కాదు. సహజ వనరులు దుర్వినియోగం జరగకుండా వాటిని వినియోగించగలగాలి. అప్పుడే మనం పర్యావరణానికి మేలు చేసిన వాళ్లం అవుతాం. దీనికి భిన్నంగా ఇదొక విధానపర సమస్యగా భావించి సదస్సులు తీర్మానాలు థీమ్‌లు ప్రకటించుకుంటూపోతే ప్రయోజనం మాత్రం శూన్యమనే చెప్పాలి. వాతావరణ మార్పుల వలన గ్లోబల్ వార్మింగ్ ఉధృతమై హిమానీనదాలు కరిగి సముద్ర మట్టాలు పెరిగిపోయే ప్రమాదం పొంచి ఉంది. నదులు ఎండిపోతున్నాయి. మరొకపక్క మనం అవసరానికి మించి వినియోగించే వనరులవలన పరిశ్రమలనుంచి వెలువడే వాయువులు వలన, వాహనాలు నుంచి వెలువడే వాయువుల వలన రోజురోజుకు భూతాపం పెరిగిపోవడం చూస్తూనే ఉన్నాం. ఎడారీకరణ తీవ్రత కూడా రోజురోజుకూ పెరిగిపోతూ ఉంది. ఇటువంటి క్లిష్ట సమయంలో ఈ భూగోళంపై మెరుగైన జీవనాన్ని మనం కొనసాగించాలంటే భూగోళాన్ని కూడా మెరుగ్గా ఉంచాలి. దానికి ఈ భూగోళంపై గల మనందరమూ వ్యక్తిగతంగానూ, సమూహంగానూ బాధ్యతలు చేపట్టవలసిన అవశ్యకత ఉంది. దానికి అవసరం అయిన, మనం చేపట్టవలసిన కార్యక్రమాలపై మిషన్ లైఫ్ మనకు దిశానిర్దేశం చేస్తోంది. ఈ కార్యక్రమం మనల్ని భూగోళ హితాన్ని కోరేవారుగా మారుస్తుంది. మన లక్ష్యాన్ని మనకు ఎల్లవేళా గుర్తుచేస్తూ ఉంటుంది. పర్యావరణానికి ప్రియమైన జీవన శైలిని ఇది ప్రసాదిస్తుంది. అంటే పర్యావరణంపై మనకు వ్యక్తిగత బాధ్యత లేకపోవడం వలన గతంలో ఎంత నష్టపోయాం అనేది గుర్తెరిగేలా చేస్తూ వర్తమానంలో పర్యావరణ హితంగా మన బాధ్యతలను చేపడుతూ భావితరాల వారి ప్రయోజనాలను కాపాడే దిశగా ఇది మార్గనిర్దేశం చేస్తుంది. ప్రభుత్వాలు



విధానపరంగానే కాదు వ్యక్తులు కూడా తమ ప్రాథమికబాధ్యతగా చేపట్టినప్పుడే సుస్థిర అభివృద్ధి సొంతం అవుతుంది. అందరూ కలిసికట్టుగా, దృఢంగా పనిచేసినప్పుడే సుస్థిరఅభివృద్ధి ముందుకు సాగుతుంది. సులువుగా, సమర్థవంతంగా ఉండే పర్యావరణ హితకరమైన పనులు చేసేవిధంగా ప్రజలను ప్రోత్సహించడం, ఈ పనులను ప్రజలు తమ దైనందిన జీవితంలో ఆచరించే విధంగా ప్రేరేపించడం, మారుతున్న డిమాండ్‌కు తగినట్లుగా వేగంగా స్పందించే విధంగా పరిశ్రమలు, మార్కెట్లను ప్రోత్సహించడం, సుస్థిర వినియోగానికి, ఉత్పత్తికి మద్దతునిచ్చే విధానాలను రూపొందించాలని ప్రభుత్వాలను, పరిశ్రమలను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం లక్ష్యాలు. భారతదేశం దృష్ట్యా చూస్తే రీయూజ్, రెడ్యూస్, రీసైకిల్ అనేవి మన సంస్కృతిలో ఎప్పటి నుండో భాగంగా ఉన్నప్పటికీ క్రమేపీ వాటికి మనం తిలోదకాలు ఇస్తూ వస్తున్నాం. దానివల్లనే నేడు వాతావరణంలో ప్రతికూల మార్పులు చవిచూస్తున్నాం. ఈ మార్పుల ప్రభావాన్ని అరికట్టాలి అంటేమన ఆలోచనలు ప్రపంచంతో పంచుకుని మనం ప్రపంచానికి మార్గదర్శకంగా నిలవాలి అనేది భారతప్రభుత్వ ఆశయం. ఈ ఆశయం సాధనకు ప్రజల భాగస్వామ్యం ప్రధానం. దీనికోసం ప్రభుత్వ త్రిముఖ వ్యూహాన్ని కూడా సిద్ధం చేసింది. వాతావరణ మార్పుల ప్రభావంతో ఏదో ఒక దేశానికి చెందినదికాదు. దీనికి సరిహద్దులు లేవు. మనం ఒక్కరమే జాగ్రత్తలు పాటించినా ప్రయోజనం ఉండదు. ఈ భోగోళంపై సమిష్టిపోరు జరపాలి. ఎందుకంటే వాతావరణ మార్పుల ఫలితంగా ఏర్పడిన గ్లోబల్ వార్మింగ్ అరికట్టాలి. ఇది మొత్తంగా భూగోళం సమస్య దీనిపై సమిష్టి పోరు జరిపితేనే తప్ప సత్ఫలితాలు సాధించలేం. ఇది ఈ భూమిపై ఉన్న ప్రజలందరి బాధ్యత. మన మనుగడ మాత్రమే కాదు భావితరాల వారి మనుగడ కూడా దృష్టిలో పెట్టుకుని మనం బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది అనేది ప్రతి ఒక్కరు గమనించే సమయం నేడు ఆసన్నమయింది. దీనికి ప్రకృతి పట్ల మనం చూపే సంప్రదాయాలకు సాంకేతికతను జోడించి చేయడం ద్వారా మిషన్ లైఫ్ ఉద్యమ లక్ష్యం సఫలీకృతం అవుతుంది అని భారత్ భావన. మనకు ఉన్నది ఒకే భూమి. దానిని కాపాడుకోవాలి అంటే పలు ప్రయత్నాలు చేయాలి. అప్పుడే వాతావరణ మార్పులను అరికట్టగలుగుతాం. దీనికి అత్యుత్తమ మార్గం పొదుపుగా వినియోగం, రీ సైకిల్ అనే సూత్రాలను అనుసరించడం అనేది అందరి తక్షణ కర్తవ్యంగా గుర్తెరగాలి. ఆనాడే రాబోయే తరాలకు మనం భద్రమైన భవిష్యత్తును అందించి సుస్థిర అభివృద్ధిని సాధించగలుగుతాం. మెరుగైన పర్యావరణాన్ని ప్రపంచ ఆరోగ్యాన్ని సాధించడానికి గాను చేసే ప్రయత్నమే మిషన్ లైఫ్. గతంలో కూడా పర్యావరణం పరిరక్షణకై శిలాజేతర ఇంధనాలు అవశ్యకతను దృష్టిలో ఉంచుకుని భారత్ అంతర్జాతీయ సౌరవేదిక అనే ప్రతిపాదనను తీసుకువచ్చింది. ఒక సూర్యుడు, ఒక ప్రపంచం, ఒకే గ్రిడ్, అనే కార్యక్రమాన్ని ప్రపంచం ముందు ఉంచింది. చాలా దేశాలు ఈ విషయంలో భారత్ కృషిని ప్రశంసించాయి. ఈ వ్యూహంలో భాగస్వామ్యం కావటానికి కొన్ని దేశాలు తమ సంసిద్ధతను వ్యక్తం చేశాయి. అయితే విధానపరంగా భారత ప్రభుత్వ ప్రతిపాదనలు బాగానే ఉన్నా కార్యాచరణలో మాత్రం వెనుకబడి ఉన్నాయి. పర్యావరణ పరిరక్షణలో అడవులు కూడా ప్రధాన పాత్ర వహిస్తాయి. అయితే ఈ మధ్యకాలంలో ప్రభుత్వం అటవీ చట్టానికి చేపట్టిన సవరణలు చూస్తే 33 శాతం అడవులు కొనసాగింపు అనేది సాధ్యం కాదు అనేది స్పష్టం అవుతోంది. అదేవిధంగా పర్యావరణ కాలుష్యానికి తీవ్రహాని కలిగింపచేసే ప్లాస్టిక్ ఉత్పత్తుల విషయంలో ముఖ్యంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను జులై1వ తేదీ నుండిబ్యాన్ చేస్తున్నాం అని ప్రకటించినా వాస్తవంలో మాత్రం అవి అమలు చేయలేకపోతున్నారు. ఉత్పత్తి దశలోనేవాటిని కట్టడి చేయడంలో విఫలం కావడం మనం చూస్తూనేఉన్నాం. యధేచ్ఛగా నీటి కాలుష్యం వాయు కాలుష్యం జరిగిపోతూనే ఉంది. వెరసి కర్బన ఉద్గారాల కట్టడిలో ఆశించిన లక్ష్యాలను చేరుకోలేకపోయాం. ఈ సందర్భంలో ప్రభుత్వాలు విధానపరంగా పర్యావరణ పరిరక్షణకు చిత్తశుద్ధితో కఠిన చర్యలు చేపట్టిన నాడు ప్రజలు కూడా అదే రీతిలో తమ బాధ్యతలు గుర్తెరిగి ముందుకు వచ్చే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ విధానాల పట్ల చిత్తశుద్ధి చూపకుండా ప్రజల బాధ్యతలు గురించి ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా దాని వలన పెద్ద ఫలితం ఉండకపోవచ్చు. మనం ప్రపంచానికి మార్గదర్శనం చేసే ముందు మన దేశంలో వాటి అమలు ద్వారా సత్ఫలితాలు సాధించిన నాడు మిగిలిన దేశాలు మనల్ని అనుసరిస్తాయి అనడంలో ఎటువంటి సందేహం లేదు. ఆనాడే సుస్థిర అభివృద్ధి లక్ష్యానికి సార్థకత చేకూరుతుంది. ●



# ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించిన ఈశాన్య రుతుపవనాలు

ప్రభాతవార్త, విశాఖపట్నం

ఈశాన్య రుతుపవనాలు, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించాయి. ఈ కాలంలోనే తమిళనాడులో ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ తెలిపింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఈశాన్య రుతుపవనాలు, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించాయి. ఈమేరకు భారత వాతావరణ శాఖ ఓ ప్రకటన చేసింది. తమిళనాడు వార్షిక వర్షపాతంలో ఎక్కువ మొత్తం అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు కొనసాగే ఈశాన్య రుతుపవనాల ద్వారానే నమోదు కానుంది. తమిళనాడు తీరప్రాంతాలు, పుదుచ్చేరి, కరైకాల్, ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ కోస్తా ప్రాంతాల్లోకి ఈశాన్య రుతుపవనాలు ఇవాళ ప్రవేశించినట్టు వాతావరణ శాఖ ప్రకటించింది. బంగాళాఖాతం, దక్షిణ ద్వీపకల్పం మీదుగా ఈశాన్య గాలులు, రుతుపవనాల ప్రభావంతో ఆయా ప్రాంతాల్లో వర్షాలు మొదలైనట్టు తెలిపింది.



## సేవ్ ఉత్తరాంధ్ర పేరుతో విశాఖ ప్రతిష్టను

# దెబ్బతీసే కుట్రలు ఫలించవు

- హేపెనింగ్ సిటీ వైజాగ్ వేదికగా చంద్రబాబు బృందం ఆగడాలు చెల్లవు
- సేవ్ ఉత్తరాంధ్ర పేరుతో వైజాగ్ బ్రాండ్ వాల్యూని తగ్గించే కుట్రలు ఫలించవు

: సామాజిక మాధ్యమంలో రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి

ప్రభాతవార్త, విశాఖపట్నం



తెలుగుదేశం అధినేత, మాజీ సీఎం ఎన్.చంద్రబాబు నాయుడు తన ఏలుబడిలో కలల రాజధాని అమరావతి నగర నిర్మాణం తేలిక కాదని తెలిసి మరీ నాటకాలు ఆడారని వైఎస్ఆర్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి అన్నారు. శనివారం సామాజిక మాధ్యమాల్లో ఓ ప్రకటన విడుదల చేశారు. నాలుగొందల సంవత్సరాలకు పైగా చరిత్ర ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్ నగరంలో సైబరాబాద్ నిర్మాత తానేనని ఆయన గొప్పలు చెప్పుకుంటూనే ఉన్నారని చెప్పారు. చంద్రబాబు హైదరాబాద్ తన పాలనలోనే మహానగరం అయిందనే కల్లబొల్లి కబుర్లతో 2014లో విభజిత ఆంధ్రకు మొదటి సీఎం అయ్యారని అన్నారు. రాజధాని పేరిట గుంటూరు, విజయవాడ మధ్య న్యూ సిటీ కట్టడానికి చంద్రబాబు వేసిన గట్టి పునాది ఆ దిశగా సాగలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం చావు దెబ్బతిన్నాక కూడా అమరావతి కబుర్లతోనే నారా వారు కాలక్షేపం చేశారని గుర్తుచేశారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైసీపీ కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టిందని తెలిపారు. ఉత్తరాంధ్రకు గుండెకాయ విశాఖపట్నాన్ని రాష్ట్రానికి పాలనా రాజధాని చేయాలని సంకల్పించింది. ఆర్థిక పునాదులు పటిష్టంగా ఉన్న వైజాగ్ వైఎస్సార్‌సీపీ పాలనలో శరవేగంతో ప్రగతి పథంలో పరుగులు తీస్తోందని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్షంగా బాధ్యతతో వ్యవహరించాల్సిన తెలుగుదేశం వికృత చేష్టలతో ఉద్యమాల పేరిట విధ్వంసకాండకు తెగబడుతోందని మండిపడ్డారు. చంద్రబాబు అండ్ కంపెనీ అరాచక ఆందోళనలకు ప్రభుత్వం అడ్డుకట్ట వేస్తుంటే విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా చూడడానికి ఇష్టపడని టీడీపీ గావుకేకలు పెడుతోందని దుయ్యబట్టారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధ వల్ల విశాఖపట్నం బ్రాండ్ వాల్యూ ఊహించని రీతిలో పెరుగుతోందని స్పష్టం చేశారు. చంద్రబాబు వర్గీయులు ఏపి రాజధాని అమరావతి అని భీష్మించుకుని కూర్చోవడంతో తమకు ఉత్తరాంధ్రలో నిలువ నీడ దక్కదనే భయంతో సేవ్ ఉత్తరాంధ్ర అంటూ దుర్మార్గమైన నాటకానికి స్క్రిప్టు రూపొందించారని మండిపడ్డారు. కడుపుమంటతో, రాజకీయ అసూయాద్వేషాలతో తెలుగుదేశం తెరతీస్తున్న మిగతా 11లో

# సందడిగా నాగులచవితి పండుగ







విశాఖపట్నం, అక్టోబర్ 29, ప్రభాతవార్త

నాగులచవితి పర్వదినం సందర్భంగా శనివారం భక్తకోటి నాగదేవతకు సంప్రదాయ పూజలు చేశారు. ఉదయం పదిన్నర గంటల వరకే చవితి గడియాలున్న నేపథ్యంలో భక్తులంతా ఉదయం ఆరున్నర గంటల నుంచే పుట్టల వద్దకు క్యూ కట్టారు. ఏయూ గ్రౌండ్, కొండగుడి, జూపార్కు, పోర్టు స్టేడియం, కైలాసపురం, స్టీల్‌ప్లాంట్, సింహగిరి ఘాట్‌రోడ్ తదితర ప్రాంతాల్లో భక్తులతో సందడిగా మారాయి. స్టీల్‌ప్లాంట్ ప్రాంతమంతా భక్తులతో కిక్కిరిసిపోయింది.

ఈ కారణంగా కూర్మన్నపాలెం నుంచి తెలుగుతల్లి విగ్రహం వరకు ట్రాఫిక్ స్తంభించింది. సంప్రదాయ వస్త్రాలను ధరించిన భక్తులు పాలు, గుడ్లు, పుట్టలో పోశారు. పళ్ళు, కాయలు, ప్రత్యేక ప్రసాదాలను పుట్టల వద్ద అరగింపు పెట్టారు. టపాసులు వెలిగించి కుటుంబాల సమేతంగా చవితి సంబరాల్లో మునిగిపోయారు.

## ఉత్తరాంధ్ర ద్రోహుల్లారా...

# ఇంకెంతకాలం బాబుకు ఊడిగం చేస్తారు?

- విశాఖను రాజధానిగా వద్దనే మీరు.. ఉత్తరాంధ్రను సేవ్ చేస్తారా?
- రుషికొండపై ప్రభుత్వ కార్యాలయాలు కడితే తప్పేంటి?
- ఉత్తరాంధ్రను కబ్జా చేసింది బాబు... సేవ చేస్తోంది సీఎం జగన్ : ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి

విశాఖపట్నం, అక్టోబర్ 29, ప్రభాతవార్త



విశాఖను పరిపాలనా రాజధానిగా వద్దనే ఉత్తరాంధ్ర ద్రోహులు, విశాఖ ద్రోహులైన మీరు... విశాఖను సేవ్ చేస్తారా? అది ప్రజలు నమ్మాలా? అంటూ టీడీపీ నేతలను ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి నిలదీశారు. టీడీపీ మాటలు, చేష్టలు చూస్తే... అదొక తెలుగు డ్రామాల పార్టీగా తయారైందన్నారు. విశాఖ పరిపాలన రాజధాని కావడం ఇష్టంలేక, విశాఖ నగరానికి ఏదోఅయిపోతుందని, కబ్జాలు జరుగుతున్నాయని, గంజాయి మాఫియా తయారవుతుందని లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. శనివారం మద్దిలపాలెం సమీపంలో వున్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండు రోజులుగా సేవ్ విశాఖ అంటూ టీడీపీ పదిమందిని పోగేసి, ఒక హైడ్రామా నడిపిస్తోందన్నారు. వాస్తవానికి విశాఖలో భూకబ్జాలు జరిగిందీ, గంజాయి మాఫీయా తయారైందీ.. చంద్రబాబు హయాంలోని, వారి ప్రభుత్వ అండదండలతోనేనని ఆమె వివరించారు. మరోవైపు, వచ్చే నెల 11, 12 తేదీల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితో కలిసి విశాఖకు ప్రధాని నరేంద్ర మోడీ వస్తున్న నేపథ్యంలో.. విశాఖ బ్రాండ్ ఇమేజ్ తగ్గించేందుకు టీడీపీ ఇటువంటి డ్రామాలకు పాల్పడుతుందని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల ఓట్లతో ఎన్నో పదవులు అనుభవించిన మీరు... ఈ రోజు ఉత్తరాంధ్ర ప్రజల నోటివద్ద తిండిని తన్నేస్తారా? తల్లి పాలు తాగి .. తల్లి రొమ్మును గుద్దే నైజం టీడీపీదేనన పేర్కొన్నారు. ఉత్తరాంధ్రపై ప్రేమ లేదని, మమకారం లేదని, చంద్రబాబు కుట్రల్లో భాగమై... ఉత్తరాంధ్రకు ద్రోహం చేయడమే టీడీపీ అజెండా అని వివరించారు. ఎంతకాలం చంద్రబాబుకు ఊడిగం చేస్తూ బతుకుతారో? ఆయన కాలి కింద చెప్పులా ఇంకా ఎంతకాలం పడివుంటారో అనేది కాలమే నిర్ణయిస్తోందన్నారు. మీకు ఎంతో చేసిన ఉత్తరాంధ్ర ప్రజలకు ద్రోహం చేయొద్దు అని, ఇంకా మీరు విషం చిమ్మితే... ఉత్తరాంధ్ర ద్రోహులుగా చరిత్రలో మిగిలిపోతారని, భావితరాలు వారు మిమ్మల్ని క్షమించరని, ఛీ కొడతారంటూ టీడీపీ నేతలకు సూచించారు. రుషికొండలో వున్న ప్రభుత్వ స్థలాల్లో ప్రభుత్వ కార్యాలయాల కోసం అభివృద్ధి చేస్తే తప్పేంటి? అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ఎక్కడున్నాయి? కొండలమీద కాదా? హైదరాబాదులో చంద్రబాబు ఇల్లు ఎక్కడుందని? కొండ మీద కాదా? పర్యావరణానికి ఏమైనా ఇబ్బంది కలిగితే న్యాయస్థానాలు చూసుకుంటాయన్నారు. ప్రభుత్వ స్థలాల్లో ప్రభుత్వ కట్టడాలు కట్టుకుంటుంటే.. మీకేంటి సమస్య అని ప్రశ్నించారు. టీడీపీ హయాంలోనే భూకబ్జాలు అధికంగా జరిగాయని, ఆ భూకబ్జా దారులు నుంచి ప్రభుత్వం స్థలాలను కాపాడిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని ఆమె వివరించారు.

### అధికారంలోకి వస్తారా?

ఎన్నికల్లో సింగిల్‌గా పోటీచేసే ధైర్యమే లేని మీరు.. అధికారంలోకి వస్తారా? అంటూ టీడీపీ నేతలను ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ప్రశ్నించారు. ఉత్తరాంధ్ర నీళ్ళు తాగి.. ఈ ప్రాంతంపై విషం చిమ్ముతున్న మీరు ఇప్పటికైనా బుద్ధి మార్చుకోవాలన్నారు. లేకుంటే.. ఈ ప్రాంతం ప్రజలు మిమ్మల్ని వెంటపడి మరీ కొడతారని ఆమె హెచ్చరించారు.

# ఏవోబీలో భారీ డంప్

## స్వాధీనం చేసుకున్న పోలీసులు

ముంచంగిపుట్టు, అక్టోబర్ 29 ప్రభాతవార్త



ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో మావోయిస్టులకు చెందిన భారీ డంప్‌ను పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టులకు చెందిన పక్కా సమాచారం రావడంతో మల్కన్‌గిరి జిల్లా పోలీసులు, బీఎస్ఎఫ్ బలగాలు కటాఫ్ ఏరియాలో పెద్దఎత్తున గాలింపు చర్యలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఏవోబీలోని మల్కన్‌గిరి జిల్లాలోని జోడోంబో పరిధిలోని కుసుముపుట్టు అటవీప్రాంతంలోని భారీ డంప్‌ను పోలీసులు గుర్తించారు. ఈ డంప్‌లో ఆయుధాలతో బాటు భారీ పేలుడు సామాగ్రిను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ డంప్‌లో 303 రకం తుపాకీలు -3, గ్యాస్ గన్‌లు-2, దేశవాళీ తుపాకీలు -4, మందుపాతరలు-2, గ్రెనెడ్లు-2, డిటోనేటర్లు-20తో పాటు భారీఎత్తున పేలుడు సామగ్రి, విప్లవ సాహిత్యం, తదితర సామగ్రిను స్వాధీనం చేసుకున్నారు. ఈ పేలుడు పదార్థాలు ఏవోబీ ఎస్‌జెడ్‌సీ మావోయిస్టు క్యాడర్‌కు చెందినదిగా పోలీసులు భావిస్తున్నారు. ఈ పేలుడు సామగ్రి, ఆయుధాలను అమాయక పౌరులు, భద్రతా బలగాలను లక్ష్యంగా చేసుకుని వారిని హతమార్చడానికి ఈ డంప్‌ను ఉంచినట్టు పోలీసులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో గాలింపు చర్యలను కొనసాగిస్తున్నట్టు బీఎస్ఎఫ్ అధికారులు పేర్కొన్నారు.

# విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు భద్రతాచర్యలు చేపట్టాలి

## ఏపీఈపీడీసీఎల్ సీఎండి కె.సంతోషరావు

విశాఖపట్నం, అక్టోబర్ 29 ప్రభాతవార్త



విద్యుత్తు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ... ప్రమాదాలను నివారించాలని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు తెలిపారు. ఇళ్లు, భవన నిర్మాణాల సమయంలో నిర్మాణదారులు తగిన రక్షణ చర్యలు చేపట్టకుండా అజాగ్రత్తగా ఉండడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిని నివారించేందుకు కొన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు పాటించాలని సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమగోదావరి సర్కిళ్ల వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా పొలాల్లో కానీ, ఇతర ఏ ప్రదేశంలోనైనా విద్యుత్ ప్రసారం జరిగే తీగలు (కండక్టర్) తెగి పడి ఉంటే వాటిని నేరుగా తాకరాదని వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి, టోల్ ఫ్రీ నెంబరు 1912కి తెలియజేయాలని సూచించారు. వినియోగదారులు వారి భవనాల ఆవరణలోని అంతర్గత వైరింగ్‌కు ఉపయోగించే విద్యుత్ వైర్లు, స్విచ్‌లు, పరికరాల్ని నాణ్యత (ఐఎస్ఐ) కలిగిన వాటిని ఉపయోగించడం ద్వారా ప్రమా దాలను నివారించవచ్చని తెలిపారు. ఇళ్లలోని స్విచ్ బోర్డులను పిల్లలకు అందనంత ఎత్తులో అమర్చుకోవాలని, ప్రతీ ఇంటి విద్యుత్ సర్వీస్‌కు, ఇంట్లో ఉపయోగించే పరికరాలకు తప్పనిసరిగా ఎర్త్‌వైర్ ద్వారా ఎర్తింగ్ ఏర్పాటు చేసి ప్రమాదాల్ని అరికట్టవచ్చన్నారు. ఇళ్ల డాబాలపైన దుస్తులు ఆరవేసేటప్పుడు, ఇళ్ల నిర్మాణ ప్రాంతాల్లో ఇళ్లపైన, సమీపాన విద్యుత్ సరఫరా ఉంటే నిబంధనల ప్రకారం తగినంత దూరం పాటించాలన్నారు.

# అల్లూరి మన్యంలో ప్రారంభమైన చలి పంజా

## పాడేరులో 13 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

పాడేరు, అక్టోబర్ 29,ప్రభాతవార్త



అల్లూరి సీతారామరాజు జిల్లా మన్యంలో చలి తీవ్రత ప్రారంభం అయింది. మన్యంలో చలి మంచు గత వారం రోజులుగా కురుస్తూ ఉండటంతో మన్యంలో నివసిస్తున్న ప్రజలు స్వెట్టర్లు, జర్కీనీలు, శాలువా కప్పుకుంటూ చలి శరీరానికి తగలకుండా ఉండేలా జాగ్రత్తలు పడుతున్నారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో శనివారం ఉదయం 13 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. చలి తీవ్రత రానున్న రోజుల్లో మరింత పెరెగే అవకాశాలు ఉన్నాయని పర్యావరణ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. శనివారం పాడేరు పట్టణంలో చలి మంచు కుస్తుండటం ప్రజలు వారి వారి పనుల



నిమిత్తం బయటకు వచ్చి వెళుతున్నారు. గిరిజన రైతులు పండించే అల్లం, టమోటా, కర్రపెండ్లం, బంతి పూలు ఇతర అటవీ ఉత్పత్తులు విక్రయించడానికి చలిలోనే వణుకుతూ పాడేరు కేంద్రానికి వచ్చి వక్రయాలు చేస్తున్నారు. చలి తీవ్రత ఎక్కువ కావడంతో రోడ్డుపక్కనే చలి మంటలు వేసుకుంటూ ప్రజలు కొంత సేపు ఉపసమనం పొందుతున్నారు.

పాడేరు అంబేద్కర్ జంక్షన ప్రదేశం అంతా మంచు కురుస్తున్నా గిరిజన రైతులు విక్రయాలకు తీసుకువచ్చే అటవీ ఉత్పత్తుల క్రయ విక్రయాలతో సందడిగా మారింది. చలి మంచు రాత్రి 10 గంటల నుంచి మొదలై ఉదయం 8 గంటల వరకూ మంచు కురుస్తుండటంతో వాహనాలు నడిపే వాహనచోదకులు ఎల్లో లైట్లు వేసుకుంటూ అప్రమత్తంగా వాహనాలను నడుపుతున్నారు.

# ఇళ్లు పట్టాల పంపిణీ కార్యక్రమంలో ముత్తంశెట్టి

భీమునిపట్నం, అక్టోబర్ 29 ప్రభాతవార్త



భీమిలి నియోజకవర్గంలో శనివారం జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ బీసీ కాలనీ పార్కులో జగనన్న ఇల్లు పట్టాలు పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గం శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు రుషికొండ సాగర్ నగర్‌లో రూ.1 కోటి 85 లక్షల వ్యయ నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 8వ వార్డులో 872 మంది లబ్ధిదారులకు ముత్తంశెట్టి చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు అందివ్వడం చేశారు. అనంతరం ముత్తంశెట్టి మాట్లాడుతూ ప్రతీ పేదవాడి కళ్లల్లో ఆనందం చూడటమే జగనన్న లక్ష్యం అని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షపాతి అని, ఎలాంటి పైసా లంచంలేకుండా ఒక్క విశాఖ జిల్లా లోనే 1,32,000 మంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు చేసి ఇంటి పట్టాలు ఆనందపురం మండలం తంగుడు బిల్ల ప్రాంతంలో అందివ్వడం జరిగిందని అలా అందివ్వడం కేవలం జగన్‌కే చెందిందని గతంలో ప్రతిపక్షం వారు పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనీయకుండా కోర్టులో కేసు వేయడం వలన ఆలస్యం అయ్యిందని ఎవరు కుట్రలు ఎన్ని పన్నినా ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రతీ పేదవాడి సొంతింటి కలను ఆపలేరని, జగనన్న కట్టి ఇస్తున్నది ఇళ్లు కాదని ఏకంగా ఒక ఊరే కట్టి అవసరమైన సదుపాయాలతో నిర్మించి ఇస్తున్నారని ఎవరు అమ్ముకునే ఆలోచన చేయవద్దని అన్నారు. ఇళ్ల పట్టాలు అందుకున్న లబ్ధిదారులు సంతోషంతో ధన్యవాదాలు తెలుపుతూ జై జగన్ జై అవంతి అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, హౌసింగ్ అధికారులు, వార్డు కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జులు, వార్డు ప్రెసిడెంట్లు, ఆయా పదవుల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.



## ఘనంగా నాగులచవితి వేడుకలు

గాజువాక, అక్టోబర్ 29, ప్రభాతవార్త



నాగుల చవితి సందర్భంగా గాజువాక నియోజకవర్గంలో భక్తి శ్రద్ధలతో ఎంతో ఘనంగా నిర్వహించుకున్నారు. వేకువ జామున లేచి చిమ్మిలి, చలిమిడి, వడపప్పు, గుడ్లు, పాలు, చెరుకు వంటి పదార్థాలను సిద్ధం చేసుకొని పుట్టకు వేసి కుటుంబ సమేతంగా పాలు పోశారు. పుట్ట వద్ద బాణసంచా కాల్చి పండగ వాతావరణం తీసుకొచ్చారు.



87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ కుటుంబ సమేతంగా చవితి పండగను చేశారు. అనంతరం ప్రజలందరికీ నాగుల చవితి శుభాకాంక్షలు తెలిపారు. 69వ వార్డు నాతయ్యపాలెంలో వార్డు వైసీపీ అధ్యక్షులు, ఏపీ ఔట్ సోర్సింగ్ డైరెక్టర్ బోగాది సన్యాసిరావు కుటుంబంతో కలిసి పుట్టకు వెళ్లి నాగుల చవితి పండగను నిర్వహించారు. ప్రజలంతా సుఖ:సంతోషాలతో ఉండాలని ప్రార్ధించామన్నారు. కణితికాలనీలో 87వ వార్డు వైసీపీ సీనియర్ నాయకులు, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి దుగ్గపు దానప్పలు, జిల్లా వైసీపీ కార్యదర్శి బొడ్డ గోవిందలు తమ తమ కుటుంబాలతో పుట్టకు వెళ్లి పాలు పోసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.





## కేంద్రమంత్రి నిర్మల సీతారామన్‌కు ఘన వీడ్కోలు పలికిన నేతలు

గాజువాక, అక్టోబర్ 29, ప్రభాతవార్త



విశాఖ పర్యటన ముగించుకొని తిరిగి ఢిల్లీకి పయనమైన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్‌కు విశాఖ ఎయిర్‌పోర్టులో రాజ్యసభ ఎంపీ జీవీఎల్ నరసింహారావు, ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్ర, మాజీ శాసన సభ్యులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణుకుమార్‌రాజుతో కలిసి ఎయిర్‌పోర్ట్ అడ్వైజ కమిటీ సభ్యులు, గాజువాక నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. విశాఖలో పార్టీ బలోపేతానికి చేస్తున్న కార్యక్రమాలను నిర్మలా సీతారామన్‌కు వివరించారు. పార్టీ పటిష్టతకు చేయవల్సిన సూచనలను, సలహాలను నిర్మలాసీతారామన్ దిశ నిర్దేశం చేశారు.

## వైద్య వృత్తిలో నైపుణ్యాలు పెంచుకోవాలి

పిఎంపాలెం, అక్టోబర్ 29, ప్రభాతవార్త



ఎన్‌టిఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల గీతం దంతవైద్య కళాశాల, ఆసుపత్రి ఆధ్వర్యంలో 16వ పట్టభద్రుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బ్యాచులర్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ (బిడిఎస్), మాస్టర్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ (ఎండిఎస్) కోర్సులు పూర్తి చేసుకున్న 286 మంది వైద్య విద్యార్థులకు ఈ సందర్భంగా డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జాతీయ కార్యవర్గ సభ్యుడు గురుగోవిందసింగ్ ఇంద్రప్రస్థ విశ్వవిద్యాలయ (న్యూఢిల్లీ) వైస్ ఛాన్సలర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ మహేష్ వర్మ స్నాతకోత్తర డిగ్రీలను అందజేశారు. దంత వైద్య విద్యార్థిని డాక్టర్ అల్లిన శ్రావ్యకి డిగ్రీ పట్టాను అందజేశారు. డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జాతీయ కార్యవర్గ సభ్యుడు గురు గోవింద్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక తరలింపు సంగతి తేల్చండి

### -బాధ్యులపై చర్యలు ఎందుకు తీసుకోలేదు : టీడీపీ నేత కొప్పిశెట్టి వెంకటేష్

నక్కపల్లి, అక్టోబర్ 29, ప్రభాతవార్త



నక్కపల్లి ఇసుక ర్యాంపులో జరుగుతున్న అక్రమాలపై ఎందుకు దృష్టిపెట్టడం లేదని బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మండల టీడీపీ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, తహశీల్దార్ సుబ్రహ్మణ్య శాస్త్రిని కలిసి అడిగారు. గత కొద్దిరోజులుగా క్రితం నుంచి ఇసుకలో అక్రమాలు జరుగుతున్నాయని, తూర్పుగోదావరికి తరలిపోతుందని రెండురోజుల క్రితం కూడా ఇసుక తరలిపోతున్న విషయం పట్టుకున్న మూడు వాహనాలు కూడా అప్పజెప్పినప్పటికీ ఆ వాహనాలు సంగతి ఏమైంది. వారిపై ఎందుకు పోలీస్ కేసునమోదు చేయలేదని నిలదీశారు. పేదలు ఇసుక లేక ఇబ్బంది పడుతుంటే ఇలా పక్క ప్రాంతాలకు ఎటువంటి రశీదు లేకుండా ఇసుక తరలిపోతుంటే మీ దృష్టికి రాలేదా అంటూ అడిగారు. తహశీల్దార్ సుబ్రహ్మణ్య శాస్త్రి ఇప్పటివరకు మొదటి వాహనాలను కార్యాలయం సమీపంలో తలయారిలను కాపలా పెట్టి ఉంచామని తహశీల్దార్ చెప్పగా, రాత్రి సమయాల్లో వారిని బెదిరించి తీసుకుపోయారని, అసలు ఏం జరుగుతుందని, ఇది చాలా దారుణమైన విషయమని తహశీల్దార్ ఎదుట టీడీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే బాధ్యులైన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని, ఎటువంటి పర్మిట్‌లు లేకుండా ఇసుక తరలిస్తున్న వాహనాల సంగతి తేల్చాలని, పోలీస్ కేసు నమోదు చేయాలని వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ అక్రమాలకు కర్త ఎవరు వేయకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఆయనతో పాటు తహశీల్దార్‌ను కలిసిన వారిలో జిల్లా నాయకులు గింజాల లక్ష్మణరావు, వైజాయిలి రమణ, ఆకేటి శాంతి, ఆయనిపుశెట్టి అప్పలరాజు, కొండ్ర కనకారావు, గింజాల శ్రీను, కోసూరి శ్రీను, అద్దూరి లోవరాజు, అల్లాడ రాము, సన్యాసిరావు, తాతారావు, కర్రి వెంకట సత్యనారాయణ ఉన్నారు.

## రాజయ్యపేటలో డెంగ్యూ కేసు నమోదు

### - అప్రమత్తమైన అధికారులు, వైద్యసిబ్బంది - యుద్ధప్రాతిపదికన శానిటేషన్ పనులు

నక్కపల్లి, అక్టోబర్ 29, ప్రభాతవార్త



మండలంలోని రాజయ్యపేట గ్రామంలో డెంగ్యూ కేసు నమోదు కావడంతో అటు అధికారులు, ఇటు పంచాయితీ సిబ్బంది, వైద్యసిబ్బంది అప్రమత్తమయ్యారు. గ్రామ సర్పంచ్ పిక్కి అప్పలస్వర్ణ హుటా హుటిన గ్రామంలో స్ప్రే చేయించి, యుద్ధప్రాతిపదికన పారిశుద్య పనులు చేపట్టారు. గ్రామానికి చెందిన 15ఏళ్ల బాలికకు డెంగ్యూ సోకినట్లు వైద్య పరీక్షల్లో గుర్తించారు. ఈమేరకు విషయం తెలుసుకున్న గొడిచర్ల పిహెచ్‌సి సిబ్బంది, పంచాయితీ సర్పంచ్ అప్పలస్వర్ణ, జెడ్పిటిసి గోసల కాసులమ్మ, పంచాయితీ కార్యదర్శి ముందస్తుగా చర్యలు చేపట్టారు. గ్రామం మొత్తం స్ప్రే చేయించారు. వారితో పాటు పిక్కి కాసేశ్వర్రావు, కార్యదర్శి పి.వి.పి. రాజశేఖర్, వార్డు సభ్యులు సత్తయ్య, కొండలరావు, వైద్యసిబ్బంది సత్యనారాయణ, ఎం.పార్వతి, వెంకట లక్ష్మిలు ఉన్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే సర్పంచ్ స్పందించి గ్రామంలో అందరినీ అప్రమత్తం చేయడం పట్ల సర్పంచ్‌ని అభినందించారు.



## ఘనంగా నాగులచవితి వేడుకలు

కశింకోట, అక్టోబరు 29, ప్రభాతవార్త



మండలంలో శనివారం నాగులచవితి వేడుకలు ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కుటుంబ సమేతంగా నాగేంద్రుని పుట్టల వద్దకు వెళ్ళి పసుపుకుంకుమ, పండ్లు, కాయలు, పుష్పాలతో పుట్టల వద్ద ప్రత్యేకంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో భక్తులు పూజలు చేశారు. తమ మొక్కులు చెల్లించి నాగేంద్రస్వామి వారిని వేడుకున్నారు.

## ఇంట్లోనే పాములపుట్ట..

### 20 ఏళ్లుగా నాగులచవితి రోజు ప్రత్యేక పూజలు

పాడేరు, అక్టోబర్ 29,ప్రభాతవార్త



పాములపుట్టు నివసిస్తున్న ఇంట్లోనే పుట్టడంతో ఆపుట్టుకు గత 20 సంవత్సరాలుగా నాగుల చవితి రోజు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తూ ఆ పుట్ట పుట్టిన ఇంటి గదిని పూజా మందిరంగా మార్చిన గిరిజన మహిళ ఉదంతమిది. పెదబయలు మండలం కిముడుపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న తలారి నీలమ్మ ఇంట్లో గత 20 సంవత్సరాల క్రితం పాములపుట్ట వెలిసింది. దీంతో నీలమ్మ సాక్షాత్తు నాగేంధ్రస్వామి ఇంట్లో వెలిసారడని విశ్వాసంతో పాములపుట్టను తొలగించకుండా పుట్ట వెలసిన గదిని పూజా మందిరంగా ఏర్పాటు చేసి పాములపుట్టకు నీలమ్మ అలాగే ఆ గ్రామనికి చెందిన గిరిజనులు ప్రత్యేక పూజలు చేస్తూ పూజిస్తున్నారు. ప్రతీ ఏడాది వచ్చే నాగులచవితి రోజున తలారి నీలమ్మతో పాటు వారి కుటుంబ సభ్యులు,కిముడుపల్లి గ్రామంలో ప్రజలు ఇంట్లో వెలసిన పాములపుట్టు వద్దకు వచ్చి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేయడమే కాకుండా పుట్టలో పాలు పోయడం గ్రుడ్ల వేస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ వచ్చారు. ఈ ఏడాది కూడా నాలుగచవితి పండుగను ఇంట్లో ఉన్న పుట్టవద్దే ప్రత్యేక పూజలు నిర్వహించి పాలు పోసి గ్రుడ్లు పుట్టలో వేసారు.తన ఇంట్లో పుట్ట వెలిసి ఉండటం వలన అన్నీ శుభకార్యాలే జరుగుతున్నాయని తలారి నీలమ్మ పేర్కొన్నారు.

## నిర్మలా కిషోర్‌కు ఘన సత్కారం

గాజువాక, అక్టోబర్ 29, ప్రభాతవార్త



గాజువాక పాత కర్ణవానిపాలెంలో నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు క్యాంపు కార్యాలయంలో బీజెపి రాష్ట్ర మహిళ మోర్చా అధ్యక్షురాలు శ్రీమతి నిర్మలాకిషోర్ ముఖ్య అతిధిగా పాల్గొని ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం రివ్యే సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి ఉమ్మిడి సుజాత అధ్యక్షత వహించారు. ముందుగా స్థానిక నాయకురాలు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీమతి రోహిని నియోజకవర్గంలో మహిళ మోర్చా ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని వివరించారు. ఈ సందర్భంగా నిర్మలా కిషోర్ మాట్లాడుతూ మరో 10 రోజుల్లో ఓటరు నమోదు సమయం పూర్తవుతుంది కాబట్టి ఇప్పటివరకు ఇచ్చిన అప్లికేషన్లు సంభందిత తహశీల్దార్ కార్యాలయంలో, జీవీఎంసీ కార్యాలయాల్లో అందజేయాలన్నారు. కార్యక్రమంలో పి.లక్ష్మీసంతోషి, శ్రీదేవి, జీలకర్ర భువనేశ్వరి, కట్టా పద్మ, పుష్పలత, గీతాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## పేట ఎల్‌టి కాలనీ వద్ద వైద్య పరీక్షలు

పాయకరావుపేట, అక్టోబర్ 29 ప్రభాతవార్త



పాయకరావుపేట పట్టణ పిహెచ్‌సి పరిధి ఎల్‌టికాలనీ ప్రాంతం వద్ద శనివారం ఫ్యామిలీ కాన్సెప్ట్ క్లినిక్ కార్యక్రమంలో భాగంగా గర్భిణీస్త్రీలు బాలింతలను బిపి, షుగర్, థైరాయిడ్, క్యాన్సర్, పక్షవాతం, గుండెజబ్బులు, తదితర వ్యాదులతో బాదపడుతున్న రోగులు అందరికీ పిహెచ్‌సి వైద్యాదికారిణి పద్మశ్రీ, 104 వైద్యాధికారి బత్తులరత్నశేఖర్ సంయుక్తంగా పరీక్షలు చేసి మందులు పంపిణీచేశారు. 41మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. మీ యొక్క అనారోగ్య సమస్యలు ఉంటే ఈ ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ క్లినిక్‌ద్వారా వైద్యసేవలు తప్పకుండా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమాన్ని జెడ్పీటీసి లంకసూరిబాబు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎస్‌నాగేశ్వరరావు, ఇవో రమణ. విజయకుమార్, హెల్త్ అసిస్టెంట్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షార్టుసర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధం-బాధితునికి సహాయం

పాయకరావుపేట రూరల్, అక్టోబర్ 29 ప్రభాతవార్త



విద్యుత్‌షార్టుసర్క్యూట్ ప్రమాదంలో పూరిగుడిశె దగ్ధం చెందింది. పాయకరావుపేట మండలం శ్రీరామపురం గ్రామంలో గతరోజురాత్రి జరిగిన ప్రమాదంలో జి చంటి గుడిశెపూర్తిగా దగ్ధం చెందడంతో బాదితునకు సహాయం చేయడంలో సర్పంచ్ గారా కృష్ణప్రసాద్ స్పందించారు. ఈ విషయాన్ని తహసిల్దారు జయప్రకాష్‌కు తెలియచేసారు. బియ్యం, వంటనూనె, పప్పులు వంటి నిత్యావసర సరుకులను బాదితకుటుంబానికి అందచేసారు.

## శ్రీరామపురంలో ఇంటింటికీ పైపులైనులు

పాయకరావుపేట రూరల్, అక్టోబర్ 29 ప్రభాతవార్త



పాయకరావుపేట మండలం శ్రీరామపురం గ్రామంలో శనివారం కాపువీదిలో ఇంటింటికీ త్రాగునీటి పైపులైనులు వేసే కార్యక్రమం జరిగినట్లు సర్పంచ్ గారాక్రిష్ణప్రసాద్ తెలియచేసారు. గ్రామంలో తాగునీటిసౌకర్యాల కల్పనలో భాగంగా పైపులైనులు వేస్తున్నట్టు సర్పంచ్ తెలిపారు. ఇంటింటికీ పైపులైనులు ఏర్పాటుచేయడం ద్వారా తాగునీటి ఇబ్బందులు దీంతో తొలగుతాయన్నారు.

## నాటుసారాపై జరిపిన దాడుల్లో 40 లీటర్ల సారాతో పాటు ఒకరి అరెస్ట్

నక్కపల్లి, అక్టోబర్ 29 ప్రభాతవార్త



నక్కపల్లి, పాయకరావుపేట మండలాలలో నాటుసారాపై జరిపిన దాడుల్లో 3 కేసులు నమోదుచేసి ఒకవ్యక్తిని అరెస్టు చేశామని 40 లీటర్ల సారాతో పాటుగా ఒకద్విచక్రవాహనం, 1550 లీటర్ల సారాపులుపు ధ్వంసం చేసినట్టు ఎస్‌హెచ్‌ఓ ఎస్ఇబి ఎన్‌ఫోర్సు మెంటు సిఐ తేజోవెంకటకుమార్ తెలియజేశారు. నక్కపల్లి మండలం సిహెచ్‌లక్ష్మీపురం గ్రామంలో 350 లీటర్ల వాష్‌ను ధ్వంసం చేశామని అలాగే చినదొడ్డిగల్లు గ్రామంలో 1200 లీటర్ల వాష్ ధ్వంసం చేసినట్లు తెలిపారు. పాయకరావుపేట మండలం ఈదటం గ్రామంలో 40 లీటర్లు నాటుసారా అలాగే ద్విచక్రవాహనాన్ని స్వాధీనంచేసుకున్నట్లు తెలిపారు. ఎస్‌రాయవరం మండలం గుర్రాజుపేటలో నాటుసారా తయారీ అమ్మకాలు వల్ల కలిగే అనర్థాలు కేసులు ఇబ్బందులు తదితర అంశాల పట్ల అవగాహనా కార్యక్రమం నిర్వహించినట్టు ఎన్‌ఫోర్సు మెంటు సిఐ తేజోవెంకటకుమార్ తెలియజేశారు.



## ఘనంగా నాగుల చవితి పండుగ

మాకవరపాలెం అక్టోబరు 29 ప్రభాతవార్త



మండలంలోని అన్ని గ్రామాల్లో నాగుల చవితి పండుగ అత్యంత సాంప్రధాయ పద్ధతిలో జరుపుకున్నారు. ఈమేరకు శనివారం తెల్లవారు జామునుంచే గ్రామాల్లో ప్రతీ ఇంట సోభాయమానంగా అలంకరించుకున్నారు. ప్రధానం పల్లెలో రైతులు నిత్యం పంట పొలాల్లో తిరిగే వారికి నాగులు కనిపించడం పరిపాటి. అందుకే రైతులు ప్రధానంగా వారి భూముల్లోనే పట్టల వద్ద నాగరాజుకు పూజలు చేస్తుంటారు. మండలంలో ఏగ్రామంలో చూసినా ప్రజలు మరి ముఖ్యంగా మహిళలు గుంపులు గుంపులుగా తరలి వెళ్లి పట్టల్లో పాలు,గుడ్లు పోసేందుకు వెళ్లారు. నిత్యం పంటపొలాల్లో తిరిగే తమకు నాగురాజు నుంచి ఎటువంటి ప్రమాధం సంబవించకుండా చల్లగా చూడాలంటూ వారి పూజలు చేశారు.

## అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో ఘనంగా నాగులచవితి పండుగ

### పాడేరు సబ్‌కలెక్టర్ అభిషేక్ పుట్ట వద్ద ప్రత్యేక పూజలు

పాడేరు, అక్టోబర్ 29,ప్రభాతవార్త



అల్లూరి జిల్లా కేంద్రం పాడేరుతో పాటు అల్లూరి జిల్లా మన్యంలో నాగులచవితి పండుగను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. శనివారం నాగులచవితి పండుగ కావడంతో పుట్టులోఉన్న నాగేంద్రునికి ప్రత్యేక పూజలు చేసి పుట్టులో పాలు, గ్రుడ్లు పోసి ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు. పుట్ట పూజలు చేసి పాలు పోయడానికి ప్రజలు పుట్టల కోసం భక్తులు పొలాలను, కొండలను వెతుకుతూ పుట్టలు కనిపించడంతో పుట్ట ఉన్న ప్రదేశాన్ని శుభ్రం చేసి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టలో కోడి గ్రుడ్లు, పాలు తదితర వాటిని పుట్టలో పోసిన అనంతరం నాగేంద్రునికి ప్రత్యేకంగా పూజలు భక్తిశ్రద్ధలతో



చేశారు. పుట్ట వద్ద మందుగుండు సామాగ్రి కాల్చుతూ నాగుల చవితి పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు చేసేందుకు కుటుంబ సమేతంగా అందరూ కలసి వెళ్లడంతో పుట్ట దగ్గర భక్తులతో కిటకిటలాడింది.నాగులచవితి పండుగను అల్లూరి మన్యంలో ప్రతీ గిరిజన గ్రామాల్లో భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పాడేరు సెయింటెన్స్ కాన్వెంట్ ఎదురుగా ఉన్న పెద్ద పుట్ట వద్ద పాడేరు సబ్‌కలెక్టర్ వి.అభిషేక్ కుటుంబ సభ్యులతో వచ్చి పుట్టవద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టలో పాలు, గ్రుడ్డను పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## పట్టభద్రుల ఎన్నికలకు సంబందించి అర్హత గల అందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

నక్కపల్లి, అక్టోబర్ 29 ప్రభాతవార్త

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం పట్టబద్రుల నియోజకవర్గం ఎన్నికలకు సంభందించి ఈనెల 1నుండి వచ్చేనెల నవంబర్ 7వ తేదీవరకూ ఫారం18లో డిగ్రీ అలాగే దానికి సమానమైన అర్హతగల అందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవలసిందిగా అలాగే ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌ద్వారా ధరఖాస్తులు చేసుకోవచ్చునని తహసిల్దార్ సుభ్రహ్మణ్యశాస్త్రి తెలియచేసారు. పాయకరావుపేట నియోజకవర్గంలో ఉన్న ఓటర్లుకు ఈ విధంగా తెలియ చేసారు. సహాయక ఓటర్ల అధికారులు (తహాశీల్దార్లు) కోటవురట్ల, పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్‌రాయవరం అలాగే డిజిగ్నేటివ్ అధికార్లుగా మండలప్రజాపరిషత్ అభివృద్ధి అధికారులు కోటఉరట్ల, పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్‌రాయవరం వారియొక్క కార్యాలయంలో అలాగే బూత్‌స్థాయి అధికారులుగా పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ అధికారులు అందరూ వారికి సంభందించిన గ్రామాల్లో జిల్లాకలెక్టర్ వారి ఆదేశాల మేరకు 30వ తేదీన స్పెషల్‌క్యాంపు యాన్‌డే ఉన్నందున ఫారం 18 అప్లికేషన్లు వారివద్ద అందుబాటులో ఉంటాయని అవి తీసుకుని వాటితోపాటు డిగ్రీ అర్హత, నివాసం, ఆధార్ కార్డునకలు వీటిమీద గెజిటెడ్ అధికారిచే సంతకం చేయించి దర ఖాస్తుతో పాటుసంబందిత నకల్లు జతపరచి అన్నికార్యాలయాల్లో స్వీకరించడం జరుగుతుందని తెలియచేసారు.

## నాగులచవితి నాగేంద్రుడి ప్రత్యేక పూజలు

గొలుగొండ, అక్టోబర్ 29, ప్రభాతవార్త



భక్తి శ్రద్ధలతో ప్రతీఒక్కరు నాగులచవితి పండగను ఘనంగా నిర్వహించారు. ప్రతీ ఒక్కరు కుటుంబ సమేతంగా చివితికి పుట్టలో పాలు పోసేందకు తమ తమ పంటపోలాల్లో ఉన్న పుటట్లవద్దకు తరలివెళ్ళారు. పిత్రు దేవతలకు వడ్డనలు చేసి చెరుగడలు మూనచేర్చి పూజలు జరిపారు. అనంతరం బయలుదేరి పుట్టవద్దకు చేరుకొని పుట్టను శుభ్రంచేసి అలంకరించి కొత్త నాగుల పంచిని పుట్టపై ఉంచి పూజలు జరిపారు. తమ పేర్లుపై నాగేంద్రుడికి గుడ్లు వైసి చలివిడి, సిమ్మిడి పుట్టలో వేసి ఆవుపాలతో నాగేంద్రుడికి పాలాభిషేకం చేశారు. పిల్లలు పెద్దలు ప్రతీ ఏడాదిలాగే సమూహంగా తరలివెళ్ళి సంతోషంగా పూజలు చేసి తమ యందు కరుణ చూపాలని కోరుకున్నారు. పగలు రాత్రి వేళ్ళల్లో పంటలను కాపాడేందుకు తిరిగే తమను కాపాలని కోరుకుంటూ పూజించారు.

## కోర్కెలు తీర్చే నా'రాజా'.. కరుణించి కాపాడు నాగరాజా

### మండలంలోని పలు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో 'నాగులచవితి'

కొయ్యూరు, అక్టోబర్ 29, ప్రభాతవార్త



శనివారం మండలంలోని పలుగ్రామాల్లో నాగుచవితి పండగ సంధర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేకపూజలు నిర్వహించారు. కోర్కెలుతీర్చే నాగన్నా,కరుణించి కాపాడు నాగరాజా..అంటూ ఇంటిల్లిపాది భక్తులు పిల్లాపాపలతో గ్రామాలకుదరిలోని చేలల్లోని నాగుపాముపుట్టలవద్దకు చేరుకుని పాలు,గుడ్లు తదితర సాంప్రదాయ వంటకాలతో నాగేంద్రునికి నైవేద్యంపెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టలవద్ద సాంప్రదాయంగా టపాసులు పేల్చుతూ సందడిచేశారు. పలుగ్రామాల్లోని పొలిమేరలన్నీ నాగులచవితి పండగసందడితో కళకళలాడాయి. ఈ ఏడాది సాంప్రదాయ దీపావళి పండగకళ మండలంలో ఏమాత్రం కానరాకపోవడంతో సాంప్రదాయ పండగ ప్రియులు కొంతనిరాశకు లోనయ్యారు. శనివారం నాగులచవితి సంధర్భంగా మాత్రం ప్రతీగ్రామంలో పండగ కళ చోటుచేసుకుంది. మండలకేంద్రమైన రాజేంద్రపాలెం, కొయ్యూరు, సూరేంద్రపాలెం, శింగవరం తదితర గ్రామాల్లో గతేడాదికంటే ఈ ఏడాది నాగులచవితి పండగ సందడి పెరిగినట్టు కనబడింది.

## ప్రజలకు సుఖశాంతులు, అష్టఐశ్వర్యాలు కలగాలి

### నాగులచవితి ప్రత్యేక పూజలో అరకు ఎంపి మాధవి దంపతులు

కొయ్యూరు, అక్టోబర్ 29, ప్రభాతవార్త



ప్రజలకు సుఖశాంతులు, అష్టఐశ్వర్యాలు కలుగజేయాలి తండ్రీ'అంటూ అరకుఎంపి గొడ్డేటిమాధవి, శివప్రసాద్ దంపతులు నాగులచవితి పండగసంధర్భంగా శనివారం నాగేంద్రునికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. మండలంలోని తమ స్వగ్రామమైన శరభన్నపాలెంలో సాంప్రదాయవస్త్రధారణతో నాగరాజు పుట్టవద్ద ఎంపిమాధవి దంపతులు ప్రత్యేకపూజలు నిర్వహించడం చూపరులను ఆకట్టుకుంది. నిత్యం ఏదోఒక సేవాకార్యక్రమం లేదా, ప్రభుత్వ కార్యక్రమంలో నిమగ్నమై బిజీబిజీగా ఉండే అరకు ఎంపి మాధవి, భర్త శివప్రసాద్ సాంప్రదాయ నాగులచవితి పండగకు ప్రత్యేకప్రాధాన్యత నిచ్చి పూజలు నిర్వహించడం సాంప్రదాయ పండగలను గౌరవించడమే నంటూ పలువురు అభిప్రాయడుతున్నారు. ఈ ప్రత్యేకపూజల్లో ఎంపిమాధవి కుటుంబీకులు, పలువురు గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదుకై ప్రతీఒక్కరూ కృషిచేయాలి

### మండల సమావేశంలో టిడిపి నేతల తీర్మానం

కొయ్యూరు, అక్టోబర్ 29, ప్రభాతవార్త



పార్టీ సభ్యత్వ నమోదుకై ప్రతీఒక్కరూ తమవంతు కృషిచేసి తద్వారా పార్టీని మరింత బలోపేతంచేసుకోవాలని మండల టిడిపినేతలు తీర్మానించారు. శుక్రవారం మండలంలోని కొయ్యూరులో మండల టిడిపిప్రధాన కార్యదర్శి తోటదొరబాబు ఇంటి వద్ద మండల టిడిపినేతలు సమావేశంలో నిర్వహిం చారు. ఈ సంధర్భంగా పంచాయితీలవారీగా బాధ్యులను గుర్తించి ఆన్‌లైన్‌ద్వారా సభ్యత్వాలు నమోదు చేసేవిధంగా లింకులను ఇవ్వడం జరిగింది. ఈ సంధర్భంగా టిడిపినేతలు మాట్లాడుతూ పార్టీకుటుంబ సభ్యులంతా విధిగా భ్యత్వంచేయించుకోవాలని, అలాగే మరొకరితో సభ్యత్వం నమోదుచేయించాలని కోరారు. కేవలం రూ.వందతో పొందిన టిడిపిసభ్యత్వంతో రూ.2లక్షల భీమా పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గొలిసింగిసత్యనారాయణ, ప్రధానకార్యదర్శి తోట దొరబాబు, రాష్ట్రఎస్టీసెల్ కార్యదర్శి కొర్రురామమూర్తి, పాడేరు నియోజకవర్గ ఐటిడిపి ఇన్‌ఛార్జి బుద్ధ జ్యోతికిరణ్, పాడేరు మండల పార్టీ అధ్యక్షులు కె.రామునాయుడు, మండల ఐటిడిపి ఇన్‌ఛార్జి కురుజుశ్రీనుబాబు, జి.మాడుగుల ఐటిడిపి ఇన్‌ఛార్జి చిరంజీవి, మండలటిఎన్‌ఎస్‌ఎఫ్ అధ్యక్షులు పొటుకూరిసన్యాసిరావు, సీనియర్‌నేతలు వై.వరహాలబాబు, పల్లాలఅబ్బాయిరెడ్డి, వజ్రపురవణ, చేపలప్రసాద్, కిలెబాలరాజు, నవరంగి వెంకటరావు, మాజీసర్పంచ్ శంకర్రావు, సొసైటిమాజీడైరెక్టర్ అచ్చియ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కార్తీకంలో సందడే సందడి

### పర్యాటకులను ఆకట్టుకుంటున్న మాడుగుల ప్రాంతం -వన సమారాధనకు మరో పేరు టేకు తోట

**మాడుగుల అక్టోబర్ 29 ప్రభాతవార్త**



కార్తీక మాసం వచ్చిందంటే మాడుగుల ప్రాంతం అంతా సందడితో నెలకొంటుంది. పర్యాటకులను ఆకర్షించే ఎన్నో ప్రాంతాలు ఇక్కడ చూడవచ్చు. ముఖ్యంగా పూర్వకాలం నుంచి అడవిలో ఉన్న టేకు తోటలు వన సమా రాధనకు మారుపేరుగా నిలిచాయి. అయితే ఈ పర్యాటక ప్రాంతంలో ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతో వచ్చినవారు చీకటి పడేసరికి వెనుతిరిగి తప్పడం లేదు. మాడుగుల పర్యా టక ప్రాంతాల గురించి ఒకసారి పరిశీలిస్తే మాడుగులకు రెండు కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలో శ్రీ ఉబ్బిలింగేశ్వర స్వామి వారు కొలివై ఉన్నారు. చుట్టూ పచ్చని చెట్లు ఎత్తైన కొం డలు మధ్యన జలపాతాలు పర్యటనను ఎంతగానో ఆకట్టుకుంటాయి. ఈ ఆలయం వెనకనుం చి దేవపురం దెప్పాడ వంటి అనేక గిరిజన గ్రామాలు ఉన్నాయి. పేరుకే అవి అల్లూరి జిల్లాలో ఉన్నప్పటికీ అన్ని అవసరాలకు మాడుగుల రావాల్సిందే. ఈ నేపథ్యంలో మాడుగుల నుంచి దేవ పురానికి రహదారి నిర్మాణం చేపట్టి ఇరు ప్రాంతాలకు రహదారి రవాణా సౌకర్యాలు కల్పించాల ని భావించారు. అయితే గతంలో ఉబ్బిలింగేశ్వర స్వామి ఆలయం వరకే తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. సాంకేతికమైన సమస్యలు మూలంగా రిజర్వ్ ఫారెస్ట్ మీదుగా నిర్మాణం చేపట్టలేకపో యారు. తాజాగా అడ్డంకులు తొలగిపోవడంతో గుడి నుంచి దేవపురానికి రహదారి నిర్మాణం ప్రారంభించారు. ఇది పూర్తయితే గిరిజన ప్రాంతాల వారు మాడుగులకు రాకపోకలు సాధించడం ద్వారా పర్యాటపరంగా మరింత అభివృద్ధి సాధించవచ్చు. ఇక మరో ఆధ్యాత్మిక కేంద్రం వారి ఆలయం ఉత్తరాంధ్ర ఆరాధ్య దేవత, ఈ ప్రాంత ఇలవేల్పు శ్రీ మాలికొండమ్మ అమ్మవారు. ఆలయం ఎంత పచ్చని వాతావరణంతో కూడి పక్కనే చెరువు అనుకొని పాండవుల గిరి మురి పక్క తులసి కళ్యాణ మండపం, అక్కడ నుంచి కొంత దూరం వెళ్తే రామచంద్రపురంలో అక్వి డేట్స్ వంటివి పర్యాటకలను ఆకట్టుకుంటాయి. ముఖ్యంగా మోదమ్మ ఆలయం వద్ద గల పాండ వులు చెరువును అభివృద్ధి చేస్తే పర్యాటకంగా ఎందరో పర్యాటకులు రాగలరని భావిస్తున్నారు. జాలంపల్లి సమీపంలో పురాతన పిట్టగేడ్డ శివాలయం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. పూర్వం మంచి వంశీయులు ఈ ప్రాంతం రాజ ధానిగా ఉన్నప్పుడు ఆలయం దేదీప్యమానంగా వెలుగేదని చెబుతుంటారు. ఈ ఆలయానికి వెళ్ళే మార్గంలోనే మావుళ్ళమ్మ అమ్మ ఆలయం ఉంది. రాష్ట్రంలో ఒకటి రెండు ప్రాంతాలు ఈ అమ్మవారి ఆలయం ఇలాంటి భారీ విగ్రహం ఎక్కడ ఉండవు. మాడుగుల మహారాజు కోట కూడా చూడవలసింది. దీనికి యుద్ధ కోట అనే పేరు కూడా ఉంది. ప్రస్తుతం ఈ కోట మహా రాణి వారసులు విశాఖ మహారాణి పేటలో ఉంటు న్నారు. ఈ కోటను అభివృద్ధి చేయాలని వారి వారసులు ఇటీవలే ప్రయత్నం చేస్తున్నారు. ఇంత ప్రాశస్త్యంతో కూడిన మాడుగుల ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దితే ప్రభుత్వానికి ఆదాయం రావడంతో పాటు ఈ ప్రాంతం అభివృద్ధి చెందగలదని, ఈప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని స్థానికులు, పర్యాటకులు కోరుతున్నారు.

## అనారోగ్యం రూపంలో నిరుపేద కుటుంబాన్ని కబలించిన విధి

### తల్లి ఛితి ఆరకముందే తనువు చాలించిన కుమారుడు -అనాధగా మిగిలిన కుమార్తె -మండల కేంద్రంలో విషాదం

**ముంచంగి పుట్టు, అక్టోబర్ 29, ప్రభాతవార్త**



మండల కేంద్రంలో ఓ నిరుపేద గిరిజన కుటుం బాన్ని అనారోగ్య రూపంలో విధి కబలించడం తో తల్లి మృతి చెంది ఛితి ఆరకముందే తల్లిని తలుచుకుంటూ కుమారుడు సైతం మృతి చెందాడు. దీంతో ఉన్న ఒక్కగాని ఒక్క కుమార్తె అనాధగా మిగిలిన సంఘటన ముంచంగిపుట్టు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. దీంతో మండల కేంద్రంలోవిషాద ఛాయలు అలముకు న్నాయి. అందుకు సంబంధించిన వివ రాలు ఈ విధంగా ఉన్నాయి. ముంచంగిపుట్టు మండల కేంద్రంలో గంపరాయి కృష్ణ, గంప రాయి పుష్పతో పాటు గంపరాయి సాయి మరో కుమారుడు కుమార్తె. వీరంతా నిరుపేద గిరిజన కుటుంబం కూలి పనులు చేసుకుంటూ వచ్చిన దాంట్లో కుటుంబాన్ని పోషించుకుంటూ జీవితం సాగిస్తున్నారు. ఆనందంగా సాగుతున్న వీరి కుంబాన్ని చూసిన విధికి కన్నుకుట్టి 8 ఏళ్ల క్రితం జీపు ప్రమాదంలో ఓ కుమారుడ్ని విధి కబలించగా, ఏడాది క్రితం కుటుంబపెద్దని గంపరాయి కృష్ణను అనారోగ్య రూపంలో విధి కాటేసింది. ఆ కుటుంబం చిన్నాభిన్నమై తల్లి ఓ కుమారుడు కుమార్తె మాత్రమే మిగిలారు. దీంతో ఉన్న తల్లి ముగ్గురు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న క్రమంలో విధి మరలా కన్నెర్ర చేసింది. తల్లి గంపరాయి పుష్ప గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం అర్ధరాత్రి తనువు చాలించింది. శుక్రవారం ఉదయం తల్లి అంత్యక్రియలు నిర్వహించి ఇంటికి చేరుకున్న కుమారుడు గంపరాయి సాయి మనోవేదన కు గురై ఆకస్మాత్తుగా శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందడంతో ఉన్న ఒక కుమార్తె అనాధగా మిగిలిపో యింది. విధి ఆడిన ఈ వింత నాటకంలో కుటుంబం మొత్తం అనారోగ్యంతో బారిన పడి మృతి చెందడంతో చుట్టుపక్కల వారు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసు కున్న పలువురు నాయకులు చుట్టుపక్కల వారు అనాధగా మిగిలిన కుమార్తెను ఓదార్చారు. అనాధగా మిగిలిన కుమార్తెను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

## ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఓటరుగా నమోదు చేసుకోండి

### నవంబర్ 7 నమోదుకు తుది గడువు : డిఆర్ఓ దయానిధి

**పాడేరు, అక్టోబర్ 29 ప్రభాతవార్త**

నవంబర్ ఒకటవ తేదీ నాటికి డిగ్రీ ఉత్తీర్ణులై మూడేళ్ళు పూర్తి చేసినవారందరూ (2019 అక్టోబర్ 31నాటికి డిగ్రీ పూర్తి చేసినవారు) నవంబర్ 7వ తేదీలోగా ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి తెలిపారు. గడువు తేదీ సమీపిస్తున్నందున త్వరగా నమోదు చేయించుకోవాలని కోరారు. అర్హులందరూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ఫారం 18 పూరించి పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో అతికించి, డిగ్రీ పాసైన ధృవపత్రం జిరాక్స్ ప్రతిని జతపరచి నివాస ఆధారంగా సంబంధిత మండల కార్యాలయంలో అందజేయాలని డిఆర్ఓ వివరించారు. అదే విధంగా ఫారం 18లో శాసనసభ ఎన్నికల ఓటరు జాబితాలో ఉన్న దరఖాస్తుదారుని వివరాలు పొందుపరచాలని సూచించారు. ఓటరు నమోదు అధికారికి దరఖాస్తు అందజేసిన తరువాత తప్పనిసరిగా రశీదు పొందాలని డిఆర్ఓ సూచించారు. జిల్లా ప్రధానాధికారులు అర్హత కలిగిన వారి కింది స్థాయి సిబ్బందితో ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ చేయించాలని డిఆర్ఓ కోరారు. అదేవిధంగా అన్ని సచివాలయాలలో అర్హులైన సిబ్బంది కూడా ఓటరు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఓటరు నమోదుతో మంచి వ్యక్తిని ప్రజా ప్రతినిధిగా ఎన్నుకోవచ్చని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

## చవితి వేడుకల్లో ఉపముఖ్యమంత్రి

**మాడుగుల అక్టోబర్ 29 ప్రభాతవార్త**



నాగుల చవితి పర్వదిన వేడుకల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు కుటుంబ సమేతం గా పాల్గొనారు. తమ స్వగ్రామమైన దేవరపల్లి మండలం తారువ గ్రామంలో సాంప్రదాయబద్ధంగా పుట్టలో పాలు వేసి నాగేంద్రని పూజించి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాదిగా వస్తున్న ఆచారాలను కొనసాగిస్తూ మన సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తూ భగవంతునీ పట్ల కృతజ్ఞతభావంతో మెలగాలని కోరారు.

## చవితి వేడుకల్లో ఎంపీపీ రాంబాబు



**పద్మనాభం, అక్టోబర్ 29 ప్రభాతవార్త**

నాగుల చవితి వేడుకలను మండలంలోని ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. శనివారం ఉదయం నుంచి భక్తులు వారి వారి గ్రామాల్లో ఉన్న పుట్టల దగ్గరకు చేరుకుని నాగ దేవతకు పూజలు చేశారు. ఈ సందర్భంగా మద్ది గ్రామంలోని పద్మనాభం ఎంపీపీ కే రాంబాబు కుటుంబ సభ్యులతో నాగదేవత పూజలు చేసి వేడుకల్లో పాల్గొన్నారు. భక్తులు పుట్టలను పూలతో సుందరంగా అలంకరింప చేసి పుట్టలో పాలు గుడ్లు చలిమిడి వేసి నాగదేవతకు పూజించారు.

## మెదడు ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంచడం అవసరం

**విశాఖపట్నం, అక్టోబర్ 29 ప్రభాతవార్త**



ప్రతి 6 సెకండ్లకి పక్షవాతం బారిన పడినవారు ఒకరు చనిపోతున్నారని మెదడు ఆరోగ్యంపై ప్రతి ఒక్కరికి అవగాహన పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, ప్రజల్లో అవగాహన కల్పించడానికి అను హాస్పిటల్స్ వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా ఆర్‌కె బీచ్‌లో 5కె రన్ కార్యక్రమం నిర్వహించారు. మేనేజింగ్ డైరెక్టర్ డా.కె.శ్రీదేవి మాట్లాడుతూ పక్షవాతం వచ్చిన వెంటనే వీలైనంత త్వరగా హాస్పిటల్‌కి తీసుకువచ్చిన యెడల మెదడుకి దీర్ఘ కాలిక నష్టం జరగకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. డా.లలిత మాట్లాడుతూ పక్షవాతం రాకుండా మన జీవన విధానంలో సరైన మార్పులు చేసుకుంటే జబ్బు బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చు అని చెప్పారు. డా.ఎంజివి ఆదిత్య మాట్లాడుతూ పక్షవాతం పైన సరైన అవగాహనా అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో డా.సందీప్ తలారి, డా. శాంతి వర్ధన్, తదితర డాక్టర్స్ బృందం పాల్గొన్నారు.

## గడపగడపకు సంక్షేమమే అజెండగా జననేత పాలన : ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

**ముంచంగిపుట్టు, అక్టోబర్ 29 ప్రభాతవార్త**



అరకు గిరిజన ప్రాంతంలో చలి తన పంజాను బలంగా విసురుతున్న నేపథ్యంలో ప్రజలంతా పొద్దెక్కేదాకా ఇళ్ళకే పరిమితమవుతున్నారు. అయితే చలి ధాటికి ఏమాత్రం వెరువక పొద్దున్నే 6గం.ల ప్రాంతంలోనే మన్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు గిరిజన నేత ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ. సంక్షేమ పథకాల హామీల నెరవేర్పులో 95 శాతానికి పైగా హామీలు నెరవేర్చిన జననేత పాలనకు ప్రజలు హక్కును చేర్చుకుని అత్యంత ఆదరాభిమానాలు చూపిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఇంట్లో ప్రతి అవసరాన్ని తీర్చడమే అజెండగా మార్చుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తమ పరిపాలనను కొనసాగిస్తున్నారని అరకు శాసనసభ్యులు చెట్టి పాల్గుణ పేర్కొన్నారు. మండలంలోని ఏనుగురాయి సచివాలయం (10390739) పరిధిలోని ఏనుగు రాయి వనబసింగి పంచాయితీలకు చెందిన వనభసింగి, లింగపుట్టు, కొత్తూరు, చిప్పపుట్టు, తడ్డ పల్లి, తొంగికోట గ్రామాల్లో 872 గడపల్లో శనివారం రెండో రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ హాజరై గత మూడున్నర ఏళ్లలో ప్రభుత్వం ద్వారా అందుతున్న పథకాల వివరాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రజలను ఆరా తీశారు. ఇంతవరకు జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో భాగంగా మొత్తం 31 గిరిజన సచివాలయాలకు, గ్రామ అభివృద్ధి పనుల నిమిత్తం రూ.20 లక్షల చొప్పున ఏపీ ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందని, మిగిలిన సచి వాలయాల్లో కూడా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తవగానే నిర్దేశించిన రీతిగా రూ.20 లక్షల చొప్పున ముఖ్యమంత్రి గ్రామ అభివృద్ధి పనులకై ఆర్థిక నిధులను మంజూరు చేయ నుందని ప్రజలకు గిరిజన ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ హామీ ఇచ్చారు. తెల్లవారుజాము 6 గంటలు మొదలై సాయంత్రం 6 గంటల దాకా సాగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గడపల వద్ద ఎమ్మెల్యేకు సాదర ఆహ్వానం పలికి తమ ఆప్యాయతను గిరిజన వాసులు కనపరిచారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ అరిసెల సీతమ్మ, మండల అధ్యక్షులు పాంగి మల్లికార్జున్, ఏనుగురాయి సర్పంచ్ నర్సింగ్, ఎంపీటీసీ సుబ్బులక్ష్మి, పిఎసిఎస్ చైర్మన్ కూడా మత్స్యలింగం, జోలాపుట్ ఎంపీటీసీ కమల, ఎంపీటీసీ నబో, బీసీ సెల్ డైరెక్టర్: మణి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ వంతల కొండలరావు, జోలాపుట్ సర్పంచ్ జనం తిరుపతి, ఎంపీడీఓ కిరణ్ కుమార్, విఆర్ఓ చెండారమేష్, సీనియర్ నాయకులు గాశిరం, జగబంధు, కొండలరావు, సన్యాసి, జయో, సొలొమోను, అప్పారావు, దాసు పులిరాజు, పెదబాబు, ఉదయ్, పిత్ బాస్, బాలరాజు, ప్రసాద్, రఘునాద్, సచివాలయం సిబ్బంది కార్యకర్తలు పాల్గొన్నారు.



## కొయ్యూరులో 31న మినీ జాబ్ మేళా

### 125 ఖాళీలు భర్తీకి మూడు సంస్థలు -జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్యే

**పాడేరు, అక్టోబర్ 29 ప్రభాతవార్త**

ఈ నెల 31న కొయ్యూరు మండలం శరభన్నపాలెంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మినీ జాబ్ మేళా జరుగనుందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పిలుపు నిచ్చారు. శనివారం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మినీ జాబ్ మేళాలో మోహన్ స్పింటెక్స్, సెంట్రల్ ఫార్మసీ, మదర్ అండ్ ఫాదర్ హెూమ్ నర్సింగ్ సర్వీసెస్ అనే మూడు సంస్థలు పాల్గొంటాయని వాటి ద్వారా 125 ఖాళీలు భర్తీ చేయనున్నారన్నారు. ఈ జాబ్ మేళాకు ఆసక్తి గల 5 నుండి 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లొమా, ఎఎన్ఎమ్, ఎంపిహెచ్‌డబ్ల్యు, జిఎన్ఎమ్, బి.ఎస్.సి నర్సింగ్ శిక్షణ పొందిన 18 నుండి 35సం.ల వయసు గల యువతీ యువకులు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఏపిఎస్ఎస్‌డిసి.ఇన్ అనే వెబ్‌సైట్ నందు నమోదు చేసుకోవచ్చని, లేదా ఆ రోజు నేరుగా హాజరు కావచ్చని ఎమ్మెల్యే సూచించారు. ఎంపికైన అభ్య ర్థులు విజయవాడ, విశాఖపట్నంలలో పని చేయాల్సి ఉంటుందని, వారి అర్హతలు, ఎంపికైన సంస్థ ఆధారంగా రూ.7,500 నుండి రూ.15,000ల వరకు జీతం ఉంటుందన్నారు. ఈ మినీ జాబ్ మేళా యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పిలుపు నిచ్చారు.

## ఈ పంట నమోదు పత్రాలు తనిఖీ చేసిన డిఏఓ

**మాడుగుల అక్టోబరు 29 ప్రభాతవార్త**



అనకాపల్లి జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి జి.ఎస్.ఎన్.ఎస్ లీలావతి శనివారం చీడికాడ మండలంలోని జైతవరం, అప్పలరాజుపురం రైతు భరోసా కేంద్రాలను సందర్శించారు. అక్కడ ఈ పంట నమోదు చేసుకున్న రైతులు ముసాయిదా జాబితాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉన్న జాబితాలను పరిశీలించుకుని పంటల నమోదులో తేడాలను గమనించిన ఎడల గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు అభ్యంతరాలను ధరఖాస్తు రూపంలో తెలియ చేసుకోవాలని కోరారు. ఈ నెల 31న ఆఖరి తేదీ కనుక ఈ లోగా అభ్యంతరాలను విన్నవించుకోవాలని రైతుకు సూచించారు. చోడవరం ఏడిఏవి రవీంద్రనాధ్, చీడికాడ ఏవో ఇ.ఆర్.ఎ.శ్రీనివాస్‌తో పాటు వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, ఎం.సాటు తులసీ, ఏ రమణబాబు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



**ఆనందపురం, అక్టోబర్ 29, ప్రభాతవార్త**

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి వ్యక్తి చెందినట్లు పోలీసులు తెలిపారు. రాగానిగూడెం గ్రామానికి చెందిన కొల్లి రమణ (39) ఈ నెల 28న తాపీ పనులు చేయడానికి విజయ నగరం, వీటి అగ్రహారం వెళ్ళాడు. సాయం త్రం తిరుగు ప్రయాణంలో బస్సుపై పద్మనాభం వరకు వచ్చారు. పద్మనాభం నుండి రాగానే ఆటోలో వస్తుండగా దారిలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రమణకు పక్కటెములు విరిగి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో జాయిన్ చేయగా చికిత్స పొందుతూ రమణ మృతి చెందాడు. మృతుడు భార్య ఫిర్యాదు మేరకు ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా నాగుల చవితి

**పద్మనాభం, అక్టోబర్ 29, ప్రభాతవార్త**



నాగుల చవితి రోజున భక్తి భావంతో నాగేంద్రుని పూజిస్తే సర్వరోగాలు తొలగి దోషాలు పరిహారమౌతాయని వైస్సార్సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డు అప్పలనాయుడు, నాగవంశం కార్పొరేషన్ చైర్ పర్సన్ బొడ్డు అప్పల కొండమ్మ దంపతులు అన్నారు. నాగుల చవితి పర్వదినం సందర్భంగా శనివారం స్వగ్రామం మద్దిలో సొంత వ్యవసాయ క్షేత్రంలో నాగేంద్రునికి కుటుంబసభ్యులతో కలిసి అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకుని చిన్ననాటి స్మృతులను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు దంపతులు మాట్లాడుతూ ప్రకృతిని ప్రేమిస్తూ, చెట్టు, పుట్ట, నింగి, నేల, నీరు వంటి ప్రకృతి ప్రసాదించిన వనరులను ఆరాధిస్తూ ప్రకృతిలో భాగమైన జీవకోటిని భక్తిశ్రద్ధలతో పూజించడం మన సంస్కృతిలో భాగమన్నారు. తమ కులదేవత నాగేంద్రుడని, చిన్నతనం నుంచే తల్లి తండ్రుల శిక్షణలో నాగేంద్రుని పూజించడం తమ సంప్రదాయమన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, నాగవంశీయులకు, బంధుమిత్రులకు, శ్రేయోభిలాషులకు, మంత్రులకు, శాసనసభ్యు లకు, శాసనమండలి సభ్యులకు, వైస్సార్సీపీ నాయకులకు, కార్యకర్తలకు నాగుల చవితి శుభాకాంక్షలు తెలిపారు.

## వరి తెగుళ్లు నివారణపై అప్రమత్తంగా ఉండాలి : వ్యవసాయ శాస్త్రవేత్త భవాని




**అనందపురం, అక్టోబర్ 29, ప్రభాతవార్త**

వరి పంటకు వ్యాపించే తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలని అనకాపల్లి సీనియర్ శాస్త్రవేత్త భవాని తెలిపారు. శనివారం బోని చందక రైతు భరోసా కేంద్రాలను పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా బోనీ గ్రామంలో వరి పంటను పరిశీలించి సాంబామసూరి రకంలో సుడి దోమ ఉధృతిని గమనించి ఈ దోమ ఒక దుబ్బకి నాలుగు నుంచి ఐదు దోమలను వ్యాప్తి చేస్తుందని, ఈ దోమలు గమనించిన వెంటనే నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఒక ఎకరాకి పైమోటరోజన్ 120 గ్రాములు, డైనోటేపూరన్ 80 గ్రాములు 200 మీటర్లు నీటిలో కలిపి చేసి చుడి దోమను నివారించవచ్చురన్నారు. ఈ పంట నమోదు చేసిన రైతులు వివరాలు మండలంలో అన్ని రైతు భరోసా కేంద్రంలో గ్రామ సచివాలయం సామాజిక తనిఖీ కొరకు ప్రదర్శించడం జరిగిందని పంట నమోదులో ఏమైనా అభ్యంతరాలు ఉన్నచో ఈనెల 31 లోపల రైతు భరోసా కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. భీమిలి వ్యవసాయ సంచాలకులు బి.విజయప్రసాద్, మండల వ్యవసాయ అధికారి సంధ్యారత్న ప్రభ, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## నారాయణ కాలేజీలో ఇంటర్మీడియట్ విద్యార్థి ఆత్మహత్య

**ఆనందపురం, అక్టోబర్ 29, ప్రభాతవార్త**

మండలంలో వెల్లంకి గ్రామం సమీపంలో ఉన్న నారాయణ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న పొట్నూరు ముఖేష్(16) విద్యార్థి ఉరిపోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం పార్వతీపురం జిల్లా వీరఘట్ట మండలం, తొట్టంగి గ్రామానికి చెందిన పొట్నూరు లక్ష్మణరావు సుమతి దంపతుల కుమారుడు ముఖేష్ వెల్లంకి నారాయణ కళాశాల హాస్టల్లో ఇంటర్మీడియట్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. నాగుల చవితిసందర్భంగా తోటి విద్యార్థులు అందరూ ఇంటికి వెళ్ళిపోయారు. తను కూడా వాళ్ళ అమ్మకి ఫోన్ చేసి వస్తానని చెప్పగా వాళ్ళ అమ్మ మనం చవితి చేయడం లేదు. నువ్వు రానవసరం లేదు అని చెప్పారు. ఈ విషయంలో విద్యార్థి మనస్థాపనతో తన హాస్టల్ రూమ్‌లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసు కున్నాడు. తండ్రి పొట్నూరు లక్ష్మణరావు ఫిర్యాదు మేరకు ఆనందపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ రామచంద్ర ఆధ్వర్యంలో మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## స్కూల్‌కి బీరువా వితరణ

**భీమునిపట్నం, అక్టోబర్29, ప్రభాతవార్త**



పండిట్ నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్‌లో తిరుమల శ్రీదేవి సభాధ్యక్షతన, ఆదర్శ హిందీ ప్రేమీ మండలి వ్యవస్థాపకులు, కెఎస్ఆర్ కృష్ణారావు, రిటైర్డ్ ప్రిన్సిపల్, తమ మామైన కీర్తిశేషులు మొకర నారాయణ రావు 88వ జన్మదినాన్ని పురస్కరించుకొని స్కూల్‌కి 33 వేల విలువ కలిగిన గోద్రెజ్ కంపెనీకి చెందిన బీరువాని వితరణ చేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలిగొట్ల శ్రీరామ్ చంద్ర మూర్తి స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ మాట్లాడుతూ స్కూల్లో ఎన్నో మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని విద్యార్థుల అభివృద్ధి లక్ష్యంగా ఉపాధ్యాయులు తమవంతు కృషి చేస్తున్నారని కొనియాడారు. విశిష్ట అతిథి గంటా అప్పలకొండ, మూడో డివిజన్ కార్పొరేటర్ మాట్లాడుతూ విద్యార్థులు, స్కూల్ పురోభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని విద్యార్థుల పురోగతిలో తోడ్పాటు అందిస్తామని తెలియజేశారు. ఆదర్శ హిందీ ప్రేమి మండల గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు మాట్లాడుతూ విద్యార్థులను సమాజానికి ఉపయోగపడేలా మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బి.సత్తిరాజు హిందీ మాస్టారు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ స్థాయి క్రీడల సెలక్షన్ పోటీలు ప్రారంభం

**భీమునిపట్నం, అక్టోబర్ 29, ప్రభాతవార్త**



విశాఖ జిల్లా విద్యా అధికారి వారి ఆదేశాలు మేరకు విశాఖ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో భీమిలి స్థానిక సెయింటాన్స్ స్కూల్ మైదానంలో క్రీడల పోటీలను శుక్రవారం భీమిలి నియోజకవర్గం వైసిపి పార్టీ ఇన్‌చార్జ్ ముత్తంశెట్టి మహేష్ జాతీయ జెండాను ఎగురవేసి ఎస్.జి.ఎఫ్ జెండాను కార్పొరేటర్ గంటా అప్పలకొండ ఎగురవేసి పోటీలను ప్రారంభించడం జరిగింది. అనంతరం ఎస్‌జిఎఫ్ సిబ్బంది విశాఖ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, సెయింటెన్స్ స్కూలు యాజమాన్యం అతిథులు కు సాంప్రదాయ నృత్యాలతో సాదర స్వాగతం పలికారు. ఇన్‌చార్జ్ మహేష్ క్రీడాకారులకు కరచాలనం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కబాడ్డి, త్రోబాల్, కోకో, వాలీబాల్, బాడ్మింటన్ వాటికి సంబంధించి సెలక్షన్స్ నిర్వహించడం జరిగింది. ఈ సెలక్షన్‌లో భీమిలి, ఆనందపురం, పద్మనాభం, చినగదిలి మండలాల నుంచి 14 సం. నుండి 17 సం.లోపు క్రీడాకారులు పాల్గొన్నారు. ఇక్కడ సెలెక్ట్ అయిన క్రీడాకారులు త్వరలో జరగబోయే జిల్లా స్థాయి క్రీడల్లో పాల్గొంటారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ముత్తంశెట్టి మహేష్ మాట్లాడుతూ క్రీడలు అనేవి శారీరక ఉల్లాసానికి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని అంతేకాక మానసిక ప్రశాంతత చేకూరుతుందని చదువులతో పాటు విద్యార్థులలో ఉన్న నైపుణ్యతను బయటకు తీయాలంటే ఇలాంటి క్రీడలు పోటీలు నిర్వహించాలని, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలని జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పాల్గొనే క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని అన్నారు. అర్హత సాధించేందుకు జరుగుతున్న ఈ క్రీడల సెలక్షన్ లకు సంపూర్ణ సహాయ సహకారాలు అందించిన భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జ్ మహేష్‌కి పి.ఎ కోలా చంద్రశేఖర్‌కి ఎస్‌జిఎఫ్ తరుపున సెక్రటరీ వెంకట్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. జరుగుతున్న ఈ క్రీడల సెలక్షన్‌కి నియోజకవర్గం ఇన్‌చార్జ్ గా జోసెఫ్ కిశోర్ వ్యవహరించనున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గంటా అప్పలకొండ, వార్డు ఇన్‌చార్జ్‌లు మైలపల్లి షణ్ముఖ రావు, శిల్లా కరుణాకర్ రెడ్డి, అల్లిపిల్లి నర్సింగ్ రావు, మైలపల్లి లక్ష్మణరావు, గంటా నూకరాజు, కొండబాబు, ఎస్‌జిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్బికేలలో రైతుల జాబితా

**యలమంచిలి, అక్టోబర్ 29 ప్రభాతవార్త**

యలమంచిలి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న రైతులందరూ ఖరీఫ్ సీజన్‌లో వారు పండించే పంటలను ఈ కర్షక్ యాప్‌లో పంటను నమోదు చేసుకున్న ప్రతి రైతుకు ఈ కేవైసి బయోమెట్రిక్ చేయించారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో సామాజిక తనిఖీల కోసం రైతులు జాబితా ప్రదర్శించడం జరిగిందని, ఈ జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే రైతులు ఆర్బికేలలో పనిచేస్తున్న గ్రామ వ్యవసాయ సహయకులకు తెలియజేయాలని వ్యవసాయ అధికారి సత్యశ్యామల తెలిపారు.

## అంగరంగ వైభవంగా పంచరాత్రుల ఉత్సవాలు

**యలమంచిలి, అక్టోబర్ 29 ప్రభాతవార్త**



పట్టణంలో పంచరాత్రుల ఉత్సవాలు శనివారం నాటితో ఆడంబరంగా ముగిశాయి. ఐదు రోజుల పాటు పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు భూలోకమాంబ అమ్మవారి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారులను దర్శించుకున్నారు. చివరి రోజు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనడంతో యలమంచిలి ప్రధాన రహదారితో పాటుగా దిమిలి రోడ్, పాతవీధి, తులసినగర్ రోడ్డులు జనాలతో కిక్కిరిసిపోయాయి. తులసీనగర్‌లోని భూలోకమాంబ అమ్మవారు, పాతవీధిలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల వద్ద దీపావళి నుంచి నాగులచవితి వరకు ఈ వేడుకలు జరుపుతుండడం ఆనవాయితీగా వస్తుంది. ఆలయ ధర్మకర్త ఉత్సవ కమిటీ ప్రతినిధులు విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు, వైస్‌చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా నిర్వహించారు. అయితే గత రెండు సంవత్సరాలు కొవిడ్ నిబంధనల నేపథ్యంలో ఆలయాల వద్ద మాత్రమే విద్యుద్దీపాలను అలంకరించి ఉత్సవాలు నిర్వహించకపోవడంతో ఈ సంవత్సరం అంగరంగ వైభవంగా ఉత్సవాలు ఘనంగా నిర్వహించడంతో యలమంచిలి పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శనివారం పంచరాత్రులలో చివరి రోజు కావడంతో వేకువజాము నుంచి అమ్మవారికి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్లకి విశేష పూజలు జరిపారు. ఉత్సవాలలో భాగంగా దేవతామూర్తుల వేషధారణలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఉత్సవాలలో స్థానిక ఏబీ షాపింగ్ మాల్ లక్కీ డ్రాలో గెలుపొందిన వారికి మున్సిపల్ చైర్మన్ పిల్లా రమాకుమారి, సిఐ గఫూర్‌లు బహుమతులు అందజేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ, యలమంచిలి శివార్లలో గల పెట్రోల్ బంక్‌ల ప్రదేశాలలో అధిక సంఖ్యలో వాహనాలు పార్క్ చేశారు. ఉత్సవాలలో ఎటువంటి అవాంతరాలు జరగకుండా ఇద్దరు సిఐలు, 10మంది ఎస్సైలు 100 మంది కానిస్టేబుళ్లు, హెూంగార్డులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సిఐ షేక్ గఫూర్ మీడియాకి తెలియజేశారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థి గాడు చిన్న కుమారుని గెలిపించాలి



**పద్మనాభం, అక్టోబర్ 29 ప్రభాతవార్త**

పద్మనాభ మండలం పద్మనాభం జంక్షన్లో శనివారం తెలుగుదేశం పార్టీ మండల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి భీమిలి నియో జకవర్గ తెలుగుదేశం సీనియర్ నాయకులు గాడు అప్పలనాయుడు ముఖ్యఅతిథిగా విచ్చేసి కార్యకర్తలను ఉద్దేశించి ప్రతీ కార్యకర్త ప్రతి ఎమ్మెల్సీ ఓటరు వద్దకు వెళ్లి ఓటు హక్కు వినియోగం గురించి ఓటరు నమోదు గురించి తెలియపరచి ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థిగా గాడు చిన్న కుమారిని గెలిపించాలని పట్టబద్రులకు నిరుద్యోగ యువతకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారని సమస్యలపై పోరాడు తారని తెలియపరచాలని కార్య కర్తలను ఉద్దేశించి చెప్పారు. ఈ కార్యక్రమానికి పద్మనాభ మండలం పార్టీ అధ్యక్షులు కే రమణ మాజీ జెడ్పిటిసి కేదాము పద్మనాభం ఎంపీటీసీ కే లక్ష్మి ఎక్స్ సర్పంచ్ సన్యాసిరావు సీనియర్ నాయకులు ఎం నందేశ్ ఎస్ పై నాయుడు భారీ సంఖ్యలో తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.

## సాంప్రదాయత ఆధునికత ప్రదర్శన

**ప్రభాతవార్త అక్టోబర్ 29 విశాఖపట్నం**

సాంప్రదాయత నుండి ఆధునికత వరకు ఫ్యాషన్ ప్రపంచానికి అద్దంపట్టే విస్తృత శ్రేణి డిజైనర్స్ ఫ్యాషన్లను సూత్రా నగరంలోని నోవాటెల్ హోటల్ నందు నవంబర్ 3,4 తేదీలలో వస్త్ర ప్రదర్శన అమ్మకాలను ఏర్పాటు చేస్తునట్లు వివిధ రంగాలకు చెందిన ప్రఖ్యాత డిజైనర్స్ తాము రూపొందించిన ప్రత్యేక దుస్తుల అలంకరణల విన్నూతమైన ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంటాయిని, వివాహాది వేడులకు ఒక ప్రత్యేకతను ప్రతిబింస్తాయని నిర్వాహకులు తెలిపారు.

30-10Pg6exHMNWJQE:Layout 1 10/30/22 11:51 PM Page 1







మున్సిపల్ కార్యాలయంలో ప్రసంగిస్తున్న ప్రభుత్వవిప్, ఎంఎల్ఏ సామినేని ఉదయభాను, పక్కన మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, కెడిసిసి చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్ఆర్‌సిపి కౌన్సిలర్లు, నాయకులు.పర్యావరణ పరిరక్షణ నినాదంతో పట్టణంలో మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్‌చైర్మన్ ప్రభాకరరావు.

# జగ్గయ్యపేట-చిల్లకల్లు రోడ్డు విస్తరణకు రూ.14 కోట్లు

### రేపు శంకుస్థాపన చేయనున్న మంత్రి దాడిశెట్టి రాజా

### స్విమ్మింగ్‌పూల్‌ను ప్రారంభించనున్న శాప్ చైర్మన్ సిద్ధార్థరెడ్డి

### ప్రభుత్వవిప్, ఎంఎల్ఏ సామినేని ఉదయభాను

**జగ్గయ్యపేట, అక్టోబర్ 29, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట-చిల్లకల్లు రోడ్డు విస్తరణకు రూ.14 కోట్లు ప్రభుత్వం మంజూరు చెయ్యగా ఈనెల 31వ తేదీన రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా శంకుస్థాపన చేయనున్నట్లు ప్రభుత్వవిప్, ఎంఎల్ఏ సామినేని ఉదయభాను వెల్లడించారు. శనివారం మున్సిపల్ కార్యాలయానికి విచ్చేసిన ఉదయభాను ఆధునీకరించిన చైర్మన్ ఛాంబర్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పట్టణాన్ని సుందరీకరించటంలో కూడా మనకు బాధ్యత ఉన్నదని, జగ్గయ్యపేట నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైనదిగా తీర్చిదిద్దుకునే క్రమంలో పాటుపడాలని చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, పాలకవర్గ సభ్యులను కోరారు. గత ప్రభుత్వం నిర్మించి నిరుపయోగంగావున్న స్విమ్మింగ్‌పూల్‌కు రూ.35 లక్షలు వెచ్చించి అన్ని హంగులతో ఆధునీకరించామని అదే రోజు ఏపి రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ (శాప్) చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి దీన్ని ప్రారంభిస్తారని తెలిపారు. అలాగే నూతనంగా ఏర్పాటైన వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటి ప్రమాణస్వీకారోత్సవాన్ని కూడా అదే రోజు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యార్డు చైర్మన్‌గా ముత్తినేని విజయశేఖర్, ఉపాధ్యక్షునిగా మానేపల్లి బ్రహ్మం, 12 మంది డైరెక్టర్లు ప్రమాణం చేస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కెడిసిసి చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్-చైర్మన్లు తుమ్మల ప్రభాకరరావు, హఫీజున్నీసా, పట్టణ వైసిపి అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాగా పర్యావరణ పరిరక్షణ నినాదంతో పట్టణంలో రెండు వేల మొక్కలు నాటే సంకల్పంలో భాగంగా శనివారం 27 వార్డులో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్‌చైర్మన్ ప్రభాకరరావు పలు మొక్కలు నాటారు.

# ఆల్ ఇండియా ఓపెన్ ఫిడే ర్యాపిడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్ ప్రారంభం

**తిరుపతి (క్రీడ), అక్టోబర్ 29, ప్రభాతవార్త:** తిరుపతిలోని శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ సంయుక్తంగా రూ. 5 లక్షల నగదు బహుమతితో నిర్వహిస్తున్న తిరుమల తిరుపతి ఆల్ ఇండియా ఓపెన్ ఫిడే ర్యాపిడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్ 2022 శనివారం క్రీడా శాఖ మంత్రి ఆర్కె రోజా ప్రారంభించారు. రెండు దశాబ్దాల తర్వాత ఐదు లక్షల ప్రైజ్ మనీతో అతిపెద్ద ఫిడే రేటింగ్ ఈవెంట్‌ను రాయలసీమలో జరపడం ఉత్తీర్ణులైనటువంటి 33 మందికి సర్టిఫికేట్స్‌ను ఈ సందర్భంగా రోజా, ప్రభాకర్ రెడ్డి చేతుల మీదుగా అందజేసారు. అదే విధంగా సీనియర్ నేషనల్ ఆర్బిటర్ సెమినార్ కూడా ఇదే వేదికలో నిర్వహిస్తున్నారు. దీని ద్వారా 40 మందికి పైగా చెస్ అఫీషియల్స్‌గా ఉత్తీర్ణత సాధించే అవకాశం ఉంది. ఆర్బిటర్స్ కమిషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ ధర్మేంద్ర కుమార్, చీఫ్ - ట్రైనర్‌గా వివరిస్తున్నారు.

ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అట్ ది రేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్




చెస్ పోటీని ప్రారంభిస్తున్న క్రీడా శాఖ మంత్రి ఆర్కె రోజా

హర్షనీయమని, దానికి ముఖ్య అతిథిగా రావడం మరింత సంతోషాన్ని కలిగిస్తుందని, చదరంగా అభివృద్ధికి తమ తరపున మరింత సహాయ సహకారాలు అందిస్తామని క్రీడా శాఖ మంత్రి రోజా తెలిపారు. చదరంగంలో మొదటి ఎత్తుని రోజా, సులోచన పోటీలను ప్రారంభించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ వారు సంయుక్తంగా చేపట్టిన చెస్ ఇన్ స్కూల్ ట్రైనర్స్ పైలెట్ ప్రాజెక్టులో ప్రభాకర్‌రెడ్డి, తిరుపతి డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మురళి కృష్ణ, అఖిల భారత చదరంగ సమాఖ్య సంయుక్త అధ్యక్షుడు డిపి అనంత, ఆర్బిటర్స్ కమిషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ ధర్మేంద్ర కుమార్, ఎడిపై ఇంటర్నేషనల్ స్కూల్ చైర్ పర్సన్ సులోచన, చిత్తూరు చెస్ డెవలప్మెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రసాద్, టోర్నమెంట్ డైరెక్టర్ జ్వాలాముః, ఆంధ్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవివి శర్మ తదితరులు పాల్గొన్నారు.

# సైన్స్ అండ్ టెక్నాలజీలో అద్వితీయ ప్రగతి

### రక్షణ మంత్రి సైంటిఫిక్ అడ్వయిజర్ డా॥ సతీష్‌రెడ్డి

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, అక్టోబరు 29, ప్రభాతవార్త:** సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో భారతదేశం వేగంగా రూపాంతరం చెందుతుందని రక్షణ శాఖా మంత్రి సైంటిఫిక్ అడ్వయిజర్ డా॥ జి. సతీష్‌రెడ్డి అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన ఇంటరాక్షన్‌లో పాల్గొన్న సతీష్‌రెడ్డి మాట్లాడుతూ గడిచిన కొన్నేళ్ళుగా శాస్త్ర సాంకేతిక రంగాలలో అద్వితీయ ప్రగతి కనబర్చిన భారత్ ఇతర దేశాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. దేశం చాలా రంగాలలో దూసుకుపోతుందని ఇందులో స్పేస్, డిఫెన్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, డ్రోన్ వ్యవస్థ, క్వాంటమ్ టెక్నాలజీ, ఐ.టి రంగాలు ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు సవాళ్ళను ధీటుగా ఎదుర్కోవాలని సూచించారు. ఆతరువాతే విజయాలు వస్తాయని అన్నారు. స్పేస్ టెక్నాలజీ అందుబాటులోకివచ్చాక ఇస్రో నుంచి ఎస్ఎల్‌వి, ఏఎస్ఎల్‌వి, పిఎస్ఎల్‌వి, మార్స్ మిషన్, మూన్ మిషన్, జియో శాటిలైట్ లాంచింగ్ స్టేషన్ ద్వారా ఘనీయవృద్ధిని సాధించినట్లు పేర్కొన్నారు. సైన్స్ అంట్ టెక్నాలజీలో అకామిక్ఎనర్జీ, న్యూక్లియర్, పోక్రాన్, డిఫెన్స్‌లో 1988 నుంచి విజయాలు సాధిస్తూనే ఉన్నామన్నారు. ప్రధాన మంత్రి ఇచ్చిన పిలుపుతో మేక్ ఇన్ ఇండియాను విజయవంతం చేశామని, ఇక ఆత్మ నిర్బర్ భారత్‌ను ఆదిశగా నడిపేందుకు అడుగులు పడుతున్నాయని వివరించారు. గతంలో 75శాతం వరకు పేరున్న విద్యాసం స్థల్లో విద్యనభ్యసించిన విద్యార్థులు ఇతర దేశాలకు వెళ్తున్నారన్నారు. నేడు ఆస్థితిలో మార్పులు వచ్చాయని పేర్కొన్నారు. డ్రోన్ వ్యవస్థకు మనదేశం హబ్‌గా నిలుస్తుందన్నారు. ఏరంగంలోనైనా విజయాలు సాధించాలంటే ప్రతీ రంగాన్ని సవాళుగా స్వీకరించాలన్నారు. ఇందులో విద్యా సంస్థలు ప్రముఖపాత్ర వహిస్తున్నాయ న్నారు. నూతన ఆవిష్కరణలు చేసి ప్రపంచానికి అందించేలా నేటి యువత పరిశోధనలు జరపాలన్నారు. అందుకు తగిన సహాయసహకారాలు ఆయా ప్రభుత్వాలు, సంస్థలు అందిస్తాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని దేశ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపచేయాలని విద్యార్థులకు సూచించారు. ఆలోచనలు ఉంటే వాటిని ఆచరణలోకి తెచ్చేలా ఇంకు బేటర్ సెంటర్‌లు ఉంటాయని వాటిని బలోపేతం చేయాలని యూని వర్సిటీ అధికారులను కోరారు. వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ పట్టేటి రాజశేఖర్ మాట్లాడుతూ భారతదేశంలో శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధిలో సతీష్‌రెడ్డికి ప్రముఖస్థానం ఉందన్నారు. నేటి యువతకు ఆయన ఆదర్శవంతుడని అన్నారు. సైన్స్‌తోనే జీవితం ఉంటుందని దాని అభివృద్ధి దేశాభివృద్ధికి తోడ్పాటునందిస్తుందన్నారు. ఈ సమావేశంలో రెక్టార్ వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ బండి కరుణ, ప్రిన్సిపాల్స్ గంగాధరరావు, సిద్దయ్య, శ్రీనివాసరెడ్డి, ప్రమీళారాణి, అధికారులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




సతీష్‌రెడ్డిని సన్మానిస్తున్న వీసి ప్రొఫెసర్ రాజశేఖర్ తదితరులు, పాల్గొన్న అధ్యాపకులు, పరిశోధకులు

# సిఎం జగనన్న ఆదేశిస్తే ఎమ్మెల్యేగా పోటీచేస్తా: సత్యప్రియ



**ఎ కొండూరు, అక్టోబరు 29, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లిడ్‌క్యాప్ డైరెక్టర్ డాక్టర్ కోనేరు సత్యప్రియ ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలంలో శనివారం విస్తృతంగా పర్యటించి వైసిపి శ్రేణులను ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మండలంలో ఎ కొండూరు, కంభం పాడు, చీమలపాడు తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి వైసిపిలో వివిధ హోదాల్లో ఉన్న నాయ కులను, ప్రజా ప్రతినిధులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యప్రియ శనివారం ప్రభాతువార్త"తో మాట్లాడుతూ వైసిపి ఆవిర్భావం నుండి పార్టీలో చేరి పనిచేస్తున్నానని, సిఎం జగనన్న తనకు రాష్ట్ర లిడ్‌క్యాప్ సంస్థలో డైరెక్టర్‌గా నియమించి తన సేవలను వినియోగించు కుంటున్నారని, సిఎం జగనన్న ఆదేశిస్తే తిరువూరు ఎస్సీ నియోజకవర్గం నుండి పోటీ చేస్తానని, తన తాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర హోం శాఖ మంత్రిగా స్వర్గీయ కోనేరు రంగారావు తిరువూరు నియోజకవర్గంలో చివరి శ్వాస వరకు జాతీయ కాంగ్రెస్‌లో ఉండి రాష్ట్రానికి విశేష సేవలందించారని డాక్టర్ సత్యప్రియ ఈ సందర్భంగా పేర్కొన్నారు. తన తాత స్వర్గీయ రంగారావు అనుచరులను, ప్రస్తుతం వైసిపిలో ఉన్న ఎంపిపి, జడ్పీటిసి, ఎంపిటిసి వివిధ గ్రామాల్లో సర్పంచ్‌లను ఆత్మీయంగా మర్యాదపూ ర్వకంగా కలుసుకున్నానని సిఎం జగనన్న తనకు తిరువూరు వైసిపి సీటు కేటాయిస్తే ప్రజా సహకారంతో గెలిచి నియోజకవర్గ ప్రజలకు నిష్పక్ష పాతంగా సేవలందిస్తానని డాక్టర్ కోనేరు సత్యప్రియ తెలిపారు.




చంద్రబాబు జగ్గయ్యపేట పర్యటనకు రూట్ పరిశీలన, నిర్వహణ తీరుతెన్నులపై ఎంఎల్‌సి సత్యనారాయణరాజు, గౌతమ్‌లతో చర్చిస్తున్న మాజీమంత్రి నెట్టెం రఘురామ్, టిడిపి జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్.

# చంద్రబాబు జగ్గయ్యపేట రాక సందర్భంగా రూట్‌మ్యాప్ పరిశీలన

**జగ్గయ్యపేట, అక్టోబర్ 29, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పర్యటనకు నవంబర్ 4వ తేదీన తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ సిఎం నారా చంద్రబాబునాయుడు విచ్చేయుచున్న సందర్భంగా శనివారం రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నాయకులు జగ్గయ్యపేటకు విచ్చేసి రూట్ పరిశీలన జరిపారు. మాజీమంత్రి, విజయవాడ పార్లమెంట్, ఎన్‌టిఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు నెట్టెం రఘురామ్, టిడిపి జాతీయ కోశాధికారి, మాజీ ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), ఎంఎల్‌సి సత్యనారాయణరాజు, గౌతమ్ తదితరులు చంద్రబాబు పర్యటించే ప్రాంతాన్ని పరిశీలించి చర్చించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నాయకులు కసరత్తు ప్రారంభించారు. కాగా ఈకార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు గట్టిడి దుర్గాప్రసాదు, మేకా వెంకటేశ్వర్లు, మైనేని రాధాకృష్ణ, యలమంచిలి రాఘవ, గింజుపల్లి రమేష్, కళ్యాణం కృష్ణారావు, ఎం సురేష్, బొందిలి బాలాజీసింగ్, చిలుకూరి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంద్రకీలాద్రిపై నాగుల చవితి



**ఇంద్రకీలాద్రి, అక్టోబర్ 29, ప్రభాతవార్త :** ఇంద్రకీ లాద్రి, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో కొలువైన శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వార్ల ఆలయంలో శనివారం నాగుల చవితి సందర్భంగా నాగేంద్రస్వామి ప్రతిమలకు, పుట్ట లోను అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు పాలు పోశారు. అలాగే ఆలయంలో కార్తీక మాసం సంద ర్భంగా నిత్యం స్వామి అమ్మవార్లను ఉయలలో ఉంచి అర్చకులు ఊంజలసేవ చేస్తుండగా, భక్తులు స్వామి అమ్మవార్ల చుట్టూ వున్న సహస్ర దీపాలను వెలిగించారు. నిత్యం సహస్ర లింగాలను అర్చక స్వాములు తయారు చేసి, లింగాకారములో అలం కరించి సహస్ర లింగార్చన పూజలు నిర్వహిం చడమైనది. కార్తీకమాసంలో నిత్యము నిర్వహించే ఈ ప్రత్యేక పూజలను కార్తీక మాసాంతము వరకు నిర్వహిస్తారని ఆలయ ఇవో దర్భముళ్ల భ్రమరాంభ తెలిపారు.

# కట్టలేరు వాగువంతెన ప్రాంతంలో రూ.20లక్షలతో తాత్కాలిక రహదారి నిర్మాణం

### 26కోట్లతో హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి ఆర్థిక శాఖ వద్ద ప్రతిపాదన



ఆర్‌అండ్‌బి ఎస్ఈ జాన్‌మోషేతో కలిసి కట్టలేరు వాగు వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

**ఎ కొండూరు, అక్టోబరు 29, ప్రభాత వార్త :** నూజివీడు - గంపలగూడెం ఆర్ అండ్ బి రాష్ట్ర రహదారిపై ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియో జకవర్గం గంపలగూడెం మండలం తోటమూల - వినగడప గ్రామాల మధ్య కట్టలేరు వాగుపై భారీవర్షాల వరదలకు ధ్వంసమైన వంతెన ప్రాంతంలో ఆర్‌అండ్‌బి ఎస్ఈ జాన్‌మోషేతో కలిసి తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణనిధి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కట్టలేరు వాగుపై రూ.26కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి ఆర్థిక శాఖ వద్ద ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని, త్వరలో బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు ప్రస్తుతం ధ్వంసమైన వంతెన ప్రాంతంలో రూ.20లక్షలతో తాత్కాలిక రహదారి నిర్మాణానికి ఎస్ఈ జాన్‌మోషే, ఎఇ అచ్చారావుల ఆధ్వర్యంలో పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే రక్షణనిది తెలిపారు. కార్య క్రమంలో సంబంధిత శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# కిటకిటలాడుతున్న శివయ్య సన్నిధి




శ్రీకాళహస్తి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**శ్రీకాళహస్తి,అక్టోబరు29 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయం వారాంతపు రద్దీతో శనివారం కిట కిట లాడింది. సాధారణంగా అమావాస్య,పౌర్ణమి సందర్భంగా భక్తులు భారీఎత్తున హాజరై పూజలు జరిపించుకోవటం ఆనవాయితి.ఈ వారమంతా ఆలయానికి భక్తుల తాకిడితో పాటు అతిధుల తాకిడి పెరిగింది, ఈ నేపథ్యంలో శుక్రవారం వర్షంతో భక్తులు ఇక్కట్లు పడ్డారు.శనివారం ఉదయం నుంచి తిరుమల నుంచి వచ్చిన భక్తులతో శ్రీకాళహస్తీశ్వరాలయం కిటకిట లాడింది.ఓ వైపు సామాన్య భక్తులు,మరో వైపు అతిధుల తాకిడితో ఆలయం కళ కళ లాడింది. దీనికి తోడు కార్తీక మాసం కావటంతో స్థానిక మహిళా భక్తులు తండోపతండాలుగా కదలి వచ్చారు. మహిళా భక్తుల మనోభావాలకు అనుగుణంగా దీపాలు వెలిగించుటకు ప్రత్యేక షెడ్డులను ఏర్పాటు చేసారు. సోమవారం కార్తీక మాసం మొదటిసోమవారం కావటంతో భక్తులు విశేష సంఖ్యలో హాజరౌతారని ఏర్పాట్లు చేపట్టారు. ఉదయం నుంచి ఆలయానికి వచ్చిన అతిధులను ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పర్యవేక్షణలో ఆలయాధికారులు పర్యవేక్షించారు.శనివారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమైనా,వాతావరణం చల్లగా ఉన్నా భక్తులు కదలి వచ్చారు.

**నాగుల చవితికి ప్రత్యేక ఏర్పాట్లు:** శ్రీకాళహస్తీశ్వరాలయంకు సమీపంలోని మోక్ష గోపురం దిగువన ఉన్న నాగాల పుట్ట,రుద్రపాదాల వద్ద భారీ ఏర్పాట్లు చేసారు. నాగుల చవితి సందర్భంగా మహిళా భక్తులసౌకర్యార్థం ఇక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. ఉదయం ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు శ్రీనివాసులు, వారి సహాచరులు హాజరు కాగా ఆలయ ఉప ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, పౌరోహితులు అర్ధగిరి స్వామి సారధ్యంలో పూజలు నిర్వహించారు. శనివారం సుమారు 25వేల మంది దర్శనం చేసుకున్నట్లు సమాచారం. రాహుకేతు దోష నివారణ పూజలు నాలుగువేలు జరగగా అభిషేకాలు 50 వరకు జరిగాయి. అయితే ఉదయం నుంచి ఆలలయ ఆలయాధికారులు, ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు శ్రీనివాసులు,వారి సహాచరులు స్వతహాగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. తిరుమలేశుని సన్నిధికి వచ్చిన భక్తులు అక్కడ దర్శనం చేసుకున్నాక శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధికి వస్తున్నారు. అంతేకాక వరుస సెలవులతో భక్తుల తాకిడి పెరుగుతుంది. ఎటు చూసినా భక్త జనమే అన్నట్లుమారింది. సన్నిధివీధి అంతా జనమయంగా మారింది. ఓ వైపు కాలినడకన వచ్చే భక్తులు మరో వైపు వాహనాల రద్దీతో కిట కిట లాడింది. సామాన్యభక్తుల తిప్పలు వర్ణనాతీతంగా మారింది.శనివారం అధికారికంగా దేవస్థానం జారి చేసినసమాచారం మేరకు 25 వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నట్లు తెలిపారు.రాహుకేతుదోష నివారణ పూజలకు కూడా సుమారు 4వేలు వరకు జరిగినట్లు శ్రీకాళహస్తీశ్వరాలయానికి వారాంతంలో తమిళనాడు, కర్నాటకలకు చెందిన భక్తుల సంఖ్య అదికంగా ఉంటుంది.అలాగే విఐపిలతాకిడి కూడా అధికంగానే ఉంటుంది. బస కోసం భక్తులు,విఐపిల పరిస్తితి ఆగమ్యగోచరంగా మారింది.రోజుకొక నిబంధనలతో గందరగోళంగా మారుతుంది.

**నాలుగువేలు దాటిన రాహుకేతుదోష నివారణ పూజలు:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి శనివారం రూ.200 దర్శనం టిక్కెట్లుతో 834 మంది, రూ.50ల దర్శనం టిక్కెట్టులో 1585 మంది రాహుకేతుదోష నివారణ పూజలకు సంబంధించి రూ.500లు టిక్కెట్టు 2302 మంది, రూ.750 టిక్కెట్లతో 869, రూ.1500 టిక్కెట్లు కొనుగోలు చేసిన 249 మంది భక్తులు రూ.2500ల టిక్కెట్లు కొనుగోలు చేసి 204 మంది, రూ.5వేల టిక్కెట్లు 57 కొనుగోలు చేసి పూజలు జరిపించుకున్నారు. కాగా అభిషేకాలు 50 శనీశ్వరాభిషేకాలు, మహా న్యాస పూర్వక ఏకాదశ రుద్రాబిషేకాలు 31 శనీశ్వరాభిషేకాలు 44,నిత్య కళ్యాణ సేవల్లో 01 జరిగినట్లు సమాచారం అందించారు.

# అనుబంధ ఆలయాలకు మహర్దశ

### ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 29 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లాలోని పుణ్యక్షేత్రాల్లో ఎంతో ప్రాశస్త్యం కల్గిన శ్రీకాళహస్తీశ్వరాలయం పేరు ప్రతిష్టలు మిక్కిలి ఇనుమడింపజేయుటక అన్ని చర్యలు తీసుకుంటున్నామని, వాడ వాడల్లో శిధిలమౌతున్న ఆలయాలను జీర్ణోద్ధారణ గావించి శివతత్వంను వాడ వాడల్లో చాటాలన్నది లక్ష్యంగా ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. శనివారం ఆయన శ్రీకాళహస్తిలోని ప్రెస్‌క్లబ్‌లో 'మీట్‌ది ప్రెస్' కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసారు.ఈ సందర్భంగా ఆయన ధర్మకర్తల మండలి చైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత తీసుకున్న నిర్ణయాలను గురించి వివరించారు.

**శివతత్వంను పెంపొందించుటకు చర్యలు:**
తిరుపతిజిల్లాలోని శ్రీకాళహస్తి,సత్యవేడు నియోజకవర్గాలు శైవాలయాలకు నిలయంగా ఉన్నాయి. ఇక్కడ గ్రామాల్లో శిధిలమౌతున్న శివాలయాలను శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి సహాకారంతో రూ.2కోట్లు నిధులు కేటాయించి రూ.5లక్షలతో ఆలయాలను మరమ్మత్తులు చేసి వాడ వాడల్లో శివతత్వాన్ని పెంపొందించుటకు ప్రణాళికలు రూపొందించామన్నారు.శ్రీకాళహస్తి క్షేత్ర ప్రాశస్త్యాన్ని నలుదిశలా వ్యాపింపజేయుటకు ధర్మకర్తల మండలి కట్టుబడి పని చేస్తుందన్నారు. ఇక పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు ఒక్కడే ఆంధ్ర రాష్ట్రంలో ఉందని వాటితో అనుబంధం పెంచుకొనుటకు తమిళనాడులోని ప్రతి ఏటా ఉత్సవాల సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి సారె పంపే కార్యక్రమాలను రూపొందిస్తున్నామని వివరించారు.

**శివరాత్రికి ముస్తాబులు:**
దక్షిణ భారత దేశంలోని పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు వెలసిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రిని 'బ్రహ్మోత్సవాలుగా' నిర్వహిస్తారని ఇందుకు రాబోవు శివరాత్రికి ఏర్పాట్లు చేస్తున్నామని చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వివరించారు. శివరాత్రి నాటికి భక్తకన్నప్ప కొండపై చక్కటి ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఇక్కడ ధ్వజస్థంభం చుట్టూ తిరగటానికి వీలుగా ప్లాట్‌ఫారం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పైకి ఎక్కె మెట్లు ఆరు అడుగుల వేడల్పుతో ఉన్నాయని వాటిని 12 అడుగులకు పెంచుతున్నామన్నారు.అలాగే సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు.రాబోవు రోజుల్లో భక్తులకు బస సదుపాయం కల్పించుటకు, కాటేజీల స్కీంను రూపొందించామన్నారు.ఇప్పటికే లోబావిలో టిటిడి ఓ సత్రాన్ని, డార్మెంటరీని నిర్మించారని దేవస్థానం రూ.12కోట్లు వెచ్చించి మరో 125గదుల సత్రాలను నిర్మించిందని అలాగే భక్తుల భాగస్వామ్యంతో మరో సత్రాన్నినిర్మించుటకు కాటేజీల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నామని ఇప్పటికే రూ.60లక్షల విరాళాలు వచ్చాయని వివరించారు.

**అనుబంధ ఆలయాలకు మహర్దశ:**
శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న అనుబంధ ఆలయాలకు మహర్దశ కల్పించుటకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఇందులో బాగంగా పట్టణ నడిబొడ్డులోని ప్రసన్న వరదరాజ స్వామి ఆలయం జీర్ణోద్ధారణను రూ.4.4కోట్లతో, కుమారస్వామి కొండ పై వెలసినసుబ్రమణ్యం స్వామి ఆలయాన్ని రూ.2.9కోట్లతో కనకాచలంపై వెలసి దుర్గమ్మ ఆలయంను రూ.2.4కోట్లతో, గంగాసదన్‌కు రూ.2.5కోట్లతో రోడ్డు వేయించామని,అలాగే కొండచుట్టుకు రూ.18కోట్లతో రోడ్డు నిర్మించామని వివరించారు. అభివృద్ధికి మారుపేరుగా తాము చిత్తశుద్దితో పని చేస్తున్నామని అంజూరు శ్రీనివాసులు వివరించారు.



**దళారీ వ్యవస్థపై చర్యలు:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో దళారీ వ్యవస్థను రూపుమాపుటకు చర్యలు తీసుకుంటామని చైర్మెన్ వివరించారు.అయితే తనకు పూర్తి అధికారాలు కల్గిస్తే 72 గంటల్లో రూపుమాపుతామని ఇందుకు శాసనసభ్యుడు మధుసూధనరెడ్డి తనకు పూర్తి సహాకారం అందిస్తేచాలని శ్రీనివాసులు ఓ ప్రశ్నకు సమాధానం చెప్పారు.

## ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యసేవలు



**వీరఘట్టం, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేసిన ఫ్యామిలీ డాక్టర్ విధానంతో రోగులకు ఇళ్లవద్దే వైద్య సేవలందించడంతో వీరంతా ఆనందంతో ఉన్నారని వైద్యాధికారి పి.ఉమా మహేశ్వరి అన్నారు. శనివారం మండలంలోని నడిమికెల్లి గ్రామంలో నిర్వహించిన వైద్యశిబిరంలో పాల్గొని మాట్లాడారు. 104 సంచార వైద్య కేంద్రంలో రోగ నిర్ధారణ చేసే పరికరాలు ఉన్నందున రోగులకు అవసరమైతే వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఎక్కువగా బిపి, షుగర్, నీరుడుకు సంబంధించిన రోగులు వచ్చారని వారికి పరీక్షలు జరిపిన అనంతరం మందులు అందజేస్తామన్నారు. 32 మంది రోగులు ఈ వైద్య శిబిరంలో పాల్గొన్నారన్నారు. ఇంటింటి వైద్య సేవలను అందజేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వరప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ కె.ఆదిలక్ష్మి, ఎఎన్ఎం పైడితల్లి, ఎంహెచ్‌పి హారిక, 104 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



**పాలకొండ, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** పార్వతీపురం మన్యం జిల్లాలో డిసెంబర్ 4,5 తేదీల్లో జరుగనున్న సిఐటియు 10వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు సమన్వయ కమిటీ పిలుపునిచ్చింది. శనివారం పాలకొండ పట్టణంలో మండల సమన్వయకమిటీ అధ్యక్షులు బి.అమరవేణి, కార్యదర్శి రాము, కార్యవర్గ సభ్యులు కె.గౌరీశ్వరాఇ, పి.లక్ష్మి. టి.శారద, ఆర్తముడి లక్ష్మణరావు, మజ్జి వీరంనాయుడు, వైశ్రీనివాస్, బి.మాధవ్, చింతల సంజీవి, జెస్సీబాయ్ తదితరులు కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న సరళీ కరణ, ప్రపంచీకరణ, ప్రవేటీకరణ విధానాల వల్ల కార్మికులు, ఉద్యోగులు, కష్టజీవులుపై దోపిడి విధానం జరుగుతుందన్నారు. జిల్లాలో షుగర్ ఫ్యాక్టరీ, జైట్ తదితర చిన్న పరి శ్రమలు మూతపడ్డాయని, దాదాపు 20 వేల మందికి ఉపాధి పోయిందన్నారు. అంగన్వాడీ, ఎండిఎం, వెలుగు, స్కీవర్కర్ల, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగభద్రత లేకుండా కట్టుబానిసలు చేస్తున్నారని, ఈ వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు మహాసభలు వేదికకానున్నాయన్నారు. అన్ని రంగాల కార్మికులు కదిలి వచ్చి జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## ఘనంగా నాగేంద్రబాబు జన్మదిన వేడుకలు



**ఇచ్ఛాపురం, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** జనసేన పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ సభ్యులు కొణిదెల నాగేంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. నియోజకవర్గ జనసేన నాయకులు దాసరి రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంతోష్ మహర్ణ, ఢిల్లీ బిసాయి, రోకళ్ల భాస్కర్, కలియా గౌడో, దాసరి శేఖర్, సోమేష్, శ్యాంకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న ప్రభుత్వంలో అందరికీ సమన్యాయం

**– మాజీ ఎమ్మెల్యే సాయిరాజు**



**కవిటి, అక్టోబరు29 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వం అందరికీ సమన్యాయం జరుగుతుందని ఇందులో ఎటువంటి సందేహమే లేదని మాజీ ఎమ్మెల్యే ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పిరియా సాయిరాజు అన్నారు. ఈమేరకు శనివారంనాడు గడగడపకు కార్యక్రమములో బాగంగా గ్రామములోగల ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరు, ఇంకనూ అర్హత ఉండి ఎవరికైనా పథకాలు అందుతున్నాయా లేదా అనే విషయాలపై కూలంకుషంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో అర్హతే కొలమానం రాజకీయాలకు తోవలేదు అంటూ లెతిపారు. కనుక అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందే విధంగా వాలంటీర్లు, స్థానిక నాయకులు కృషిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమములో గ్రీన్ అండ్ భ్యూటీషియన్ చైర్మన్ నర్తు రామారావు, స్థానిక ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, కంచిలి ఎంపిపి పైల దేవదాస్‌రెడ్డి, సర్పంచ్ సనపల జానకిరావు, మండలపరిషత్ ఉపాధ్యక్షులు పూడి నేతాజి, ఎంపిటిసి సనపల క్రిష్ణారావు, మండలకోప్షన్ పాండవ చంద్రశేఖర్, సర్పంచ్ బద్రి ప్రకాష్, బెందాళం డిల్లిబాబు, సత్యంనారాయణపాడి, సర్పంచ్ మురపాల లచ్చయ్య, ఎలమంచి నీలయ్య, ఎన్ని ఆశోక్‌లతోపాటు పలువురు వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ఫ్యూజన్ మైక్రోఫైనాన్స్ తొలి పబ్లిక్ ఆఫరింగ్

**అరసవిల్లి, అక్టోబర్ 29 ప్రభాతవార్త**

ఫ్యూజన్ మైక్రో ఫైనాన్స్ లిమిటెడ్ తమ తొలి పబ్లిక్ ఆఫరింగ్‌ను 02 నవంబర్ 2022న తెరవనుంది. ఈఆఫర్‌లో భాగంగా ఒక్కోటి 10రూపాయల ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేర్లను జారీ చేయనున్నారు. తాజాగా 6వేల మిలియన్ రూపాయల షేర్లను జారీ చేస్తే 13,695,466 ఈక్విటీ షేర్లను విక్రయానికి అందుబాటులో ఉంచనున్నారు. యాంఠ్ ఇన్వెస్టర్లు 01 నవంబర్ 2022న తమ బిడ్డింగ్ దాఖలు చేయవచ్చు. ఈ ఆఫర్ 04 నవంబర్ 2022 న ముగుస్తుంది. పది రూపాయలు ముఖ విలువ కలిగిన ఫ్యూజర్ మైక్రో ఫైనాన్స్ లిమిటెడ్ ఈక్విటీ షేర్ ప్రైస్ బ్యాండ్‌ను 350 రూపాయలు నుంచి 368 రూపాయల ధరలో స్థిరీకరించారు. కనీసం 40 ఈక్విటీ షేర్లతో తమ బిడ్లను దాఖలు చేయాల్సి ఉంటుంది.

## పారిశుధ్యం మెరుగుకే అధిక ప్రాధాన్యత



**కోటబొమ్మాళి, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** మేజర్ పంచాయతీ కోటబొమ్మాళిలో పారిశుధ్యం మెరుగుకే అధిక ప్రాధాన్య ఇస్తున్నట్లు ఇఓ ఆర్.యోగేశ్వరరావు తెలిపారు. శనివారం నాగులచవితి రోజు కూడా గ్రామంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్యం కార్మికులతో పనులు నిర్వహించారు. ముఖ్యంగా వైశ్య కళ్యాణ మండపంకు వెళ్లే రోడ్డులో ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించారు.

## నేటి నుంచి పిక్నిక్

**గార, అక్టోబర్ 29 ప్రభాతవార్త :**

ప్రతి ఏటా కార్తీకమాసంలో ఆదివారం నాడు వన భోజనాలు చేస్తారు. మండలంలో మొగదాలపాడు, కళింగపట్నం బీచ్‌లతో పాటు ప్రసిద్ధి చెందిన సాలిహుండంలోని కొండపైన ఉన్న బౌద్ధ స్థూపాలను సందర్శిస్తారు. ఉత్తరాంధ్ర జిల్లా నుంచి కుటుంబాలతో వచ్చి వన భోజనాలు చేసి ఆ తర్వాత సముద్ర స్నానాలు చేస్తారు. వచ్చే వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా గార ఎస్సై మధుసూదనరావు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. జూదం, మద్యంను పిక్నిక్ వద్ద నిషేదించారు.

## అంగన్వాడీ భవనానికి శంకుస్థాపన



**మందస, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** మంత్రి అప్పలరాజు సూచనల మేరకు ఐటిడిఎ నిధులతో కొంకాడా పుట్టి పంచాయతీలో కిల్లోయి గ్రామంలో రూ.16లక్షలు, అలాగే బొగబంద పంచాయతీ డబారుసింగి గ్రామంలో రూ.16లక్షలుతో అంగన్వాడీ భవనాలు మంజూరు చేయడం జరిగింది. ఎంపిపి డొక్కరి దానయ్య శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జెడ్పీటిసి సవర చంద్రమ్మ, పార్టీ అధ్యక్షులు అంగున్న సూర్యారావు, వైస్ ఎంపిపిలుసీర ప్రసాద్, కొర్నాన ఆదినారాయణ, సర్పంచ్‌లు మజ్జి కుమార్‌చంద్ర, రౌతు విజయ, దుర్యోధన, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు బాడ జగన్నాయకులు, బృందావనం గౌడ్, సవర డొమ్మూరు, సొంబారమ్మా వైస్ సర్పంచ్‌లు సవర రాజు, సవర బాలకృష్ణ, పులారి తవిటయ్య, గ్రామ పెద్దలు హాజరయ్యారు. ఈ సందర్భంగా అందరికి ధన్యవాదాలు తెలిపారు.

## అందరి సహకారంతో ఉన్నతస్థితికి : ఎపిఎం కూర్మారావు

**ఆమదాలవలస, అక్టోబర్ 29 ప్రభాతవార్త :**

మన ప్రభుత్వం పేదరిక నిర్మూలనలో విద్య యొక్క ఆవశ్యకతను గుర్తించి భవిత మారాలంటే బిడ్డలు మారాలి. బిడ్డలు మారాలంటే బడులు మారాలి అనే సత్యాన్ని గుర్తించి ఎన్నో విప్లవాత్మక విద్యా సంస్కరణలు ప్రవేశపెట్టి, విద్యారంగానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వ పాఠశాలలను కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా, గుణాత్మక విద్యను అందించాలన్న సదుద్దేశ్యంతో మనబడి, నాడు నేడు పథకంతో ఉన్న స్థితి నుంచి ఉన్నతమైన స్థితికి మార్చి పిల్లల చదువు కోసం ఆహ్లాదకరమైన, ఆకర్షణీయమైన వాతావరణాని కల్పిస్తున్నట్లు వైఎస్సార్ క్రాంతిపథం అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు వివరించారు. ప్రభుత్వం నవశకానికి నాంది పలుకుతూ ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు ప్రతిరోజు మెనూ మార్చి రుచికరమైన నాణ్యమైన పౌష్టికాహారం అందించే ఉద్దేశ్యంతోనే వారానికి ఐదు గుడ్లు, మూడు వేరుశనగ బెల్లం చిక్కిలు పిల్లలకు అందజేస్తూ ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకం అమలు పరుస్తున్నట్లు తెలిపారు. మండలస్థాయిలో పేరెంట్స్ టీచర్స్ అసోసియేషన్, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేయించి వారందరికీ పథకాలపై సరైన అవగాహన కల్పించి తల్లిదండ్రుల భాగస్వామ్యంతో పాఠశాలల అభివృద్ధితో పాటు ప్రభుత్వ పథకాలు అర్హులకు అందించేటట్లు చేయడమే ముఖ్య కర్తవ్యమని తెలిపారు.

## పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలించిన బొబ్బిలి డిఎస్పీ



**వంగర, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** విజయనగరం జిల్లా వంగర మండలంలోని పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం బొబ్బిలి డిఎస్పీ బి.మోహనరావు ఆకస్మాత్తుగా విజిట్ చేసి తనిఖీ నిర్వహించారు. స్టేషన్‌లో నమోదైన నేర విభాగం కేసులు నమోదు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసులు ప్రజలతో ఫ్రెండ్లీగా ఉండాలని, అలాగే గ్రామాల్లో శాంతి భద్రతల కోసం ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలని, యువతకు మత్తు పదార్ధాలు వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని స్టేషన్ సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్ర మంలో రాజాం రూరల్ సిఐ నవీన్‌కుమార్, స్థానిక ఎస్సై లోకేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

## యుపీవీసీ తయారీ సామర్థ్యంను విస్తరించిన అపర్ణ ఎంటర్‌ప్రైజెస్

**బలగ, అక్టోబర్ 29 ప్రభాతవార్త :**

సుప్రసిద్ధ బిల్డింగ్ మెటీరియల్స్ సంస్థ అపర్ణ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ నేడు తమ యుపీవీసీ విభాగం కోసం వృద్ధి ప్రణాళికలను విడుదల చేసింది. బాచుపల్లిలోని తమ నూతన ప్రొడక్షన్ లైన్ ప్రారంభాన్ని పురస్కరించుకుని ఈ ప్రణాళికలను వెల్లడించింది. ఈ ప్రొడక్షన్ లైన్, అపర్ణ ఎంటర్‌ప్రైజెస్ యొక్క యుపివిసి బ్రాండ్స్ అపర్ణ వెన్‌స్టర్, ఒకోటెక్‌కు సంబంధించి యుపివిసి ప్రొఫైల్ కిటికీలు, తలుపుల డిమాండ్ తీర్చనుంది. ఈ నూతన ప్రొడక్షన్ లైన్, అపర్ణ ఎంటర్ ప్రైజెస్ యొక్క యుపీవీసీ ప్రొఫైల్ ఉత్పత్తి సామర్థ్యంను 50 శాతంకు పైగా పెంచడంతో పాటుగా ప్రస్తుతం ఉన్న 450 టన్నుల నుంచి నెలకు 700 టన్నులకు తీసుకు వెళ్లనుంది. ఈ బ్రాండ్ మరింతగా తమ ఉత్పత్తి సామర్థ్యం విస్తరించడంతో పాటుగా 2023 సంవత్సరానికి నెలకు 1100 టన్నుల యువిపిసి ప్రొఫైల్ ప్రొడక్షన్ సామర్థ్యం చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుందని తమ యుపీవీసీ విభాగపు ప్రణాళికలను గురించి డైరెక్టర్ టెక్నికల్ టి.చంద్రశేఖర్ చెప్పారు.

### మూడు రాజధానులపై

## సమగ్రమైన చట్టాన్ని చేసి అమలు చేయాలి



**సంతబొమ్మాళి, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** మూడు రాజధానులకు మద్దతు పలుకుతూ రాష్ట్రంలో అభివృద్ధి, పరిపాలన, అధికారాల వికేంద్రీకరణ జరగాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసి జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, అరుణోదయ రాష్ట్ర నాయకులు సన్నశెట్టి రాజశేఖర్, ఎఐకెయంఎస్ జిల్లా నాయకులు ఎన్.వెంకటరావు, ఎఫ్‌టియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.గణేష్, కళింగసీమ సాహిత్య సంస్థ నాయకులు మామిడి కోదండరావు డిమాండ్ చేశారు. సంతబొమ్మాళి మండలం వడ్డితాండ్ర తదితర గ్రామాల్లో మూడు రాజధానులకు మద్ధతుగా ప్రచార యాత్ర నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. వివక్షకుగురైన ప్రాంతాల ప్రజల నుంచి వస్తున్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోవాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి పార్టీతో పాటు ఐఎఫ్‌టియు, ఎఐకెఎంఎస్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, పిఓడబ్ల్యు, పిడిఎస్‌యు ఎస్.ఎన్‌పిఎస్ ఉత్తరాంధ్ర పోరాట సమితి, కళింగసీమ సాహిత్య సంస్థ, డప్పు కళాకారుల సంఘం వంటి పలు ప్రజా సంఘాలు కోరాయి. మధ్యాంధ్రప్రదేశ్, ఉత్తరాంధ్ర, సీమాంధ్ర ప్రాంతాల మధ్య అభివృద్ధిలో సమతుల్యతను పాటించడం ద్వారానే రాష్ట్రం సమైక్యంగా ఉండగలుగుతుందని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలను నిర్లక్ష్యం చేస్తూ అమరావతిని కేంద్రీకృత రాజధానిగా చేయడం సరి కాదన్నారు. అసమానతలు తొలగాలంటే అభివృద్ధి వికేంద్రీకరణ, పాలనా వికేంద్రీకరణ, అధికార వికేంద్రీకరణ తప్పనిసరిగా జరగాలనేది ఎప్పటినుంచో వస్తున్న ప్రధానమైన డిమాండ్‌గా వారు ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో మూడు రాజధానులను ఏర్పాటు చేయాలనే కోరిక బలియంగా ముందుకు వచ్చిందన్నారు.

## హెల్త్ ఎడ్యుకేటర్ ఆదిలక్ష్మికి రాష్ట్ర సేవారత్న అవార్డు



**వీరఘట్టం, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ ఎడ్యుకేటర్‌గా పని చేస్తున్న కోలక ఆదిలక్ష్మికి రాష్ట్రస్థాయిలో సేవారత్న అవార్డు లభించింది. ఈమె వైద్యరంగంలో విశష్టమైన సేవలను గుర్తించి విశాఖ పట్నంకు చెందిన మదర్ థెరిస్సా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సంస్థ సోషల్ సర్వీసులో భాగంగా ఈ అవార్డును ప్రధానోత్సవం చేయనున్నారు. ఈమె గ్రామీణ ప్రాంతంతో పాటు ఏజెన్సీలో కూడా గిరిజనులతో మమేకమై వైద్య రంగంలో తనదైన శైలీలో సేవలను అందించి మంచి గుర్తింపును తెచ్చుకున్నారు. వీటిని గుర్తించి వారు రాష్ట్ర స్థాయిలో సేవారత్న అవార్డుకు ఎంపిక చేశారు. ఈమెకు అవార్డు రావడం పట్ల పిహెచ్‌సి వైద్యాధికారులు ప్రదీప్‌కుమార్, ఉమామహేశ్వరి, సాయి ప్రసన్నతో పాటు ఎఎన్ఎంలు, పిహెచ్‌సి సిబ్బంది, 104, 108 సిబ్బంది తదితరులు అభినందనలతో ముంచెత్తారు.

శ్రీకాకుళం విజయనగరం పార్వతీపురం మన్యం
వార్త
25 Glorious years
ఆదివారం, 30 అక్టోబర్ 2022

## పలు గ్రామాల్లో ఘనంగా నాగులచవితి పూజలు



**సంతకవిటి, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** మండలంలో మందరాడ, సంతకవిటి, సోమన్నపేట, గరికిపాడు, తాలడ పలు గ్రామాల్లో నాగులచవితి పూజలు ఘనంగా నిర్వహించారు. నాగదేవతకి పుట్టలో పాలు, గుడ్లు వేస్తే చెవి నొప్పులు, నాడి కారడం వంటివి రావని గ్రామస్తుల నమ్మకం. అలాగే నాగదోషం ఉంటే పోతుందని నమ్మకం. పుట్టమన్ను చెవులకు బంగారంలా పెట్టుకోవాలట అంటే మనకు బంగారం లభిస్తుందని నమ్మకం. అందుకే భక్తిశ్రద్ధలతో నాగేంద్రునికి పుట్టలో పాలు, గుడ్లు వేసి పూజ చేశారు.

## హత్య కేసులో నిందితులు అరెస్ట్



**పాతపట్నం, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** పాతపట్నం మండలం వాసి గంగుపేటకు చెందిన రావడ రాజారావు (51) హత్య గావించబడ్డాడు. తన తమ్ముడు రావాడ ఫల్గుణరావు, కుటుంబ సభ్యులు నిందితులుగా ఫిర్యాదు రావడంతో పాతపట్నం సిఐ వినోద్‌బాబు, హౌస్ ఆఫీసర్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## అంబరాన్నంటిన రుద్రహోమం

**సారవకోట, అక్టోబర్ 29 ప్రభాతవార్త :**

సారవకోట మండలం చీడిపూడి గ్రామంలో గ్రామ పురోహితులు విద్యోపాసకులు అయ్యప్ప గురుస్వామి, బంకుపల్లి కృష్ణభాస్కరశర్మ, దాసుబాబుల ఆధ్వర్యంలో అలమాజీపేట గ్రామానికి చెందిన శ్రీవిద్యోపాసకులు బంకుపల్లి వెంకట భాస్కరశర్మ పర్యవేక్షణలో 27 మంది రుత్వికులతో కలిసి మృత్యుంజయ సంపుటి మహా రుద్రాభిషేకం, అలాగే నమక చమక రుద్ర హోమం పలు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవిద్యోపాసకులు దాసుబాబు, కృష్ణభాస్కరశర్మ, వెంకట భాస్కర శర్మలు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పరిషత్తు, మండప పూజలు, వేద స్వస్తి పలు పూజలతో ప్రారంభించి లోక కళ్యాణార్థం నమక చమక పారాయణం, అలాగే మహా రుద్రాభిషేకం కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. అనంతరం రుద్రహోమం నిర్వహించారు. మహారుద్రాభిషేక తదితర కార్యక్రమ తీర్థప్రసాదాలు భక్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గాయపడిన సర్పంచ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి



**కొత్తూరు, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** కొత్తూరు మండలం వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు సారిపల్లి ప్రసాదరావు సతీమణి బలద గ్రామ పంచాయతీ సర్పంచ్ సారిపల్లి భారతి ఇటీవల నివగాం సమీపంలో ద్విచక్ర వాహనంపై నుంచి జారిపడి గాయాల పాలై శ్రీకాకుళం పట్టణంలోని మెడికవర్ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్న సంగతి పాఠకులకు తెల్సిన విషయమే. ఈ మేరకు శనివారం స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి జిల్లా కేంద్రంలో వైద్య సేవలు పొందుతున్న సారిపల్లి భారతిని పరామర్శించి నేరుగా ఆమెతో మాట్లాడి ఆమె ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సర్పంచ్ సారిపల్లి భారతికి జరిగిన శస్త్రచికిత్సలు గురించి సంబంధిత వైద్యులతో మాట్లాడి ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

## కుమారుని జ్ఞాపకార్ధం ఉచిత విద్యను అందిస్తున్న సర్పంచ్



**సోంపేట, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** మరణించిన తన కుమారుని జ్ఞాపకార్ధం ఐదుగురు పేద విద్యార్థులకు ఉచితంగా చదివించడానికి ముందుకు వచ్చి ఇసకలపాలెం సర్పంచ్ తన ఉదారతను చాటుకున్నారు. సోంపేట మండలం ఇసకలపాలెం సర్పంచ్, జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బి.ఈశ్వరరావు కుమారుడు బైపల్లి హర్షిత్ ఇటీవల ఆకస్మాత్తుగా మరణించారు. ఆ అబ్బాయి జ్ఞాపకార్ధం కవిటిలో గల శ్రీకళ్యాణి ఇంగ్లీష్‌మీడియం స్కూల్ నందు ఐదుగురు విద్యార్థులకు ప్రతి సంవత్సరం పుస్తకాల ఫీజు, బట్టలు అందిస్తానని కళ్యాణి విద్యాసంస్థల కరస్పాండెంట్ ఇచ్ఛాపురం నియోజకవర్గ జనసేన నాయకులు లోళ్ల రాజేష్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రటరీ, జనసైనికులు బాలయ్య, కాళీ, రవి, యోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నాగుల చవితి పండగ



**కంచిలి, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** కంచిలిలి మండలంలో నాగులచవితి పండగను ప్రజలందరు ఘనంగా జరుపుకున్నారు. దీపావళి పండుగ తర్వాత వచ్చిన నాగులచవితి పండగను ప్రతి ఒక్కరు పాము పుట్టల వద్ద పాలు, గుడ్లు వేసి నాగదేవతను కొలిచారు. నాగుల చవితి పండగను చేసుకుంటే ఎటువంటి దోషాలు ఉండవని, నాగదేవత నుంచి కుటుంబంకు రక్షణ ఉంటుందని అందుకోసమే ఈ పండుగను చేసుకంటున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరు పుట్టల వద్ద పూజల కోసం బారులు తీరారు.

## ఈ-పంట నమోదు వివరాలు రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శన



**మెళియాపుట్టి, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** ఈపంట నమోదు వివరాలు అన్ని రైతు భరోసా కేంద్రాల్లో సోషల్ ఆడిట్ కొరకు ప్రదర్శించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి దానకర్ణుడు తెలిపారు. రైతులు విధిగా తాను వేసిన పంట యొక్క వివరాలను సరి చూసుకోవాలని తెలిపారు. ఈ పంట మన మండలంలో శతశాతం పూర్తయ్యిందని ఈ సందర్భంగా తెలిపారు. ఈపంట వివరాలు అన్ని ప్రభుత్వ పథకాలకు, ధాన్యం కొనుగోలుకు, పంట నష్టాలకు, ఇన్సురెన్స్ మొదలగు వాటికి ప్రామాణికంగా తీసుకుంటున్నారు. రైతులు తమ పంట వివరాలను విధిగా చూసుకోవాలని తెలిపారు.

# సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాల్సిందే

### - కమిషనర్ శ్రీరాములు నాయుడు



**విజయనగరం కార్పొరేషన్ (ప్రభాత వార్త) :**
నగరంలో సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాల్సిందేనని నగరపాలక సంస్థ కమిషనర్ రెడ్డి శ్రీరాములు నాయుడు స్పష్టం చేశారు. ఈమేరకు నగరపాలక సంస్థ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్లాస్టిక్ వస్తువులు, క్యారీ బ్యాగులు, ఇతర అలోహ వస్తువులు తరచూ ఏ ప్రాంతం నుంచి వస్తున్నాయి, ఎక్కడ విక్రయిస్తున్నారన్న విషయాలను ఆరా తీసి, నిఘా పెంచాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అలోహ వస్తువుల వినియోగం, విక్రయాలు నిషేధించారని చెప్పారు. అయితే ఎంత అవగాహన కల్పించినప్పటికీ ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలు ఇంకా సాగుతున్నట్లుగా గమనించామన్నారు. దీనిపై ఉక్కుపాదం మోపేందుకు నిఘాను ఉధృతం చేయడంతో పాటు విక్రయాలు సాగిస్తున్న వర్తకులపై భారీ జరిమానాలు విధిస్తామన్నారు. అప్పటికీ మార్పు రాకపోతే ప్లాస్టిక్ అమ్మకాలు చేస్తున్న దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అలాగే నగరంలో తడి చెత్త, పొడి చెత్త తప్పనిసరిగా వేరుచేసి సేకరించాలని సిబ్బందికి ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.శ్రీనివాసరావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ సత్యనారాయణ, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు లావేటి బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా నాగుల చవితి వేడుకలు



**శృంగవరపుకోట, అక్టోబర్ 29 ప్రభాతవార్త :**
నాగులచవితి వేడుకలు మండల ప్రజలు శనివారం నాడు అత్యంత ఘనంగా జరుపుకొన్నారు. తెల్లవారు ఆరుగంటల నుంచే కుటుంబ సభ్యులతో పుట్ట వద్దకు చేరుకున్నారు. అనంతరం నాగేంద్రు డుకు ఇష్టమైన పాలు, చలివిడి, సిమిలి తదితర పదార్థాలను పుట్టలో వేసి పూజలు నిర్వ హించారు. అనంతరం పుట్ట వద్ద బారీ ఎత్తున బాణసంచా వెలిగించారు. ఇక కొంతమంది రైతులు పుట్టవద్ద పూజలు నిర్వహించి అనంతరం అక్కడే వనభోజనాలు చేపట్టారు. మొత్తం మీద నాగులచవితి వేడుకలు మండల ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు.

# గత ఏడాది కంటే రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం!



**గజపతినగరం, అక్టోబర్ 29 ప్రభాతవార్త :**
జిల్లా వ్యాప్తంగా గత ఏడాది కన్నా ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయని జిల్లా ఎస్పీ ఎం.దీపికాపాటిల్ అన్నారు. శని వారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆమె తనిఖీ చేశారు. రికార్డులు నిర్వహణ సిబ్బంది పనితీరు, కేసుల పురోగతి వంటి విషయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే జైలు వార్డులు, ఫ్యామిలీ కౌన్సెలింగ్ గదులను కూడా తనిఖీ చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఈ ఏడాది జులై నెల వరకు రోడ్డు ప్రమాదాల శాతాన్ని పరిశీలించగా గత ఏడాది కన్నా 20శాతం ప్రమాదాలు తగ్గాయన్నారు. ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న ముందుస్తు చర్యల వలనే రోడ్డు ప్రమాదాలను తమ సిబ్బంది తగ్గించగలిగారన్నారు. ప్రమాదాలు జరిగిన చోటు కూడా మరణాల రేటు తక్కువగా ఉందన్నారు. జిల్లాలో గంజాయి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రదానంగా 11 పోలీస్టేషన్ల పరిధిలోనే గంజాయి సరఫరా జరుగుతున్నట్లు గుర్తించామని, ఇందుకు గాను ప్రత్యేక టాస్క్‌పోర్స్ టీములను ఏర్పాటు చేశామన్నారు. దీనివలన మంచి ఫలితాలు వస్తాయని, గంజాయి అమ్మకపు దారులు, కొనుగోలుదారులపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. గంజాయితో పట్టుబడే 18-22 సంవత్సరాల యువకులపై కూడా కేసులు పెడుతున్నామన్నారు. సైబర్ నేరాలపై ప్రత్యేకదృష్టి సారిస్తున్నామన్నారు. లోన్‌యాప్స్ పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా మన్నారు. ఆన్‌లైన్ చెల్లింపులు పట్ల అప్రమత్తంగా ఉండాలని, మోసపోయిన 24 గంటల్లో తమకు సమాచారం అందిస్తే బాదితునికి మేలు చేసే అవకాశముంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 3,600 పెండింగ్ కేసులు ఉన్నట్లు తెలిపారు. డ్రంకు అండ డ్రైవ్ త్రిబుల్ రైడింగ్ లపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. నిషేదిత ఖైనీ, గుట్కా అమ్మకపు దారులపై కేసులు పెడుతున్నా కోర్టులో వీడిపోతున్నాయన్నారు. అలాగే పశు అక్రమ రవాణాపై నిఘా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి డిఎస్పీ మోహనరావు, సిఐ లెంక అప్పలనాయుడు, ఎస్ఐ సి.హెచ్. గంగరాజు పాల్గొన్నారు.

# జాతీయ సమైక్యతా దినోత్సవ రన్

**పార్వతీపురం, అక్టోబర్ 29 ప్రభాతవార్త :**
జాతీయ సమైక్యతా దినోత్సవ రన్ (రాష్ట్రీయ ఎక్తా దివాస్) ను 31వ తేదీన జరిగే నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ సమైక్యతా దినోత్సవ రన్ జిల్లా క్రీడా ప్రాదికార సంస్థ ఆద్వర్యంలో జరుగుతుందని ఆయన అన్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఇన్‌చార్జి జిలా కలెక్టర్ ప్రారంభిస్తారని ఆయన చెప్పారు. జూనియర్ కళాశాల మైదానం నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఐటిడిఆఎ పెట్రోల్ బంకు, ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రభుత్వ కార్యాలయ భవనాల సముదాయం (ఆర్‌సిఎం) వరకు సాగుతుందని వివరించారు. ఆర్‌సిఎం వద్ద ముఖ్య అతిథులు ప్రసంగాలతో రన్ ముగుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, విద్యార్థులు, క్రీడాకారులు, ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలి

### జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్



**విజయనగరం (ప్రభాత వార్త) :**
ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను గుర్తించి, వారిని అన్ని విధాలా ప్రోత్సహించాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశించారు. జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం జరిగింది. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ఉన్న అవకాశాలు, వచ్చిన దరఖాస్తులు, పారిశ్రామిక వాడల్లో మౌలిక సదుపాయాల కల్పన, మహిళా పారిశ్రామక వాడ ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను గుర్తించేందుకు వివిధ ప్రభుత్వ సంక్షేమ శాఖలు కూడా కృషి చేయాలన్నారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ సంక్షేమ శాఖలు తమ పరిధిలోని ఔత్సాహికులను గుర్తించి, వారికి పరిశ్రమలస్థాపనపై అవగాహన కల్పించాలని సూచించారు. పిఎంఇజిపి పథకం క్రింద పరిశ్రమల స్థాపనకు 300 పైగా ధరఖాస్తులు రాగా, కేవలం 63 మాత్రమే గ్రౌండింగ్ చేయడం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. వచ్చినవాటన్నిటికీ అనుమతులు, రుణాలను త్వరగా మంజూరు చేసి, పరిశ్రమలను స్థాపించేవిధంగా కృషి చేయాలని సూచించారు. పరిశ్రమల స్థాపనలో డిఆర్‌డిఏ, మెప్మా కీలక పాత్ర పోషించాలని కోరారు. మైనారిటీలకు మంజూరైన ఎండియు వాహనాన్ని మూడు రోజుల్లో గ్రౌండింగ్ అయ్యేలా చూడాలని, మైనారిటీ శాఖను జెసి ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమలశాఖ మేనేజర్ పాపారావు, డిడి నాగేశ్వర్రావు, డిఆర్‌డిఏ పిడి ఎ.కల్యాణచక్రవర్తి, వ్యవసాయశాఖ జెడి తారకరామారావు, ఉద్యానశాఖ డిడి జమదగ్ని, మత్స్యశాఖ డిడి నిర్మలాకుమారి, గ్రౌండ్ వాటర్ డిడి దుర్గాప్రసాద్, కాలుష్య నియంత్రణ శాఖ ఇఇ సుదర్శన్, ఎల్‌డిఎం శ్రీనివాసరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 'స్వామి' కార్యం-స్వకార్యం

### మితిమీరిన రాజ'కీ'యం - శృతిమించిన పెత్తనం - పాలకవర్గం మౌనం

**విజయనగరం కార్పొరేషన్ (ప్రభాత వార్త) :**
విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో మితిమీరిన రాజకీయ జోక్యం పెరగడంతో అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. స్వామి కార్యం-స్వకార్యం అనే రీతిలో ఏపని చేయాలన్నా కీలక నేత అనుమతి లేకుండా చేయలేని పరిస్థితులు దాపురించాయి. నగరపాలనంతా కీలక నేత కనుసన్నల్లో ఉండడంతో పాలకవర్గం ఉన్నా ఏమాత్రం ప్రయోజనం కనిపించడం లేదు. పాలనాపరమైన వ్యవహారాలతో పాటు కార్యాలయంలో తీసుకునే అంతర్గత నిర్ణయాలను కూడా ఆ కీలక నేత దృష్టికి తీసుకువెళ్లాలనే పరిస్థితులు దాపురించాయంటే నగర పాలక సంస్థ పరిపాలనలో ఆ నేత ప్రభావం ఏమేరకు ఉందో ఊహించుకోవచ్చునని నగర ప్రజలు చర్చించుకుంటున్నారు. రాష్ట్రంలో ఏ మున్సిపల్ కార్పొరేషన్‌లో లేనివిధంగా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో అన్ని విభాగాల పనితీరును పర్యవేక్షించేందుకు, అభివృద్ధి పనులపై చర్చించేందుకు వార్డు సభ్యుల (కార్పొరేటర్ల)తో కమిటీలను ఏర్పాటు చేశారు. నగర పాలక సంస్థలో చేపట్టే ఏ కార్యక్రమమైనా ఆ కీలక నేత దృష్టికి తీసుకువెళ్లిన తర్వాతే కమిటీ సమావేశాల్లో చర్చించాల్సి ఉంటుందని సాక్షాత్తు కార్పొరేటర్లే చెబుతున్నారు. పాలనాపరమైన వ్యవహారాలు, అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై అధికారులు తీసుకునే నిర్ణయాలను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు స్వేచ్ఛాయుత నిర్ణయాలను నియంత్రించేందుకు పాలకవర్గ సభ్యులనే కమిటీలుగా నియమించి తమపై ఒత్తిడి తీసుకురావడంతో పాటు పెత్తనం చెలాయిస్తున్నారనే గుసగుసలు అధికారుల నుంచి వినిపిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాజకీయ జోక్యం పెరగడంతో అన్ని విభాగాల అధికారులు నలిగిపోతున్నారు. ఫలితంగా టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగాల్లో అధికారులు స్వంతంగా నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు.

# రెండు లారీలు ఢీ!

### - ఒకరు మృతి మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



**బొండపల్లి, అక్టోబర్ 29 ప్రభాతవార్త :**
జాతీయ రహదారి 26పై శనివారం వేకువజామున నాలుగు గంటల సమయంలో ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు డీ కొన్న ప్రమాదంలో లారీ డ్రైవర్ ఒకరు అక్కడిక్కడే మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన చోటుచేసుకుంది. సంఘటనకు సంబదించి స్థానిక ఎస్.ఐ రవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ నుంచి ఒడిషాకు ఐరన్‌లోడుతో వెళుతున్న లారీతో పాటు విశాఖపట్నం నుంచి దాయ్‌గడ్ వెళుతున్న కర్రల లోడుతో వెళుతున్న లారీ వేకువజామున బోడసింగిపేట పెట్రోలు బంకుకు సమీపంలో బలంగా రెండు బలంగా రెండు ఢీ కొన్నాయని తెలిపారు. ఈ ప్రమాదంలో కాకినాడకు చెందిన లారీ డ్రైవర్ కుమారస్వామి (30) ఇనుపకడ్డీలు కింద పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు చెప్పారు. అలాగే ఇదే ప్రమాదంలో విశాఖపట్నం జిల్లా శోంత్యాం చెందిన ఎస్.శ్రీనుతోపాటు కె.సీతారాంలు తీవ్రంగా గాయపడినట్లు చెప్పారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు క్షతగాత్రులను 108 వాహనంలో విజయనగరం కేంద్రాసుపత్రికి తరలించారు. ఇక ప్రమాదంలో క్యాబిన్‌లో చిక్కుకుని మృతి చెందిన వ్యక్తిని బయటకు తీయడానికి పోలీసులు రెండు గంటల పాటు శ్రమించి బయటకు తీశారు. ఇక రెండు లారీలు కూడా జాతీయ రహదారికి మద్యలో ప్రమాదం జరగడంతో వాహనాలు రాకపోకలు తీవ్ర అంతరాయం కలిగింది. వేకువ జామున నాలుగు గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు లారీలను ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా బయటకు తీయడానికి పోలీసులకు సమయం పట్టింది. అసలే నాగులచవితి కావడంతో స్వగ్రామాలకు వెళ్ళేందుకు చాలా మంది సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ట్రాఫిక్‌లో ఇరుకుపోయి నిరీక్షించాల్సి వచ్చింది. గజపతినగరం వైపుతో పాటు బొండపల్లి వైపు నాలుగు కిలోమీటర్ల మేర ట్రాఫిక నిలిచి పోయింది. శవాన్ని పంచనామా నిమిత్తం గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు. ఢీకొన్న లారీలు (బిపిఎల్ జెపిజి)

# ప్రజాసమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం



**వేపాడ, అక్టోబర్ 29 ప్రభాతవార్త :**
ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే ఈ ప్రభుత్వ ధ్యేయమని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నీలకంఠరాజపురం గ్రామంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా కడుబండి ప్రతి గడపగడపకు వెళ్ళి వారి సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి వారికి అందుతున్నది లేనిది ఆరా తీశారు. అలాగే నిరుపేదలు మహిళాబివృద్ధికి రైతు సంక్షేమానికి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందన్నారు. అలాగే ఈ ప్రాంత అభివృద్ధిని కోరుతూ విశాఖ రాజదానిగా సిఎం ప్రతిపాదించడం చెప్పుకోదగ్గ విషయమని దీనిని ప్రతిపక్షాలు అడ్డుకోవడం ఎంతవరకు న్యాయమో ప్రజలందరూ గ్రహించాలని సూచించారు. విశాఖ రాజదాని అయితే ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధితో పాటు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని అలాగే ఆర్థికి అభివృద్ధి చెందవచ్చని ఆయన ప్రజల దృష్టికి తీసుకెళ్ళారు. గ్రామానికి చెందిన పలువురు యువకులు ఇంటింటి కొళాయిలు గ్రామాభివృద్ధి గ్రంథాలయం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఇప్పటికే గ్రామంలో ఇంటింటి కొళాయిలు ఏర్పాటు పనులు చురుకుగా సాగుతున్నాయని యువకులు దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సిసి రోడ్ల నిర్మాణానికి జనవరిలో నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే గ్రంథాలయం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించి గ్రంథాలయ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. నేటివరకు ఏ ఎమ్మెల్యే అయినా ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకోవడం జరిగిందా ఈ ముఖ్యమంత్రి ప్రతి ఇంటికి వెళ్ళి సమస్యలు తెలుసుకోమని పంపించడం అబినందించాల్సింది పోయి విమర్శలకు దిగడం సరైన విదానం కాదని హితవు పలికారు. ఇటువంటి కార్యక్రమాలు చేపట్టిన ముఖ్యమంత్రిని యువత ఆదర్శంగా తీసుకుని మరింత ప్రోత్సహంతో గ్రామాల అభివృద్ధికి కంకణం కట్టాలని యువతకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, మండల పార్టీ అద్యక్షుడు ముమ్మలూరి జగ్గిబాబు, కోఆపరేటివ్ అద్యక్షులు వేచలపు రామ్మూర్తినాయుడు, గ్రామ సర్పంచ్ గొటివాడ దేవి, ఉప సర్పంచ్ ఖండిపల్లి పెదనాయుడు నాయకులు గండి శ్రీరామ్మూర్తి, మురిపిండి గంగరాజు, బోజంకి రామునాయుడు, జి.సత్యం నాయుడు, రావాడ వెంకటరావు, బుద్ధకృష్ణ, చీపురుపల్లి వెంకటరమణ పాల్గొన్నారు.

# ఘనంగా నందెమ్మ సంబరాలు



**రామభద్రపురం, అక్టోబర్ 29 ప్రభాతవార్త :**
మండల పరిధిలో ఆరికతోట గ్రామంలో శనివారం నాగులచవితి పండగను నందెమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే అందరూ కుటుంబీకులతో కలిసి పుట్టలో పాలుపోసి నాగేంద్రునికి భక్తితో కొలిచారు. అనంతరం నందెమ్మ పండగను కూడా ఉత్సవ కమిఈ అద్యక్షులు మీసాల ప్రసాదరామ అద్యక్షతన అందరూ ఊరేంగింపు సంబరం చేశారు. స్త్రీలు గౌరీమాతను తలపై మోసి భక్తిని ప్రదర్శించారు. కుటుంబాలు దీవించబడాలని పంటలు సమృద్ధిగా పండాలని భక్తులు కోరుతున్నారు.

శ్రీకాకుళం విజయనగరం
పార్వతీపురం మన్యం
25 Glorious years
వార్త
ఆదివారం, 30 అక్టోబర్ 2022

### అశేష భక్త జనం మధ్య..

# ఘనంగా ఖాదర్ బాబా జయంతోత్సవం

### బాబాకు చాదర్ సుగంధ సమర్పణ - భారీ కేక్ కటింగ్..దివ్యన్న సమారాధన



**విజయనగరం (ప్రభాత వార్త) :**
ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక పుణ్య క్షేత్రం బాబామెట్టలో శనివారం సూఫీ సెహన్షా, సద్గురు హజరత్ సయ్యద్ బాబా ఖాదర్ వలీ 126వ జయంతోత్సవం ఘనంగా జరిగింది. ఖాదర్ బాబా దర్గా దర్బార్ షరీఫ్ ముతవల్లి(ధర్మకర్త) డాక్టర్ ఎండీ ఖలీలుల్లా షా తాజ్ ఖాదరీ సాబరీ నేతృత్వంలో జరిగిన ఈ వేడుకలకు అలుపెరుగని అన్నదాత, మహా మానవీయులు, సూఫీ సూరీడు హజరత్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బాబా దర్గా, దర్బార్ షరీఫ్(చీమల పాడు) పీఠాధిపతి పీర్జదా ముహమ్మద్ ఖాజా మోహియుద్దీన్ షా తాజ్ ఖాదరీ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలు చేసి బాబా జయంతోత్సవాలను ప్రారంభించారు. చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వేలాది మంది హిందూ భక్తులు ఖాదర్ బాబా దర్గా దర్బార్ కి బారులు తీరారు. బాబా వారికి ప్రత్యేక ప్రార్థనలు చేసి, మధ్యాహ్నం నిర్వహించిన లంగర్ ఖానాలో దివ్యన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ వేడుకల్లో నిర్విరామ ఖాదర్ బాబా సేవకులు, ప్రేమికులు, అతా ముహమ్మద్ నిజాముద్దీన్ నిజామీజానీ షా తాజ్ ఖాదరీ, సిద్దిక్, నయీమ్, డాక్టర్ అవసరాల శ్రీధర్, సీనియర్ జర్నలిస్ట్ ఎలిశెట్టి సురేష్, లింగాల రవికుమార్, దర్బార్ షరీఫ్ సేవా బృందం తదితరులు తమ సేవలను అందించారు. అదేవిధంగా ఖాదర్ బాబా భక్తులతో పాటు ఆయన ప్రియ శిష్యులు హజరత్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బాబా అహ్లుయా వారి శిష్య బృందాలు హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, తిరుపతి, తెనాలి, మార్టూరు, పేరిచర్ల, ఒంగోలు, ఖమ్మం, జంపనీ, విశాఖపట్నం, చీమలపాడు, జుజ్జురు, అల్లూరు, కొత్త గూడెం తదితర రాష్ట్ర నలుమూలల నుంచి, దేశ విదేశాల నుంచి తరలి వచ్చి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. నగరానికి చెందిన ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు దర్గా దర్బార్ కి విచ్చేసి బాబాకు ప్రార్థనలు చేశారు. శనివారం సాయంత్రం చీమలపాడు పీఠాధిపతి ఖాజా బాబు, విజయనగరం బాబా దర్గా దర్బార్ ధర్మకర్త ఖలీల్ బాబు ఆధ్వర్యంలో ముజావర్లు, భక్తులు ఖాదర్ బాబా దర్గాలో బాబాకు సుగంధ ద్రవ్యోచిత చాదర్, పూలు సమర్పించి విశ్వ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్బార్ షరీఫ్ లో అశేష భక్త జనం మధ్య ఖాదర్ బాబా పుట్టిన రోజును పురస్కరించుకుని భారీ కేకును కట్ చేసి భక్తులకి దాన్ని ప్రసాదంగా పంచి, సర్వేజన సుఖినోభవంతు అని పీఠాధిపతి కాజల్ బాబు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం రాత్రి 7 గంటలకు మొదలైన దివ్యన్న సమారాధన అర్ధరాత్రి వరకు కొనసాగింది. వేళ మంది భక్తులకు లంగర్ ఖానాలో రుచికరమైన ఆహార పదార్థాలతో విందు నిర్వహించారు. టు టౌన్ సిఐ లక్ష్మణ్ రావు నేతృత్వంలో పోలీస్ లు బందోబస్తు నిర్వహించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా వేడుకలు ఘనంగా జరిగాయి.

# నవజీవన్ విద్యార్థులతో చవితి పండగ



**సాలూరు, అక్టోబర్ 29 ప్రభాతవార్త :**
సాలూరు పట్టణ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న నవజీవన్‌పూర్ చిల్డ్రన్స్ హాస్టల్స్ ఆర్గనైజర్ చిక్కాల చిన్నమ్మలు ఆశ్రమంలో ఉంటున్న విద్యార్థులతో నాగులు చవితి పండగను ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం కాలేజి సమీపంలో ఉన్న పుట్ట దగ్గరికి వెళ్ళి హాస్టల్లో సుమారు 80 మందికి పైగా ఆశ్రమం పొందుతున్న విద్యార్థిని విద్యార్థులతో పుట్టకు పూజలు నిర్వహించి వారితో పాలు ప్రసాదం పుట్టలో పోయించారు. అనంతరం విద్యార్థులతో వారు బాగా చదువుకుని అభివృద్ధిలోకి రావాలని నాగదేవతకు ప్రార్థనలు చేయించారు. చిన్నమ్మలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం హాస్టల్ విద్యార్థులతో నాగులచవితి పండగ ఎంతో వేడుకగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఐఆర్డీఎస్ ఎన్జీఒ చిక్కాల స్వాతిశ్రీ, సిబ్బంది, జయంతి హాస్టల్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పంచాయితీ కార్యదర్శిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన సర్పంచ్



**నెల్లిమర్ల, అక్టోబరు 29 ప్రభాతవార్త :**
మండలంలోని వల్లూరు గ్రామ సచివాలయ కార్యదర్శి గుండాల వెంకటేష్‌పై ఆ గ్రామ సర్పంచ్ పంచాది జయలక్ష్మి నెల్లిమర్ల పోలీసులకు శనివారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె నెల్లిమర్లలో విలేకర్లతో మాట్లాడారు. తన ప్రమేయం లేకుండా కార్యాలయాన్ని పాత భవనం నుంచి కొత్త భవనంలోనికి మార్పు చేశారని, ఇదేమని అడిగితే ఈ నెల 5వ తేదీనే మార్పు చేశామని నిర్లక్ష్యంగా చెప్పడంతో పాటు గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త కంది శ్రీనివాసరావు కొబ్బరి కాయ కొట్టి ప్రారంభిం చారని చెబుతున్నారని ఆమె పేర్కొన్నారు. గ్రామ ప్రధమ పౌరురాలను, సర్పంచ్‌ను అయిన తనకు సమాచారం లేకుండా తన అనుమతి లేకుండా ఎలా కొత్త భవనంలోని మార్పు చేస్తారని ఆమె ప్రశ్నించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న గ్రామ కార్యదర్శి వెంకటేష్‌పైన, భవనాన్ని ప్రారంభించిన వైసిపి కార్యకర్తపైన చర్యలు చేపట్టాలని పోలీసులను కోరినట్లు సర్పంచ్ జయలక్ష్మి తెలిపారు. పోలీసులను కలిసిన వారిలో సర్పంచ్‌తో పాటు ఎంపీటీసీ లెంక నాగేశ్వరి, టిడిపి నాయకులు పంచాది జగన్నాథం, లెంక సన్యాసిరావు, మంగం శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

# ఆ మలుపు ప్రమాదాలకు పిలుపు!



**పాచిపెంట, అక్టోబర్ 29 ప్రభాతవార్త :**
మండల కేంద్రానికి వచ్చే ఆర్.అండ్.బి రహదారిలో పాచిపెంట నుంచి జాతీయ రహదారి పనసపెద్ది, కొనవలస బోర్డర్ చెక్‌పోస్టు వరకు ఉన్న మలుపులు వచ్చే పోయే వాహనదారులకు ప్రమాదాకలు నిలయంగా మారాయి. పాచిపెంట ఎంపిడిఒ జంక్షన్ మొదలుకుని దానాల గోర్జా, రేవల్ల ఆరి కళ్ళాలు పోతలగెడ్డపోలమ్మ, చెరువు పిల్లింగ్ గుడ్డివరకు ఉన్న మలుపులు ఇరువైపులా వచ్చిన వాహనదారులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయంతో ప్రయాణం చేసుకుంటున్నారు. నిత్యం ఈ రహదారి గుండా ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు జీపులు బారీ వాహనాలు తరుచూ ప్రయాణిస్తుంటాయి. అదే విధంగా మలుపులు, రోడ్డు ఇరువైపులా చెట్టు పొదల ఉండటంతో వచ్చే పోయే వాహనాలు ఎదురెదురుగా కనిపించకపోవడం వలన పలు ప్రమాదాలు సంభవిస్తున్నాయని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుఇరువైపులా ఉన్న చెట్టు తుప్పలు డొంకలను నరికి వేయించాలని పలువురు కోరుతున్నారు. మండల కేంద్రం పాచిపెంట కావటంతో అనేక అవసరాల నిమిత్తం ప్రజలు ఉద్యోగులు రహదారి గుండా ప్రయాణం చేస్తుంటారు.

### నాగులచవితి పర్వదినం సందర్భంగా
## పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ వంశీకృష్ణయాదవ్ దంపతులు

అల్లిపురం, అక్టోబర్ 29, ప్రభాతవార్త



నాగుల చవితి పర్వదినం పురస్కరించుకొని ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి నాగేంద్రునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుటలో పాలు పోసి, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి పూర్వీకులు ఆచరించిన ఆచారాలు, సంప్రదాయాలు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవడం అందరి భాధ్యత అని అన్నారు. కుటుంబ సమేతంగా జరుపుకునే విశిష్టమైన పండుగ నాగులచవితి అని అన్నారు. ప్రజలందరూ ఆరోగ్యవంతంగా సంతోషంగా శ్రేయస్సును కలిగి ఉండాలని ఆ నాగేంద్రుని పూజించారు.

## రొమ్ము క్యాన్సర్ పట్ల అప్రమత్తం
### కేజీ హెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మైథిలి

అల్లిపురం, అక్టోబర్ 29, ప్రభాతవార్త



రొమ్ము క్యాన్సర్ పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని రొమ్ముల్లో గడ్డలు ఏర్పడడం పరిమాణం మారినప్పుడు ఏ మాత్రం అశ్రద్ధ చేయకుండా ఆంకాలజిస్టును చూపించాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మైథిలి చెప్పారు. అక్టోబర్ నెల రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసం కావడంతో శనివారం చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారాకనగర్‌లోని హోటల్ నందు రొమ్ము క్యాన్సర్ పై ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె మాట్లాడారు. రొమ్ము క్యాన్సర్ కుక కేజీహెచ్ లో మెరుగైన వైద్యం లభిస్తోందని, మహిళలలు ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ప్రతి రెండు నుంచి ఐదేళ్లకోసారి పరీక్షలు చేయించుకుంటే రొమ్ము క్యాన్సర్ కు దూరంగా ఉండొచ్చన్నారు. కేజీహెచ్ కాన్సర్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కుమారి మాట్లాడుతూ 35ఏళ్ల తర్వాత వివామం జరిగే వారికి 55ఏళ్ళ తరువాత బహిష్టులు అగేవారికి రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని వారు ఎప్పటికప్పుడు స్క్రీనింగ్ మెమొగ్రఫీ చేయించుకోవాలని సూచించారు. నడక జీవశైలిలో మార్పు తెచ్చుకోవడం, రొమ్ము పరిణామాలు ఎప్పటికప్పుడు గమనించడం కుటుంబంలో క్యాన్సర్ ఉంటే మరింత అప్రమత్తంగా ఉండాలని ఏ మాత్రం ఆశ్రద్ధ చేయకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. రొమ్ము నుండి రక్తం చీము వస్తున్న సందర్భం చర్మంలో మార్పులు కనపడుతున్న వెంటనే వైద్యులను సంప్రదించాలిని తెలిపారు. రొమ్ములో గడ్డలు వచ్చినవెంటనే ఆంకాలజిస్ట్ ను సంప్రదించాలని ఇందుకు కేజీహెచ్‌లో ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈసమావేశంలో అధ్యక్షత వహించినచైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రహమాన్ మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్ పట్ల మహిళలు ప్రమత్తంగా వుండాలని హెచ్చరించారు. విదేశాల కంటే ఇండియాలో ఈ క్యాన్సర్ ఎక్కువ గా వ్యాప్తిస్తోందని చెప్పారు. వయస్సుతో సంబంధం లేకుండా క్యాన్సర్ వస్తున్నందున ప్రతి మహిళ నాన్‌గ్రం చేయించుకోవడం అద్దం ముందు నిల్చోని రొమ్ములను పరిశీలించుకోవాలని కోరారు. అనుమానం ఉన్న మహిళలు కేజీహెచ్‌లో పరీక్షలు చేయించుకోవాలని అందుకు చైతన్య స్రవంతి పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా డా.మైథిలి, డాక్టర్ కుమారిలను ఘనంగా సన్మానించారు. ఈసమావేశంలో చైతన్య స్రవంతి ప్రతినిధులు, రుకియాభాను, విజయ, శారద తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా రొమ్ము క్యాన్సర్‌పై చతన్య స్రవంతి ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. మహిళలు పింక్ చీరలు ధరించి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

### త్వరలో స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో జరగనున్న
## అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ విశాఖకు ఎంతో కీలకం
### విశాఖ ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్

అల్లిపురం, అక్టోబర్ 29 ప్రభాతవార్త



స్వర్ణభారతి స్టేడియంలో యోనెక్స్ సన్రైజ్ ఆల్ ఇండియా సీనియర్ రంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ సంబంధించిన ప్రతిక సమావేశంలో విశాఖ షట్టిల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎమ్మెల్సీ వంశీ కృష్ణ యాదవ్ పాల్గొని టోర్నమెంట్ వివరాలను వివరించారు. దేశం నలుమూలల నుంచి జాతీయ స్థాయి, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. అనేకమంది అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు, జాతీయ క్రీడాకారులతో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ విశాఖకు ఎంతో ప్రాముఖ్యత పెంచుతుందని అన్నారు. తద్వారా విశాఖ నుంచి మరింత మంది క్రీడాకారులు తయారు చేయడం తమ లక్ష్యమని తెలిపారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ అధ్యక్షులు ఎసిపి చుక్క శ్రీనివాస్, సెక్రటరీ పల్లా శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉషా శ్రీ తదితరులు పాల్గొన్నారు.



## నేడే ప్రతిభకు ప్రోత్సాహం
### 39 మందికి మీడియా అవార్డుల ప్రదానం -150 మంది పిల్లలకు ఉపకార వేతనాలు
### -అలరించనున్న భారీ సాంస్కృతిక కార్యక్రమాలు -ఏర్పాట్లు పూర్తి చేసిన వైజాగ్ జర్నలిస్టుల ఫోరం

అల్లిపురం అక్టోబర్ 29, ప్రభాతవార్త



వైజాగ్ జర్నలిస్టుల ఫోరం ప్రతీఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా ఆదివారం 30వ తేదీన ప్రతిభకు ప్రోత్సాహం కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వమించనున్నట్లు ఫోరం అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు తెలిపారు. శనివారం డాబా గార్డెన్స్ వీజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో కార్యదర్శి దాడి రవికుమార్ అవార్డు కమిటీ చైర్మన్ ఆర్ నాగరాజు పట్నాయక్‌లతో కలిసి అవార్డులు, ఉపకార వేతనాలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఇందుకు సంబందించిన ఏర్పాట్లును ఇప్పటికే కార్యవర్గం పూర్తి చేయడం జరిగిందన్నారు. ఉదయం నుంచి వేదికగా ఆంధ్రా యూనివర్సిటీ వైవీఎస్ మూర్తి ఆడిటోరియం వేదికగ ప్రతిభకు ప్రోత్సాహం కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. 150 మందికి ఉపకార వేతనాలు పంపిణీ చేయ నున్నట్లు వెల్లడించారు. పిల్లలను ప్రోత్సహించాలని దరఖాస్తు చేసిన అందరిని పరిగణలోకి తీసుకున్నామన్నారు. అనంతరం అతిధుల చేతుల మీదుగా మీడియా అవార్డులను ప్రధానం చేస్తారన్నారు. ఎంపిక కార్యక్రమంలో వివిధ అసోసియేషన్ల పలువురు పెద్దల సహకారం తీసుకున్నామన్నారు. మధ్యాహ్నం విందుభోజనం వరకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి విచ్చేసి జర్నలిస్టులకు శుభాశీస్సులు అందజేయగా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో పాటు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నట్లు చెప్పారు. కార్యదర్శి దాడి రవికుమార్, మీడియా అవార్డు కమిటీ చైర్మన్ ఆర్ నాగరాజు పట్నాయక్ లు మాట్లాడుతూ 39 మంది అవార్డు గ్రహీతలకు నగదు, మెమోంటో, ప్రశంసాపత్రాలు, నూతన వస్త్రాలు మిఠాయిలుతో పాటు ఘనసత్కారం అందజేయడం జరుగుతుందన్నారు. పిల్లలకు ఉపకార వేతనాలను అతిధుల చేతులు మీదుగా అందజేస్తామన్నారు. కావున ఈ కార్యక్రమానికి జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యులు హాజరై జయప్రదం చేయాలని వీరు కోరారు. ఈ సమావేశంలో కోశాధికారి పీఎన్ మూర్తి కార్యవర్గ సభ్యులు ఇరోతి ఈశ్వరరావు, పివరలక్ష్మీ, ఎంఎస్ఆర్ ప్రసాద్, పి ధివాకర్, దొండా గిరిబాబు, డేవిడ్ గయాజ్, శేఖరమంత్రి, సనపల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ సోమవారం దేవదాయ ధర్మదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో స్పందన

అల్లిపురం, అక్టోబర్ 29, ప్రభాతవార్త

కమీషనర్, దేవాదాయ ధర్మదాయ శాఖ గొల్లపూడి విజయవాడ వారి ఆదేశముల ప్రకారం విశాఖపట్టణం జిల్లా దేవాదాయ ధర్మదాయ శాఖకు సంబంధించి అర్చకులు, ఇతర ధార్మిక సిబ్బంది మరియు ఇతరులు సమస్యల పరిష్కారానికై ప్రతి సోమవారం దేవాదాయ ధర్మదాయ శాఖ స్పందన 3గంటల నుంచి 5గంటల వరకు విశాఖపట్నం జిల్లా దేవాదాయ ధర్మదాయ శాఖ సహాయ కమీషనర్ వారి కార్యాలయం (టర్నర్ సత్రం) నందు నిర్వహించుటకు నిర్ణయించడమైనది. కావున ఈ స్పందన కార్యక్రమము నందు అర్చక స్వాములు ఇతర ధార్మిక సిబ్బంది, ఇతరులు దేవాదాయ ధర్మదాయ శాఖకు సంబంధించిన ఎటువంటి సమస్యలు గాని /గ్రీవెన్సుల గాని పరిష్కారముకై హాజరుకావచ్చునని సహాయ కమిషనర్ దేవాదాయ ధర్మధాయ శాఖ కె శిరీష ఒక ప్రకటనలో తెలిపారు.

## నేడు ఇండస్ట్రీయల్ పార్క్‌ను శంకుస్థాపన చేయనున్న మంత్రి అమర్నాథ్

అనకాపల్లి, అక్టోబర్ 29, ప్రభాతవార్త

పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ఆధ్వర్యంలో అనకాపల్లి రూరల్ మండలం కోడూరు గ్రామపంచాయితీ పరిధిలో రాష్ట్ర పరిశ్రమల ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాధ్‌చే ఆదివారం ఉదయం 10.30 నిమిషాలకు ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాట్లుకు భూమి పూజ జరుపబడును, తదనంతరం రేబాక గ్రామ పంచాయితీలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ వారి స్కిల్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభించబడుతుంది.

## ఏయూతో ఎన్‌సిసిఆర్ ఎంఓయూ
### జువాలజీ విభాగంలో రీసెర్చ్ లేబరేటరీ ఏర్పాటు

ఏయూ, అక్టోబర్ 29, ప్రభాతవార్త




ఆంధ్రవిశ్వవిద్యాలయంలో నేషనల్ సెంటర్ ఫర్ కోర్టల్ రీసెర్చ్ (ఎన్‌సిసిఆర్) అవగాహన ఒప్పందం చేసుకుంది. దీనిలో భాగంగా ఏయూ జువాలజీ విభాగంలో రీసెర్చ్ లాబరేటరీని ఏర్పాటు చేస్తారు. ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలపై ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి కృష్ణమోహన్ ఎన్‌సిసిఆర్ ప్రతినిధులు డాక్టర్ ప్రవకర్ మిశ్రా, డాక్టర్ శివాజీ పాత్రలు సంతకాలు చేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె. సమత, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె శ్రీనివాసరావు, రీసెర్చ్ డెవలప్‌మెంట్ డీన్ ఆచార్య కె బసవయ్య, జువాలజీ విబాగాధిపతి ఆచార్య పి జానకీరామ్, అకడమిక్ డీన్ ఆచార్య ఎన్ కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు అవగాహన ఒప్పందంలో భాగంగా విద్యార్థులకు, పరిశోధకులకు ఉపయుక్తంగా జువాలజీ విభాగంలో ప్రత్యే పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు.

## యువత సామర్ధ్యాలను పెంపొందించే ప్రయత్నం చేస్తున్నాం
### రిస్క్ చేసే తత్వం యువత కలిగి ఉండాలి -ఎస్‌టిపిఐ డైరెక్టర్ జనరల్ ఆరవింద్‌కుమార్

ఏయూ, అక్టోబర్ 29, ప్రభాతవార్త




ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని సాఫ్ట్ వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిపిఐ) డైరెక్టర్ జనరల్ అరవింద్ కుమార్ శనివారం సందర్శించారు. ఉదయం ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డితో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఏయూతో సంయుక్తంగా ఎస్‌టిపిఐ నిర్వహించే పలు అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం ఎస్‌టిపిఐ ప్రాజెక్ట్ ఆఫీస్‌ను త్వరలో ఏర్పాటు చేయనున్నారు. అదే విధంగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో సుమారు ఎకరం స్థలంలో ఎస్‌టిపిఐ ఇంక్యుబేషన్ సెంటర్ ను నిర్మించనుంది. విద్యార్ధులకు నైపుణ్యాలను వృద్ధి చేసే విధంగా ఈ కేంద్రం నిలుస్తుంది. ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. అనంతరం ఎస్‌టిపిఐ అరవింద్‌కుమార్ మాట్లాడుతూ యువత సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకునే శక్తిని కలిగి ఉండాలన్నారు. యువతలో సామర్ధ్యాలను పెంపొందించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ఇంక్యుబేషన్, స్టార్టప్‌లను ప్రోత్సహించడం జరుగుతోందన్నారు. ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాద రెడ్డి మాట్లాడుతూ వర్సిటీని పరిశ్రమలతో అనుసంధానం చేసే దిశగా పనిచేస్తున్నామన్నారు. వర్సిటీలో విభిన్న ప్రాంగణాలలో టెక్, ఫుడ్ ఫార్మ, మెరైన్ ఇంక్యుబేషన్ సెంటర్‌లను ఏర్పాటు చేస్తున్న విధానం వివరించారు. ఎస్‌టిపిఐతో భాగస్వామ్యం ఏయూ ప్రతిష్టను మరింత ఇనుమడింపచేస్తుందన్నారు. శతాబ్ది ఉత్సవాలకు సిద్ధమవుతున్న ఏయూ నేడు సాధిస్తున్న ప్రగతిని వివరించారు. రిజిస్ట్రార్ ఆచార్య వి కృష్ణమోహన్ మాట్లాడుతూ రెండు సంస్థలకు ఉపయుక్తంగా విద్యార్థులకు నైపుణ్యాలను పెంపొందించే దిశగా పనిచేస్తామ న్నారు. కార్యక్రమంలో ఎస్‌టిపిఐ డైరెక్టర్ సివిడి రామ్ ప్రసాద్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ బి సురేష్, ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సిఈఓ రవి ఈశ్వరపు ఐపిఆర్ చెయిర్ ప్రొఫెసర్ హనుమంతు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనాగదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్న పీలా గోవింద సత్యనారాయణ

అనకాపల్లి, అక్టోబర్ 29, ప్రభాతవార్త



నాగుల చవితి పర్వదినం మరియు అమ్మవారి జాతర మహోత్సవం సందర్భంగా అనకాపల్లి పట్టణం ఎన్‌టిఆర్ బెల్లం మార్కెట్ యార్డులో కొలువైన శ్రీ నాగదుర్గమ్మ అమ్మవారిని మాజీ శాషన సభ్యులు నియోజకవర్గం ఇంచార్జి పీలా గోవింద సత్యనారాయణ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గవరపాలెంలోని దిబ్బవీధి శ్రీ నాగేంద్ర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నాగేంద్ర స్వామి వారికి పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆలయ కమిటి సభ్యులు ఆయనను సత్కరించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర బీసీ సాధికార కన్వీనర్ మళ్ళ సురేంద్ర , పెతకంశెట్టి వెంకటరావు , వేగి కృష్ణా బాల, కర్రి మహాలక్ష్మీనాయుడు, నీలగిరి శ్రీను, కొణతాల బాల, ఉత్సవ కమిటీ చైర్మన్ బుద్ధ నాగేశ్వరరావు, సభ్యులు పొలమరశెట్టి బుజ్జి, దాడి పరదేశనాయుడు, పెంటకోట శ్రీనివాసరావు, పోతురాజు, మళ్ళ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ముడసర్లోవ పార్కులో నాగుల చవితి సందడి
### భక్తిశ్రద్ధలతో భక్తులు విశేష పూజలు

ఆరిలోవ, అక్టోబర్ 29, ప్రభాతవార్త



నాగుల చవితి పర్వదినం సందర్భంగా స్థానిక 13వ వార్డు ముడసర్లోవ పార్కులో సందడి వాతావరణం కనిపించింది. పార్కు లోపలికి ఉచిన ప్రవేశం కల్పించడంతో వివిధ ప్రాంతాల నుండి భక్తులు, సందర్శకులు నాగుల చవితి వేడుకలు పార్కులో ఘనంగా జరుపుకున్నారు. భక్తులు పుట్టల వద్దకు చేరుకొని నాగేంద్రునకు పాలు, గుడ్లు ప్రసాదాలు వంటివి సమర్పించుకొని భక్తిశ్రద్ధలతో విశేష పూజలు చేశారు. భక్తులకు, సందర్శికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ తెలిపారు.

## నాగుల చవితి వేడుకల్లో మేయర్ కుటుంబం

ఆరిలోవ, అక్టోబర్ 29, ప్రభాతవార్త



నాగుల చవితి పర్వదినం సందర్భంగా శనివారం ముడసర్లోవ నర్సరీ గార్డెన్స్‌లో మేయర్ దంపతులు కుటుంబ సమేతంగా పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. నాగుల చవితిని తెలుగు వారు ఎంతో భక్తి శ్రద్ధలతో పూజలు చేసుకుంటారని అలాగే సర్ప దోషము నుంచి విముక్తి కలిగించాలని ఆ నాగేంద్రునికి మొక్కులు తీర్చుతారని మేయర్ తెలిపారు.

## సినీ సంగీత విభావరి

అల్లిపురం, అక్టోబర్ 29, ప్రభాతవార్త



స్వరమాలిక వ్యవస్థాపకులు జి.ఆంజనేయరెడ్డి సమర్పణలో శనివారం సాయంత్రం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను మైమరిపించింది. ద్వారకానగర్ పౌరగ్రంధాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ఆర్టిస్ట్ డైరెక్టర్ సన్‌మూర్తి జ్యోతి వెలగించి కార్యక్రమం ప్రారంభించారు. గాయకులు ఆంజనేయరెడ్డి, నాగు, జోసెఫ్, వివి చారి, రాము, బాబ్జి, హేమంత్‌కుమార్, కనకరాజు, గాయని కే భాగ్యలక్ష్మీ, నీలిమ, శైలజ, నిషిత, లావణ్య, సివి రాజేశ్వరి తదితరులు హుషారు గీతాలతో ఆలపించారు.

# కోడిపందాల శిబిరంపై దాడి
## ఐదుగురు అరెస్ట్

నక్కపల్లి, అక్టోబర్ 29 ప్రభాతవార్త

మండలంలోని ఉపమాక శివారు అయ్యన్నపాలెం గ్రామం సమీపంలో కోడిపందాలు ఆడుతున్న శిబిరంపై నక్కపల్లి పోలీసులు శనివారం సాయంత్రం దాడిచేశారు. ఈ దాడుల్లో ఐదుగురుని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నాలుగు కోళ్లు 500 నగదు స్వాధీన పర్చుకున్నామని ఎస్ఐ శిరీష తెలిపారు. పట్టుబడి ఐదుగురుని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

## సేవ్ ఉత్తరాంధ్ర పేరుతో
## విశాఖ ప్రతిష్టను దెబ్బతీసే కుట్రలు ఫలించవు

5వ పేజీ తరువాయి

అబద్దాలు, అర్ధసత్యాల ప్రచారోద్యమం జనాదరణ లేక నీరుగారిపోతోందని చెప్పారు. తెలుగుదేశం పార్టీ భజనలో తరించే మీడియా మద్దతుతో పరువుపోయిన టీడీపీ నేతల వికృత నాట్యాల మధ్య చంద్రబాదు గారి ఫీంకారాలు ఆగడం లేదన్నారు. తమ పార్టీ నేతలు, కార్యకర్తలు చేష్టలు, ప్రకటనల వల్ల గత మూడేళ్ళుగా పెరగుతున్న విశాఖపట్నం ప్రతిష్టకు హానీ జరుగుతుందనే ఆలోచన విజనరీ మాజీ సీఎంలో కనిపించడం లేదన్నారు. ఉత్తరాంధ్రను కాపాడతామనే పేరుతో విశాకనగరానికి కీడుఏస్తున్నామనే వాస్తవం 72 ఏళ్ళ నేత కళ్ళకు కానరావడం లేదు. తన హయాంలో రాజధాని పేరుతో కృష్ణా, గుంటూరు జిల్లాలకు చేసిన నష్టం ఆయన మరిచిపోయారన్నారు. ఐటీ ఫార్మ వంటి రంగాలు వేగంగా విశాఖ నగరానికి విస్తరించే అవకాశాలున్న హైదరాబాద్‌ను అభివృద్ధి జరుగుతున్న నగరం అనే అర్ధంలో హేపెనింగ్‌సిటీ అనేవారని గుర్తుచేశారు. అదేవిధంగా నేడు విశాఖ కూడా ప్రగతిశీల నగరంగా పరుగులు పెడుతూ మరో హేపెనింగ్ సిటీ అవుతోందని తెలిపారు. ఈ తరుణంలో నగర అభివృద్ధికి గండికొట్టడానికి ఉత్తరాంధ్ర తెలుగుదేశం నేతలను వారి నాయకుడు నిస్సుగ్గగా ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. ఓటమి పాలైన టీడీపీ ఏం చేయకూడదో అదే చేస్తున్నదనే వాస్తవాన్ని ఉత్తరాంధ్ర ప్రజలే కాదు అందరూ గమనిస్తున్నారని అన్నారు.

# మైనర్ బాలికపై అత్యాచార యత్నం
### ఐస్ క్రీమ్ కొనేందుకు వెళ్ళిన బాలికపై అఘాయత్యం
### పోలీసు అదుపులో నిందితుడు

ఆరిలోవ, అక్టోబర్ 29, ప్రభాతవార్త

ఐదోవ తరగతి చదువుతున్న మైనర్ బాలికపై ఇద్దరు వ్యక్తులు అత్యాచార యత్నానికి పాల్పడిన ఘటన శనివారం మద్యాహ్నం డైయిరీఫారం ఆదర్శనగర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే కోనేటి శ్రీనివాస్ లలిత దంపతలు గత పదేళ్ళగా ఆదర్శనగర్‌లో అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. శ్రీనివాస్ పెంటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు.

**వీరికి ఇద్దరు కూతుర్లు ..**

ప్రభుత్వ పాఠశాలలో ఐదోవ తరగతి చదువుతున్న బాలిక శనివారం మద్యాహ్నం ఐస్ క్రీమ్ కొనేందుకు ఇంటి వద్ద నుంచి షాపునకు వెళ్తుండగా ఓ వ్యక్తి బైక్‌పై వచ్చి బాలికను ఎంఆర్‌ఓ ఆఫీసుకు దారి అడిగి, మాయమాటలు చెప్పి బైక్‌పై బాలికను తీసుకొని వెళ్ళి విశాఖ వేలీ స్కూల్‌కు వెళ్ళే దారి పొదల్లో వదిలేసి పారారయ్యారు. ముఖంపై దెబ్బలు, ఒంటిపై గాయాలతో ఆ బాలిక రోడ్డు పైకి రావడంతో అటు పైగా వెళ్తున్న ఓ మహిళ బాలికను చూసి విషయం తెలుసుకుని ఇంటి తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పిగించారు. బాలిక తల్లిదండ్రులు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేయుగా సమాచారం అందుకున్న పోలీసులు బాలికను వైద్య పరీక్షలు నిమిత్తం కెజిహెచ్ ఆసుపత్రికి తరలించారు.

**సీసీ పుటేజ్ ద్వారా నిందితుల్ని గుర్తింపు...**

బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తిని పట్టుకునేందుకు స్వయంగా నగర పోలీసు కమిషనర్ శ్రీకాంత్ స్వయంగా కేసు ఫాలో ఆప్ చేశారు. దిశా ఏసీపీ ప్రేమ్‌కాజల్ తక్షణమే కేసు నమోదు చేసి విచారణ జరిపి సదరు నిందుతుడ్ని సాయికుమార్‌గా గుర్తించి అదుపులో తీసుకున్నారు. ఇంతటి అఘాయత్యానికి పాల్పడిన వారిపై పోలీసులు తగిన చర్యలు కఠినంగా శిక్షించాలని మహిళ సంఘాలు, స్థానిక సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు కోరుకుంటున్నారు.



నాగులచవితి సందర్భంగా మండలంలోని చినదొడ్డిగల్లు కొత్తూరు గ్రామంలో వంగలపూడి కుటుంబీకులు కలిసి భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకున్న దృశ్యం (నక్కపల్లి- ప్రభాతవార్త)

## వ్యవస్థలో మార్పులతో ప్రజల్లో ఆనందాలు
### అరకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ
### గడప గడపకు మన ప్రభుత్వంలో బ్రమ్మారథం పట్టిన గిరిజనులు

ముంచంగిపుట్టు, అక్టోబర్ 29 ప్రభాతవార్త



ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వ్యవస్థలో మార్పులు తీసుకువచ్చి సంక్షేమ పాలనను అందించడంతో ప్రజల్లో ఆనందాలు వ్యక్తం అవుతున్నాయని అరకు నియోజకవర్గ ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ అన్నారు. మండలంలో గల వనభసింగి పంచాయితీ కేంద్రంలో పాటు చిప్పాపుట్టు, లుంగాపుట్టు, తడ్డపల్లి, టొంగికోట గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో శనివారం ఎమ్మెల్యే ఫాల్గుణ 246 గడపలకు వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఫాల్గుణ, అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి అమ్మా మీ పిల్లలు చదువుకుంటున్నారా... అమ్మఒడి వస్తుందా... రైతు భరోసా వస్తుందా.. అవ్వా మీకు ఒకటో తేదీన పింఛన్ వస్తుందా అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నదీ లేనిదీ గిరిజనులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు పంపిణీ చేసి ప్రభుత్వం నుంచి పొందిన పథకాలను వివరించారు. గ్రామాల్లో గిరిజనులంతా ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి బ్రమ్మారథం పట్టారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయని, గతంలో పంచాయితీ కేంద్రాలకు వెళ్లి పథకాలు పొందేవారమని ఇప్పుడు నేరుగా ఇంటికే పథకాలు అందుతున్నాయని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. పలు సమస్యలను గ్రామాల్లో గిరిజనులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఫాల్గుణ మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే వ్యవస్థలను సృష్టించి, వ్యవస్థను అధికారులను ప్రజల వద్దకే తీసుకువెళ్లి పాలన చేయడం జగనన్నకే సాధ్యమైందని, సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు జవాబుదారీతనంగా నిష్పక్షపాతంగా పథకాలు అర్హులందరికీ అందుతున్నాయని, గడప గడపలో ప్రభుత్వ పాలనపై ప్రజలు సంతోషాలు వ్యక్తం చేస్తున్నారని, ఎమ్మెల్యే ఫాల్గుణ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ, వైస్ఎంపీపీ ఎస్.భాగ్యవతి, ఎంపీడీవో కిరణ్‌కుమార్, ఏపివో సూరిబాబు, వైసీపీ మండల అధ్యక్షులు మల్లికార్జున్, సర్పంచ్‌లు రమేష్‌లు, నరసింగరావు, లక్ష్మణ్, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, వైసీపీ మండల నేతలు జగబంధు, కొండలరావు, పులిరాజు, జయదేవ్, సన్యాసిరావు, జగన్నాధం, దాసు, అప్పారావు, తిరుపతి, ఉదయ్, ప్రసాద్, సాధురాంలతో పాటు సచివాలయం సిబ్బంది, వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.





మాధవధార సెక్రటేరియట్‌లోని స్థానిక కార్పొరేటర్ ఆధ్వర్యంలో పోర్టిఫైడ్ రైస్ జీసీసీ ఉత్పత్తులు, బియ్యం మళ్లింపుపై వాలంటీర్లతో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. (మాధవధార, ప్రభాతవార్త)

## అరకులోయలో భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుక

**అరకులోయ అక్టోబర్ 29 ప్రభాతవార్త**



అరకులోయ మం డలంలో శనివారం భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పండగ జరిగింది. దీపావళి అమా వాస్య తర్వాత జరు పుకునే నాగుల చవితి పండ గను భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనం గా జరుపుకున్నారు. నాగుల చవితి సందర్భంగా అరకులోయతో పాటు పలు గ్రామాల్లో పుట్టల వద్ద భక్తులు బారులు తీరారు. భక్తులు వేకువ జామునే నిద్రలేచి తలంటు స్నానాలు చేసి, పుట్టలు వద్దకు చేరుకొని నాగేంద్రుడికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు పుట్టలో పాలు వేసి నాగారాధన చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు.

## ప్రారంభమైన గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు

**మాడుగుల అక్టోబర్ 29 ప్రభాతవార్త**



శ్రీ గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు శనివారం మాడుగుల్లో ఘనంగా ప్రారంభమయ్యాయి. 15 రోజులు పాటు ఈ ఉత్సవాలను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా గౌరీ పరమేశ్వరులను ప్రజలు దర్శనార్థం గ్రామంలో ఊరేగించి స్థానిక గౌర వీధిలో గల రామాలయంలో కొలు ఉంచుతారు. ప్రతిరోజు ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించిన అనంతరం అణుపు ఉత్సవాన్ని నిర్వహిస్తారు. గౌరీ పరమేశ్వరుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఉత్సవాలను జయప్రదం చేసి అమ్మవారిని స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కమిటీ విజ్ఞప్తి చేసింది.



## ఘనంగా చవితి వేడుకలు

**మాడుగుల అక్టోబర్ 29 ప్రభాతవార్త**

హిందువులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకునే నాగుల చవితి వేడుకలు శనివారం వాడవాడలా ఘనంగా నిర్వహించుకున్నారు. అయితే ఏడాది దీపావళితో పాటు నాగుల చవితి కూడా తగులు మిగులు రావడంతో అతికొద్ది మంది మాత్రం శుక్రవారం మధ్యాహ్నం చవితి వేడుకలు నిర్వహించుకున్నారు. అత్యధికులు మాత్రం శనివారం ఉదయం 8 గంటల నుంచి పదిన్నర గంటలకు పుట్టలో పాలు వేస్తూ నాగేంద్రులకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టల వద్ద చిన్నారులు ముందుకు సామాగ్రి కాల్చితూ కేరింతలు కొట్టారు. కొన్నిచోట్ల గోమాతలను కూడా పూజించి ప్రసాదాలను అందజేశారు. మాడుగులతో పాటు మండలంలో గల అన్ని గ్రామాల్లో ఈ నాగుల చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈ ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో అనేక చోట్ల పుట్టలో కరిగిపోవడంతో వేసిన పుట్టలోనే మరల పాలు వేస్తూ నాగేంద్రునికి నైవేద్యాలు సమర్పిస్తూ పూజలు నిర్వహించారు.

## గాయపడ్డ కార్యకర్తకు ఆర్థికసాయం

**మాడుగుల అక్టోబర్ 29 ప్రభాతవార్త**



మాడుగుల నియోజకవర్గ పరిధిలో గల చీడికాడ మండలం తురువోలు గ్రామంలో ఇటీవల చెట్టుపై నుండి ప్రమాదవశాత్తూ పడిపోయి చికిత్స పొందుతున్న టిడిపి కార్యకర్త కిల్లి రమణను మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు పైలా ప్రసాదరావు శనివారం పరామర్శించి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రూ.5 వేలను రమణకు ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు రెడ్డి సన్యాసి నాయుడు, రెడ్డి రాము, ముర్రు గంగునాయుడు, కె.గుర్రన్న, బొడ్డు కృష్ణ, గుంపెన అర్జునరావు, గొర్లె గణేష్, పాతాళం ఎర్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ రాజకీయాలకు చిరునామా మొకర నారాయణరావు

### జయంతి వేడుకల్లో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు

**భీమునిపట్నం, అక్టోబర్ 29, ప్రభాతవార్త**



హుందా రాజకీయాలు చేస్తూ, ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న రాజకీయ చాణక్యుడు తెలుగుదేశం పార్టీ నేత స్వర్గీయ మొకర నారాయణరావు అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కురుపాం నియోజకవర్గం పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. స్వర్గీయ మొకర నారాయణరావు 88వ జయంతిని పురస్కరించుకొని భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న ఆయన నిలువెత్తు విగ్రహానికి భీమిలి జోన్ 3వ వార్డు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు గంటా నూకరాజు మాట్లాడుతూ నేటి తరానికి నాడు భీమిలిలో మొకర నారాయణరావు వేసిన రాజకీయ బీజం హుందా రాజకీయాలకు చిరునామాగా మారిందని అన్నారు. ఆయన, ప్రతి పక్షంలో ఉన్నా అనునిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేసి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన గొప్ప రాజకీయ దురంధరుడు మొకర నారాయణరావు అని అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, వుడా డైరెక్టర్‌గా, భీమిలి మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఇలా తెలుగుదేశం పార్టీ నుండి ఎన్నో పదవులు పొందిన ఎక్కడా చిన్న మచ్చుకూడా లేకుండా నీతి నిజాయితీగా ఈ భీమిలి ప్రజలకు అందించారని గంటా నూకరాజు అన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ఒకే పార్టీలో ఉంటూ రాజకీయాలకే వన్నె తెచ్చారని అన్నారు. ఎంతోమంది యువతకు భీమిలి పరిసర ప్రాంతంలో రాజకీయ ఓనమాలు నేర్పిన ద్రోణాచార్యుడు స్వర్గీయ మొకర నారాయణరావు అని గంటా నూకరాజు కొనియాడారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు దేవుడు మనోధైర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, మాజీ కౌన్సిలర్, సీనియర్ నాయకులు చుక్కల రమణ, 3వ వార్డు ప్రధాన కార్యదర్శి గొలగాని నరేంద్ర కుమార్, తెలుగుదేశం పార్టీ నాయకులు కారుపు నాగరాజు, కనకల అప్పలనాయుడు, సంకురుబుక్క జోగారావు, అప్పికొండ నూకరాజు, వాడమొదలు సత్యారావు, గండిబోయిన పోలిరాజు, వెక్కిళ్ల వెంకటరావు, వియ్యపు పోతురాజు, కె.ఎస్.ఆర్. కృష్ణారావు మాస్టర్, అప్పికొండ నర్సింగరావు, జరజాపు పాపారావు, కుప్పిల గురుమూర్తి, వాసుపల్లి వంశీ, శంకర్, సురేందర్, దేవుళ్ళు, తాతారావు, అప్పికొండ కుమార్, వంశీ, నాగవంశం యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉత్తరాంధ్ర నాగవంశం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక కాలేజీ రోడ్డులో గల మొకర నారాయణరావు విగ్రహానికి ఆరు వీధుల నాగ వంశీయుల కుల పెద్దలు మొకర 88వ జయంతి సందర్భంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రెండవ వార్డ్ కార్పొరేటర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్పర్సన్ గంటా చిన్ని కుమారి లక్ష్మి, ఉత్తరాంధ్ర నాగవంశ సంక్షేమ సంఘం అధ్యక్షులు కంటుబుక్క రామానాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా గాడు చిన్నికుమారి లక్ష్మి మాట్లాడుతూ స్వర్గీయ నారాయణరావు కులం కోసం ఎంతో పాటు పడ్డారన్నారు. టిడిపిలో ఉన్నత స్థానాలు అధిరోహించి పార్టీకి ఎన్నో సేవలు అందించారని అన్నారు. అలాగే ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన సభ్యులుగా టిడిపి ప్రకటించినట్లు ... కాపు నాగరాజు కుటుంబ సభ్యులు నా గెలుపు తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంటుబుక్క ముత్యాలరావు, కనకల సన్యాసినాయుడు, వెంకట్రావు, కంటుబుక్క జోగారావు, అప్పుగుంట ఆది నారాయణ, కనకేశ్వరరావు, కనకల అప్పలనాయుడు, బోని సంజీవరావు, అప్పికొండ నూకరాజు, అప్పికొండ అదిబాబు, లక్ష్మణ, అప్పికొండ బాలకృష్ణ కనకల సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

## తవ్వేస్తున్న గెడ్డలు... పట్టించుకోని అధికారులు

**భీమునిపట్నం, అక్టోబర్ 29, ప్రభాతవార్త**



భీమిలిలో రియల్ వ్యాపారస్తులు పలు గెడ్డలు, వాగులు కప్పి వేస్తున్నారు. స్థానిక బ్యాంకు రోడ్డులో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి భూమిని కొనుగోలు చేసి గెడ్డ, వాగును తవ్వేస్తున్నారు. రెవెన్యూ అధికారులు కానీ, మున్సిపల్ అధికారులు కానీ చూసి చూడ నట్టు ఊరుకుంటున్నారు. పోలీసులను దగ్గర పెట్టుకొని గెడ్డను కప్పి వేస్తున్నారు. ఈ మధ్య వర్షాలకు మినీ స్టేడియం వద్ద గెడ్డ కప్పి వేయడం వల్ల చెరువుగా మారింది. భీమిలికి ప్రధానమైన కొండగెడ్డ మూసివేయడంతో వర్షాలు వస్తే భీమిలి నిండుతుందని అని స్థానికులు భయపడుతున్నారు. అధికారులు దీనిపై దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## జగనన్నతోనే సుపరిపాలన సాధ్యం : ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి



**పాడేరు, అక్టోబర్29, ప్రభాతవార్త**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సుపరిపాలన సాధ్యమైందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. పాడేరు మండలం లగిశపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని వంజంగి, ఎస్.కొత్తూరు గ్రామాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై గడప గడపకూ తిరుగుతూ ప్రభుత్వం చేస్తోన్న మేలును వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 117 గడపలను ఎమ్మెల్యే సందర్శించారు. సంక్షేమ పథకాల ద్వారా ఎంతెంత లబ్ది పొందారు? వాటితో ఎలాంటి ఉపాధిని పొందగలిగారన్న విషయాలను నేరుగా లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. కొందరు సంక్షేమ పథకాల ద్వారా వచ్చిన సొమ్ములతో భూమిని, మరికొందరు మేకలు, గొర్రెలను కొనుక్కొని వాటి ద్వారా ఉపాధి పొందుతున్న విషయాలను తెలిపారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ఉపాధి పొందడం అనేది వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే చూస్తున్నామని పేర్కొన్నారు. తన, తమ అనే బేధం లేకుండా అర్హులైన వారందరికీ ఈ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని చెప్పారు. ప్రతి ఇంట్లోనూ, ఈ నేలమీదకు రాని పసిబిడ్డ దగ్గర నుంచి పండు ముసలి వారి వరకూ వివిధ సంక్షేమ పథకాలను పొందుతున్నారని భాగ్యలక్ష్మి స్పష్టం చేశారు. ఒక్కో ఇంటికి అయితే రూ.4 నుంచి రూ.5 లక్షల వరకూ ఈ మూడేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారున్నారంటే ప్రభుత్వం నిష్పక్షపాతంగా, అవినీతి రహితంగా పారదర్శకమైన పాలన అందిస్తుందో చెప్పడానికి ఇంతకుమించిన సాక్ష్యం ఏం కావాలని ఆమె పేర్కొన్నారు. ఇప్పుడు కూడా ఇంకా అర్హత ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారి ఎందుకు ఇప్పటి వరకూ పొందలేకపోయారు? అన్న దానిపై ఆరా తీసిన వెంటనే వారికి వాటిని పొందేలా సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాము వెళ్లిన ప్రతి చోటా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై అపూర్వమైన గౌరవం పెరిగిందని, ఆయన్నే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలనే తపన అందరిలోనూ కనిపిస్తుందని భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వంతాల బొంజుబాబు, స్థానిక ఎంపీటీసీ లకే రామ కృష్ణ పాత్రుడు, సర్పంచులు ఎస్.రాంబాబు, వి.రాంబాబు, వి.బసవన్న దొర, ఎల్.పార్వతమ్మ, ఎంపీటీసీ చిట్టెమ్మ, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ సరస్వతి, వైయస్సార్సీపీ సీనియర్ నాయకులు ఎస్. మంగ్లన్న దొర, ఎం.కన్నా పాత్రుడు, వి.దశమూర్తి, కె.సూరిబాబు, కె.బొంజుబాబు, పి.సత్యనారాయణ, బి.రాజారావు, కె.సుశీల, ఎల్.సత్యవతి, జి.రాజారావు, బొడరాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఎస్సి మోర్చా బస్తీ సంపర్క కరపత్రాలు విడుదల

### గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కురుసా ఉమామహేశ్వరరావు

**పాడేరు, అక్టోబర్ 29, ప్రభాతవార్త**



జాతీయ బీజేపీ ఆదేశాలు మేరకు రాష్ట్ర బీజెపి అధ్యక్షుడు సోము వీర్రాజు, గుడిసె దేవానంద్ నాయకత్వంలో రాష్ట్రంలో బీజేపీ పార్టీని అన్నివర్గాలకు చేరువ చేయడానికి బీజేపీ ఎస్సి మోర్చా బస్తీ సంపర్క (వీధి సమావేశాలు) కార్యక్రమం అరకు జిల్లా వ్యాప్తంగా వీధి సమావేశాల ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కురుసా ఉమామహేశ్వరరావు అన్నారు. శనివారం పాడేరు కేంద్ర బీజేపీ కార్యాలయంలో బీజేపీ ఎస్సి మోర్చా సంపర్క అభియాన్ కరపత్రాలు బీజేపీ కోనసీమ ఎస్సి మోర్చా జోనల్ ఇన్‌చార్జ్ రవికుమార్ పెనుమాక ఆధ్వర్యంలో జరిగిన అరకు జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో బీజేపీ ఎస్సి మోర్చా కరపత్రాలు విడుదల సందర్భంగా రవికుమార్ పెనుమాక మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో సెప్టెంబర్ 17 నుండి దేశంలో నవంబర్ 26వరకు డా.బి.ఆర్.అంబేద్కర్ భారత రాజ్యాంగం అమలు తేదీ వరకు 5000 వీధి సమావేశాలు రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్ ఆధ్వర్యంలో ఎస్సి మోర్చా సంపర్క అభియాన్ రథయాత్ర అన్ని జిల్లాల్లో సాగుతోందని అన్నీ ఎస్సి వాడల్లో బస్తీ సమావేశం నిర్వహించి ప్రధాని నరేంద్రమోదీ పేద ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వ పథకాలపై ప్రచారం నిర్వహిస్తామని రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సల్లా రామకృష్ణ, గిరిజన మోర్చా జోనల్ ఇన్‌చార్జ్ కురుసా రాజారావు, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు తాంగుల సత్యవతి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు లకే భాస్కర్, రాష్ట్ర యువ మోర్చా కార్యవర్గ సభ్యులు గోపాల్ పాత్రుడు, జిల్లా ఎస్సి మోర్చా ఉపాధ్యక్షుడు చెప్పుల మనోజ్ కుమార్, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాకర చిన్నయ్య, ట్రేడర్స్ సెల్ కన్వీనర్ వానపల్లి అబ్బులు, పాల్గొన్నారు.

## నవంబర్ 1 నుంచి ఏకలవ్య పిజిటి, టిజిటి ఉపాధ్యాయ ఎంపికకు డెమో

### జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**పాడేరు, అక్టోబర్ 29, ప్రభాతవార్త**

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో అతిధి ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ధృవపత్రాల పరిశీలన పూర్తయిందని, నవంబర్ 1,2,3తేదీల్లో డెమో నిర్వహించి పోస్టులను భర్తీ చేయటం జరుగుతుందని అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ధృవపత్రాల పరిశీలన అనంతరం 366 మంది అభ్యర్థులు డెమోకు అర్హత సాధించారని, వీరందరికీ స్థానిక కలెక్టరేట్ వద్ద ఉన్న ఎ.పి రెసిడెన్షియల్ పాఠశాలలో డెమో నిర్వహిస్తామని తెలిపారు. నవంబర్ ఒకటిన పిజిటి అన్ని కేటగిరీలతో పాటు టిజిటి తెలుగు, ఆంగ్లం, రెండవ తేదీన టిజిటి ఆంగ్లం, లెక్కలు, సైన్సు, సోషల్ విభాగాలకు డెమో నిర్వహిస్తామని, ఇంకనూ మిగిలి ఉన్నవారికి మూడవ తేదీన కూడా డెమో నిర్వహిస్తామని కలెక్టర్ వివరించారు. అర్హులైన అభ్యర్థులందరికీ ఫోన్ ద్వారా సమాచారం చేరవేయడం జరుగుతోందన్నారు. అర్హత సాధించినవారు ఆయా తేదీలలో డెమోకు హాజరు కావాలని కలెక్టర్ కోరారు.

## నాడు నేడు పనులు ప్రారంభం

**పాడేరు, అక్టోబర్29, ప్రభాతవార్త**



అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గవర్గం హుకుంపేట మండలం కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కెజిబివి)లో మన బడి నాడు-నేడు పథకంలో భాగంగా పాఠశాల ఆవరణంలో రూ.52.లక్షలతో చేపట్టనున్న పనులను ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమీషన్ సభ్యురాలు జంపరంగి లిల్లీ సురేష్ స్థానిక నాయకులతో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్టీ కమీషన్ సభ్యురాలు జంపరంగి లిల్లీ సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులు కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మనబడి నాడు నేడు పథకం ద్వారా పేద విద్యార్థులకు మేలు కలుగుతుందని, విద్యార్థులుకు బంగారు భవిష్యత్ ఉందని ఎస్టీ కమీషన్ సభ్యురాలు అన్నారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట ఎంపీపీ కూడా రాజబాబు జడ్పీటీసీ మత్యలింగం, స్థానిక సర్పంచ్ పూర్ణిమ, వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ నాయకులు నైనిసత్తిబాబు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## పిల్లలకు క్యారమ్ బోర్డుల పంపిణీ

**భీమునిపట్నం, అక్టోబర్ 29, ప్రభాతవార్త**



ఫ్రెండ్స్ అసోసియేషన్ భీమిలి (ఫాబ్) సభ్యురాల వడ్లమాని రమ కుమారుడు వడ్లమాని కార్తిక్ జన్మదినం సందర్భంగా మన కుటుం బం చారిటబుల్ ట్రస్టు పిల్ల లకు క్యారమ్ బోర్డు, తిను బండారాలు, ఐస్‌క్రీమ్ ఏర్పాటు చేయడం జరిగిం ది. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ అసోసియేషన్ భీమి లి సభ్యులు సన్నీ కాళ్ళ, అశోక్ కట్టమూరి, పార్వతీశం గుగ్గిళ్ళ, డాక్టర్ లావణ్య కాళ్ళ పాల్గొన్నారు. మన కుటుంబం చారిటబుల్ ట్రస్ట్ పిల్లలు వడ్లమాని కార్తిక్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## హెల్మెట్ వినియోగంపై అవగాహన



**మాధవధార, అక్టోబర్ 29 ప్రభాతవార్త**

వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని, వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధారణ చేయాలని అవగాహన కార్యక్రమం రోడ్డు రవాణా శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం మద్దిలపాలెంకు చెందిన ఎం.బుచ్చిరాజు, వేణుగోపాలరావు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ పొగాకు నివారణ కార్యక్రమం

**పి.ఎం.పాలెం, అక్టోబర్ 29 ప్రభాతవార్త**




డా.కె.విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, విశాఖపట్నం ఆధ్వర్యంలో జాతీయ పొగాకు నివారణ కార్యక్రమం జిల్లా స్థాయి అవగాహన సదస్సు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సమావేశ మందిరం నందు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ అవగాహన సదస్సులో హోం డిపార్టుమెంటు ఎం.సునీత రాణి, డిపార్టుమెంటు వి.రామకృష్ణ, డి.సి.ఎ. లేబర్ డిపార్టుమెంటు కె.మనో, స్టేట్ గూడ్స్ అండ్ సర్వీస్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్టుమెంటు కె.సురేష్ ఇన్‌స్పెక్టర్స్ ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. స్టేట్ లీగల్ కన్సల్టెంట్ పి.శివశంకర్ ఆధ్వర్యంలో జరిగింది. ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డా.సమత, బి.నాగేశ్వరరావు, డెమో మణికుమారి, మోహన్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ సంచుల వాడకంపై అవగాహన

**ముంచంగిపుట్టు, అక్టోబర్ 29 ప్రభాతవార్త**



ముంచంగిపుట్టు మండల కేంద్ర సంతలో ప్లాస్టిక్ సంచులు, ప్లాస్టిక్‌ను ఉపయోగించరాదని సర్పంచ్ సీసా సుభాష్ చంద్ర, ఎంపిటీసీ పాటుబోయి సత్యనారాయణ అదేవిధంగా గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌పి అవగాహన కల్పించడం జరిగింది. ప్లాస్టిక్ సంచులు వాడిన, అమ్మిన, రూ.50 నుండి రూ.1000ల వరకు జరిమానా విధించడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

## గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

**ముంచంగిపుట్టు, అక్టోబర్ 29 ప్రభాతవార్త**



ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా శనివారం ఏనుగురాయి సచివాలయ పరిధి వనబసింగి పంచాయితీలో వనబసింగి, లింగాపూటు, తడ్డపల్లి, చిప్పపుట్టు, టోంగికోట, కొత్తూరు గ్రామాలలో 246 గడపలను అరకు శాసనసభ్యులు చెట్టి పాల్గుణ సందర్శించారు. ఈ సందర్భంగా ఉదయం 7గం.ల నుంచి గ్రామాలలో పర్యటిస్తున్న ఎమ్మెల్యేకి పూలమాలలతో కుంకుమ తిలకాలతో ఆత్మీయ పలకరింపుతో ఘన స్వాగతం పలికారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా సచివాల సమస్యల పరిష్కార కొరకు 20 లక్షలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను గ్రామాలలో పర్యటిస్తూ ముందుగా అవ్వ తాతలకు భరోసా ఇస్తూ లబ్దిదారుల గడపకు వెళ్లి లబ్దిదారులను నేరుగా తెలుసుకుని అందుకున్న సంక్షేమ పథకాలను వివరించారు. నీటి సమస్య గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేసి ఐదు రోజుల్లో సమస్యను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. శాసనసభ్యులు చెట్టి పాల్గుణ స్థానిక నాయకులతో మాట్లాడుతూ రానున్న 2024 ఎనికల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని స్థానిక నాయకులకు సందర్భంగా తెలియజేశారు. ఎమ్మెల్యేకి గ్రామాలలో ఉన్న సిసి రోడ్లు, మంచినీటి డ్రైనేజీ వంటి సమస్యలను దరఖాస్తు రూపంలో స్థానికులు అందించారు. ఈ సమస్యలను విన్న ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు, అరిసెలు సీతమ్మ, వైస్ ఎంపిపీ భాగ్యవతి మండలం ఎంపీడీవో కే, కిరణ్ కుమార్ పార్టీ మండల అధ్యక్షులు పాంగి, మల్లికార్జునరావు సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు రమేష్, స్థానిక సర్పంచ్ లక్ష్మణ్ నరసింగరావు, స్థానిక ఎంపిటిసి, సుబ్బలక్ష్మి, కమల, నబ్బోలి మాజీ ఎంపిటీసీ పార్టీ సీనియర్ నాయకులు గాసిరాం పార్టీ నేతలు, మత్స్య లింగం, జగబంధు, సన్యాసిరావు, జయదేవ్, సులేమాన్, కొండలరావు, అప్పారావు, దామోదరం, పిత్ బాస్, జగన్నాథం, తిరుపతి, బాలరాజు దేవా, సాధురాం, పులిరాజు, దాసు, ఉదయ్, ప్రసాద్, పెదబాబు హనుమంతు, రామరాజు, సింహాద్రి, బుద్ధ, నాగేష్, తిరుపతిరావు, రామారావు, పురుషోత్తం, నందన, నాగరాజు గణేశ్వరరావు, ఆనందరావు, కృష్ణరావు, ధనుర్జై, అర్జున్, వనబసింగి, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్స్, రెవిన్యూ డిపార్ట్మెంట్, ఆర్డబ్ల్యూఎస్ సిబ్బంది, స్థానిక విఆర్ఓ, రమేష్, కార్యకర్తలు అభిమానులు స్థానిక ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధల నడుమ సత్యసాయి నగర సంకీర్తన

**నక్కపల్లి, అక్టోబర్ 29 ప్రభాతవార్త**



అత్యంత భక్తి శ్రద్ధల నడుమ శనివారం ఉదయం ఉపమాక గ్రామ పుర వీధులలో నక్కపల్లి సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నగర సంకీర్తన కార్యక్రమం చేపట్టారు. నక్కపల్లి సత్యసాయి సమితి సభ్యులు కక్కిరాల సురేష్, కొత్త భగవాన్, విశ్వేశ్వరరావు, నరవ నూకరాజు శర్మ (ట్రైప్ మాస్టారు) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా విశేష పూజలు నిర్వహించారు. బాలవికాస్ సభ్యులు, పలు పాఠశాలల చిన్నారులు పాల్గొని ఆధ్యాత్మికత పరిమళిల్లేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయుడు దవరశింగి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పండుగ

### చవితి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాబురావు

**నక్కపల్లి, అక్టోబర్ 29 ప్రభాతవార్త**



నాగుల చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో మండలంలో ఉన్న ప్రజలు శనివారం జరుపుకున్నారు. ఉదయం నుంచే గ్రామాల్లో పండగ వాతావరణం కనిపించింది. వారి వారి పొలాల్లో ఉన్న పుట్ల వద్దకు వెళ్లి ఆ స్వామివారికి పూజలు నిర్వహించి చవితి పండుగను ఆచరించారు. కుటుంబ సమేతంగా ఈ పండుగను జరుపుకునే విధానం విశేషంగా ఆకట్టుకుంది. ఇది ఇలా ఉండగా ఎస్.రాయవరం మండలం కొరుప్రోలు సమీపంలో పాయకరావుపేట శాసనసభ్యులు గొల్ల బాబురావు కుటుంబ సమేతంగా నాగుల చవితిని జరుపుకుని ప్రత్యేక పూజలు చేశారు.

## భక్తి శ్రద్ధలతో చవితి పండుగ



**ఆనందపురం, అక్టోబర్ 29 ప్రభాతవార్త**

మండలంలోని 26 పంచాయతీల ప్రజలు భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పండుగను వేడుకగా జరుపుకున్నారు. వేకువ జాము నుండే పిల్లలు, పెద్దల సందడి కనిపించింది. ఈ పండుగకు ఒక ప్రత్యేకత ఉంది. పుట్టలో కోడిగుడ్లు వేసి పాలు పోయటం ఆనవాయితీగా వస్తున్న సాంప్రదాయం. దీన్ని తూచా తప్పకుండా అందరూ ఉపవాసాలతో నాగేంద్రుడుని జపించుకున్నారు. కొన్ని గ్రామాల్లో పుట్టలు లేక పోయినప్పటికీ కృత్రిమ పుట్టలు ఏర్పాటు చేసుకొని పూజలు అర్పించారు. అయితే వేములవలసలో భీమిలి మాజీ ఏఎంసీ చైర్మన్ కోరాడ నాగభూషణరావు, మాజీ సర్పంచ్ కోరాడ అరుణ జ్యోతి, ప్రస్తుత ఉపసర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్, సాయిరాం హోటల్ యజమాని కోరాడ సూర్యారావు ఆయన సతీమణి గున్న, సాయి దినేష్ తదితరులు నాగేంద్రుడికి మొక్కు లు తీర్చుకున్నారు. కొంతమంది శుక్రవారం నాగుల చవితి చేసుకోగా శనివారం ఉదయం 10 గంటలకు మరి కొంత మంది చేసుకున్నారు.

## డివైడర్‌ని ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి

**యలమంచిలి, అక్టోబర్ 29 ప్రభాతవార్త**

యలమంచిలి-అనకాపల్లి జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ని ఢీకొట్టింది. ఈ ఘటనలో కొక్కిరాపల్లికి చెందిన భీమిని సాయికిరణ్(21) తీవ్ర గాయాలవ్వగా కేజీహెచ్ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఈ ఘటనపై ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి 10:30కి యలమంచిలి నుంచి తన స్వగ్రామమైన కొక్కిరాపల్లి గ్రామానికి వెళ్లే దారిలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. వెంటనే కేజీహెచ్‌కి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు రూరల్ ఎస్సై సన్నీబాబు తెలియజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# ద్వారకలో జనాభాకంటే మందిరాలెక్కువ

## కోస్తా తీరప్రాంత భద్రతకు ముప్పు: హోంమంత్రుల సమావేశంలో కేంద్ర మంత్రి అమిత్‌షా

**చండీగఢ్, అక్టోబరు 29:** గుజరాత్‌లోని ద్వారక కోస్తా ప్రాంతంలో జనాభా కంటే ఎక్కువ మందిరాలు ఆక్ర మంగా ఉన్నాయని, వీటివల్ల ద్వారక ప్రతిష్ఠకు మచ్చ రావడమేకాకుండా కోస్తా తీరానికి సైతం ముప్పు కలుగు తుందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆందోళన వ్యక్తం చేసారు. కోస్తా రక్షణకు ఈ మందిరాలు పెరుగుదల కొంత ప్రమాదం తెచ్చిపెడుతుందని హోంమంత్రులు, డిజిపిల సమావేశంలో మంత్రి వెల్లడించారు. సమావేశం ముగిం పుకు హోంమంత్రి మాట్లాడుతూ ఈ చిన్న ద్వీపంలో ఎక్కువ మందిరాలు స్థాపించి జనాభాకంటే ఎక్కువ ఉన్నాయన్నారు. ఐటీవల గుజరాత్ యంత్రాంగం వీటిని కూల్చివేత కార్యాచరణచేపట్టి మంచిపని చేసిందని, అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తోందన్నారు. ముస్లిం జనాభా అత్యధికంగా ఉన్న ఈ ద్వీపంలో ద్వారకాధీష్ ముఖ్యమందిర్ ఉందని, అక్రమాలకు తావివ్వకూడదనే భావిస్తారన్నారు. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ప్రధాని మోడీ కూడా ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ చేపట్టిన ఈ కూల్చివేతను ఆమోదించారు. చింతన్‌శివిర్‌పేరిట నిర్వహించిన రాష్ట్రాల హోంమంత్రుల సమావేశం బిజెపి అధికారంలోకి వచ్చిన మొట్టమొదటిసారి జరిగింది. కాంగ్రెస్ పార్టీ హయాంలో ఈసమావేశాలు నిరంతరం జరుగుతుండేవి. అంతర్గత భద్రత సమీక్షకొరకు సమా వేశాలు నిర్వహించేవారు. ఇపుడు జన్మదినం, మరణధ్ర వీకరణలను డిజిటలైజేషన్‌చేయడం మంచిపని అయిందని పలువురు రాష్ట్రాల డిజిపిలు వెల్లడించారు. అలాగే భారత్‌లో అక్రమంగా నివసిస్తున్న విదేశీయుల సమస్య కూడా పెరిగిందని వెల్లడించారు. సైబర్ సమస్యలు, శిక్షలు పడుతున్న కేసుల్లో వృద్ధి, డ్రగ్‌మాఫియా అరా చకాలు, జాతీయ భద్రత, సరిహద్దు నిర్వహణ అంశాలపై విస్తృత స్థాయిలో చర్చలుజరిగాయి. 2047 నాటికి శాంతిభద్రతల నిర్వహణలో కేంద్రం రాష్ట్రాలు పూర్తిగా పరస్పరం సహకరించుకుని నేరాలను కట్టడిచేయాలని, ఇప్పటివరకు సుమారు 9200 మంది మిలిటెంట్లు ఈశా న్యప్రాంతంలో లొంగిపోయారని, అందువల్లనే ఇపుడు అభివృద్ధి ఈ ప్రాంతంలో వేగం పుంజుకుందని అన్నారు. అఫ్‌స్పా చట్టం అమలుతో ఈ ప్రాంతంరూపురేఖలు మారుతున్నాయన్నారు. రాష్ట్రాల న్నింటికీ ఒకే విధమైన శాంతిభద్రతల చట్టాలుండాలని, అందుకు ఒకే విధానం రూపొందాలన్నారు. వీటిసాయంతో సరిహద్దు ఉగ్రవా దం, సైబర్‌నేరాలను అరకట్టగలుగుతామని ప్రాంతీయ సరిహద్దు వివాదాలను సైతం పరిష్కరించుకోగలుగుతా మని అమిత్‌షా వెల్లడించారు.





## ఛాత్ పూజలో అగ్ని ప్రమాదం

### సిలిండర్లు పేలి 50మందికి గాయాలు

**పాట్నా:** బీహార్‌లోని ఔరంగాబాద్‌లో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. ఛాత్ పూజలకు సన్నాహాలు చేస్తుండగా..రెండంతస్తుల భవనంలో గ్యాస్ సిలిండర్లు పేలాయి. దాంతో, 50మంది గాయపడ్డారు. గాయపడ్డవారిలో ఏడుగురు పోలీస్ సిబ్బంది ఉన్నారు. వీరందరినీ సమీపంలోని సదర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం జరిగిన భవనం ఔరంగాబాద్‌లో జరుకెన వీధిలో పేరున్న ఓడియాగలీలో ఉన్నది. పాత జిటి రోడ్డులో ఉన్న మర్ఫీ రేడియో వీధిలో రెండంతస్తుల భవనంలో అనిల్ అనే వ్యక్తి జనరల్ స్టోర్‌ను నిర్వహిస్తున్నారు. స్టోర్ యజమాని కుటుంబం ఛాత్ పూజల కోసం శనివారం తెల్లవారుజామున ప్రసాదం తయారు చేస్తుండగా గ్యాస్ సిలిండర్లు పేలాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు అక్కడికి చేరుకొని మంటల్ని ఆర్పేందుకు యత్నిస్తుండగా ఏడుగురు పోలీసులు గాయపడ్డారు. గాయపడినవారిలో స్టోర్ యజమాని కుటుంబసభ్యులు కూడా ఉన్నారు. ఛాత్ పూజల్ని బీహార్, యుపి, బెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాల్లో జరుపుకుంటారు. కార్తీక మాసం శుక్ల పక్షినాడు ఈ పండుగ జరుపుకుంటారు. గంగా నదిలో స్నాన మాచరించి, ఉపవాస దీక్ష చేస్తారు. ఈ పండుగ సందర్భంగా సూర్యుడితో పాటు ఆయన సోదరి ఛాతిమాతను పూజిస్తారు. సూర్యోదయానికి ముందే ప్రసాదం చేయాలన్నది సంప్రదాయం.





## చక్కెర ఎగుమతులపై ఆంక్షల్ని పొడిగించిన కేంద్రం

**న్యూఢిల్లీ:** చక్కెర ఎగుమతులపై ఆంక్షల్ని కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. ఇంతకుముందు విధించిన ఆంక్షల గడువు అక్టోబర్ 31తో ముగియనున్నది. దాంతో, ఎగుమతలుపై ఆంక్షల్ని 2023 అక్టోబర్ 31 వరకు పొడిగిస్తున్నట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్(డిజిఎఫ్‌టి) శనివారం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొన్నది. అయితే, ఇయు,యుఎస్‌లకు సిఎక్స్ఎల్, టి ఆర్ క్యూ డ్యూటీ కింద పంపే కోటాలకు ఈ ఆంక్షలు వర్తించవని తెలిపింది. సిఎక్స్ఎల్, టి ఆర్ క్యూ కోటాల కింద నిర్దేశిత మొత్తంలో చక్కెరను ఆ దేశాలకు ఎగుమతి చేస్తారు. దేశీయ మార్కెట్‌లో చక్కెర తగినంతగా అందు బాటులో ఉండేందుకు వీలుగా ఎగుమతులపై ఆంక్షలు విధిస్తున్నట్లు కేంద్రం తెలిపింది. ప్రపంచంలోనే అత్యధిక చక్కెరను ఉత్పత్తి చేసే దేశం భారత్ అన్నది గమనార్హం. విదేశాలకు ఎగుమతుల్లో భారత్‌ది రెండో స్థానం. దేశీయంగా 2 కోట్ల 75లక్షల టన్నుల చక్కెర అవసరమని అంచనా. బఫర్‌స్టాక్‌గా కనీసం 60 లక్షల టన్నుల చక్కెర నిల్వఉంచాల్సి ఉంటుంది. ఈ ఆర్థిక సంవత్సరం మరో 45 లక్షల టన్నులను ఇథనాల్ ఉత్పత్తి కోసం వినియోగించనున్నట్లు అంచనా.

## యుపిలో 400 మందితో బలవంతపు మత మార్పిడి

### 9 మందిపై కేసు నమోదు

**మీరట్:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని మీరట్ జిల్లాలో బలవంతపు మతమార్పిడి సంఘటన వెలుగు చూసింది. కొవిడ్ సంక్షోభ సమయంలో సహాయమందించే మిషతో దాదాపు 400మందిని క్రైస్తవంలోకి బలవంతంగా మత మార్పిడి చేశారు. దీనిపై బాధితుల ఫిర్యాదుతో 9మంది నిందితులపై కేసు నమోదైంది. మంగత్‌పురంలోని మలిన్ గ్రామంలో ఈ మతమార్పిడి ఘటన జరిగింది. కొవిడ్ సమయంలో తమకు డబ్బు, ఆహారం ఆశ చూపి క్రైస్తవంలోకి మారాలని ఒత్తిడి చేశారని బాధితులు తమఫిర్యాదులో పేర్కొన్నారు. క్రైస్తవ ఆచారాలను పాటించాలని, హిందూ దేవుళ్ల ఆరాధనకు దూరంగా ఉండాలని తమపై ఒత్తిడి చేసినట్లు బాధితులు తెలిపారు. స్థానిక బిజెపినేతతో కలిసి బాధితులు తమ సమీపంలోని బ్రహ్మపుత్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీపావళి రోజున తమ ఇళ్లల్లోకి ప్రవేశించి హిందూ దేవుళ్ల విగ్రహాలను ధ్వంసం చేశారని బాధి తులు తెలిపారు. ఆధార్‌కార్డుల్లో పేర్లు మార్చుకోవాలనికూడా చెప్పారని వారు తెలిపారు. తాము చెప్పినట్లువినకపోతే చంపేస్తామని బెదిరించారని తెలిపారు. బాధితుల ఫిర్యాదుతో కేసునమోదు చేశామని జిల్లాఎస్‌పి పీయూష్‌సింగ్ తెలిపారు.

## ఉగ్రవాదుల టూల్‌కిట్‌లో కీలక ఆయుధంగా సోషల్ మీడియా: విదేశాంగమంత్రి ఎస్. జైశంకర్



**న్యూఢిల్లీ:** సమాజాన్ని అస్థిరపరిచే లక్ష్యంతో కుట్ర సిద్ధాంతాలను వ్యాప్తి చేయ డానికి ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాలు ఉగ్ర బృందాల టూల్‌కిట్‌లో శక్తిమంతమైన సాధనాలుగా మారాయని విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ ఆం దోళన వ్యక్తం చేశారు. మానవాళికి ఉగ్రవాద ముప్పు పెరుగుతోందని, అది మరింత విస్తరిస్తోందని జైశంకర్ అన్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలికి చెందిన కౌంటర్ టెర్రరిజం కమిటీ ఢిల్లీలో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో జరుగుతున్న కౌంటర్ టెర్రరిజం కమిటీ(సిటిసి) సమావేశాల్లో ప్రపంచ దేశాల ప్రతినిధులు పాల్గొ న్నారు. మొదటిరోజు ముంబయిలో, రెండోరోజు ఢిల్లీలో ఈ సమావేశాలను నిర్వహించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం సరికొత్త సవాళ్లను విసురుతోందని ఆయన గుర్తు చేశారు. మానవాళికి పొంచి ఉన్న ఉగ్రముప్పును ఎదుర్కో వడానికి ఐరాస భద్రతామండలి తగిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఉగ్రవాదం విస్తరిస్తోందని జైశంకర్ అన్నారు. ఉగ్ర సంస్థలకు నిధులు అందించే దేశాలను కట్టడి చేయడంలో భద్రతా మండలి కీలకంగా వ్యవహరించిందని జైశంకర్ అన్నారు. ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్(ఎఫ్‌టిఎఫ్) గ్రేలిస్ట్ వల్లే జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రదాడులు తగ్గిపోయాయన్నారు. పరోక్షంగా పాకిస్థాన్‌ను గుర్తు చేస్తూ జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే, ఇటీవల గ్రేలిస్ట్ నుంచి పాక్‌ను తొలగించారు. దాంతో, ఇప్పుడు అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంక్, ఎడిబి తదితర సంస్థల నుంచి నిధులు పొందే అవకాశం పాక్‌కు లభించింది. ఉగ్ర సంస్థలకు నిధులు అందకుండా చేయడంలో గతంలో విఫలమైన కారణంగా నాలుగేళ్లపాటు పాక్‌ను గ్రే జాబితాలో ఉంచారు.

ఉగ్ర సంస్థలను ప్రభుత్వ నిధులతో నడిచే వ్యవస్థగా మార్చిన దేశాలపై ఆంక్షలు విధించాల్సిన అవసరాన్ని మరోసారి జైశంకర్ గుర్తు చేశారు. ఐరాస పలు చర్యలు చేపట్టినా ఆసియా, ఆఫ్రికా దేశాల్లో ఉగ్రవాదం ఇంకా విస్తరిస్తూనే ఉన్నదని జైశంకర్ తెలిపారు. ఐరాస కౌంటర్ టెర్రరిజం ట్రస్ట్‌కు భారత్ ఈ ఏడాది 5 లక్షల డాలర్లను అందిస్తుందని జైశంకర్ తెలిపారు. ఉగ్రవాదంపై పోరాడే సభ్య దేశాలకు ఈ నిధులు అందించాలని సూచించారు.

## ఒక్కరోజులో కరోనా కేసులు 1569, మృతులు 4

### దేశంలో మొత్తం బాధితులు 4,46,50,662

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,అక్టోబర్29:** భారత్‌లో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. గడిచిన 24 గంటల్లో దేశవ్యాప్తంగా 1569 కేసులు నమోదయ్యాయి. నలుగురు మరణించారు. ఇప్పటివరకు దేశంలో కరోనా బారిన పడిన మొత్తం బాధితుల సంఖ్య 4,46,50,662కి చేరిందని కేంద్ర ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడించింది. మొత్తం బాధితుల్లో ఇప్పటి వరకు 4,41,02,852మంది కోలుకోగా 18,802మంది దేశంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకుదేశంలో కరోనా కారణంగా మృతి చెందినవారి సంఖ్య 5,29,008కు చేరినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం దేశంలో కరోనా వైరస్ బారినపడి కోలుకుంటున్న వారి(రికవరీ రేటు) 98.77 శాతంగా ఉంది. దేశంలో కరోనా కారణంగా మరణాల రేటు 1.18శాతంగా ఉంది. మహారాష్ట్రలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 81,31,139కిచేరగా, 79,81,135మంది వరకు కోలుకున్నారు. 1,48,383మంది ప్రాణాలు కోల్పోయారు. కేరళలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 68,21,230కి చేరింది. అందులో 67,46,453మంది కోలుకున్నారు. 71,375మంది మరణించారు. కర్ణాటకలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 40,68,558కి చేరింది. అందులో 40,26,318మంది కోలుకున్నారు. 40,296మంది మరణించారు. తమిళనాడులో కరోనా బాధితుల సంఖ్య35,91,571కి చేరింది. అందులో 35,51,409మంది కోలుకున్నారు. 38,048 మంది మరణించారు.

## గుజరాత్ ఆప్ సిఎం అభ్యర్థిపై ప్రజాభిప్రాయసేకరణ

### మూడో తేదీ ఒపినియన్‌పోల్,4వ తేదీ అభ్యర్థి వెల్లడి

### ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్

**అహ్మదాబాద్, అక్టోబరు 29:** ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్‌కేజ్రీవాల్ గుజరాత్ ఎన్నికల్లో పోటీచేయనున్న ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటిస్తామని వెల్లడించారు. వచ్చేనెల నాల్గవ తేదీ తమ ముఖ్యమంత్రి అభ్యర్థిని వెల్లడిస్తామని, రాష్ట్రప్రజలనుంచి వచ్చే అభిప్రాయసేకరణ మెజార్టీతోనే ముఖ్యమంత్రి అభ్యర్థి ఎంపికవుతారని ప్రకటించారు. మీడియాతో మాట్లాడుతూ ఆప్ జాతీయ కన్వీనర్ పార్టీని ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్, వాయిస్ మెయిల్, ఇమెయిల్‌లను వినియోగించి వారి అభిప్రాయాలను వెల్లడించాలని, ముఖ్యమంత్రి అభ్యర్థి ఆప్‌నుంచి ఎలా ఉండాలని కోరుకుంటున్నారో తెలియజేయాలనిసూచించారు. గుజరాత్‌లో ఇపుడు ప్రజల మనోభావాలు మారాయని, ఆప్ ప్రభుత్వం ఏర్పాటుచేసే వాతావరణం రోజురోజుకూ పెరుగుతోందన్నారు. రానున్న ముఖ్యమంత్రిని ఏపార్టీ లేదా ఏతరహా నాయకుడిని ఎన్నుకుంటారో చెప్పాలని కోరారు. ఇందుకోసం ఆయన ఒక ప్రత్యేక నంబరును కూడా విడుదలచేసారు. ఈనెంబరుకు ఎస్ఎంఎస్, వాట్సాప్ సందేశాలు, వాయిస్ మెసేజ్‌లను కూడా విడుదలచేయవచ్చని,



ఆప్‌నోసిఎంజిమెయిల్ డాట్‌కామ్‌కు కూడా తమ పేర్లు అభిప్రాయాలు పంపించవచ్చన్నారు. నాలు గు మార్గాల్లోప్రజలు తమ విజ్ఞప్తులు పంపించవచ్చని, నవంబరు మూడోతేదీ సాయంత్రం ఐదు గంటలవరకూ ఈ సేకరణ జరుగుతుందని, తర్వాత నాల్గవతేదీనే ఫలితాలను వెల్లడిస్తామన్నారు. గుజరాత్‌లో ముఖ్యమంత్రులను బిజెపి తరచూ మార్చివేస్తోందని, ప్రజాభిప్రాయం లేకుండానే విజయ్ రూపానిని మార్చి భూపేంద్ర పటేల్‌ను నియ మించిందన్నారు. రూపానిని తొలగించడం ద్వారా రాష్ట్రంలో ఏదో తప్పుజరిగిందని బిజెపి అంగీకరించిందన్నారు. ఆయన అవినీతిపరుడు లేదా అసమర్థుడని తొలగించారా మరెందుకు చేసారని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి విధానాలు ఆప్‌లో ఉండబోవని, అందువల్లనే ప్రజల నుంచే నేరుగా సిఎం అభ్యర్థిని అభిప్రాయసేకరణతో ఎంపికచేస్తున్నట్లు తెలిపారు. పంజాబ్ ఎన్నికల్లోకూడా ఇదేవిధానం అనుసరించామని, ప్రజలు భగవంత్ మాన్‌ను భారీ మెజార్టీతో ఎంపిక చేసుకున్నారన్నారు. ప్రజాభిప్రాయం మేరకే ఆయన పేరును ప్రకటించామని కేజ్రీవాల్ వెల్లడించారు.

## రెడ్‌లైట్ ఆన్ గాడీఆఫ్‌కు ఎల్జీ అభ్యంతరాలు

### కేజ్రీవాల్ ఆప్‌ప్రభుత్వం మరోసారి గవర్నర్‌పై ధ్వజం



**న్యూఢిల్లీ, అక్టోబరు 29:** ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా రాష్ట్రప్రభుత్వం చేపట్టిన రెడ్‌లైట్ ఆన్, గాడీ ఆఫ్ కార్యాచరణకు అడ్డువేస్తున్నారని అరవింద్ కేజ్రీవాల్ ఆప్ ప్రభుత్వం ధ్వజమెత్తింది. తాత్కాలిక చర్యలతో కాలుష్యనివారణ ఎలా సాధ్యం అవుతుందని గవర్నర్ ప్రశ్నలు వేస్తూ ఈ కొత్త కార్యాచరణను నిలిపివేసారని విమర్శించింది. ఆమ్ ఆద్మీప్రభుత్వం ఢిల్లీలో అంతకుముందు వాతావరణ కాలుష్యం కట్టడిచేసేందుకు ట్రాఫిక్ కూడళ్లలో రెడ్‌లైట్ ఆన్ అవగానే వాహనాల ఇగ్నిషన్‌ను నిలిపివేయాలని దీనివల్ల కొంతమేర వాతావరణపరిరక్షణ జరుగుతుందని ఈ విధానాన్ని ప్రవేశపెట్టేందుకు గవర్నర్ ఆమోదంకోసం ఫైలును పంపించింది. అయితే సక్సేనా నిర్ణయం వల్ల ఈనెల 28నుంచి ప్రారం భించాల్సిన ఈ ప్రచారజాతాను వాయిదావేయాల్సి వస్తోందని ఆప్ వాదిస్తోంది. అయితే లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయ వివరాలనుచూస్తే కాలుష్యనివారణమంత్రి గోపాల్‌రాయ్ అబద్ధాలవల్లనే ఫైలునిలిపివేసారని చెపుతున్నారు. నెలరోజులపాటు రెడ్‌లైట్ ఆన్ గాడీ ఆఫ్ ప్రచారం నిర్వహించాలనినిర్ణయించారు. ట్రాఫిక్ సిగ్నల్లవద్ద వేచి ఉండే సమయాల్లో వాహణ ఇంజన్లను పూర్తిగా ఆపివేయాలన్నదే ఈ కార్యాచరణ సారాంశం. అయితే లెఫ్టినెంట్‌గవర్నర్ ఈ కార్యాచరణలో సివిల్ డిఫెన్స్ వలంటీర్లను వినియోగించడం భారీగా కాలుష్యం ఉన్న ప్రాంతాల్లో వీరి విధులు వీరి ఆరోగ్యానికి చేటు తెస్తాయని అభ్యంతరాలు వ్యక్తంచేసారు. తాత్కా లిక పద్ధతులతోకాకుండా సాంకేతిపరమైన పరిజ్ఞానంతో శాశ్వతప్రాతిపదికన దూరం చేయాలని ఏటికేడాది ఎప్పటికప్పుడు తాత్కాలిక చర్యలు ఎందుకని లెఫ్టినెంట్ గవర్నర్ ప్రశ్నించారు. గతంలోచేపట్టిన కార్యాచరనలన్నీ సత్ఫలితా లివ్వలేదని అన్నారు. అంతేకాకుండా వలంటీర్ల భద్రత, ఆరోగ్యంపై కూడా ప్రభావం పడుతుందని అందువల్ల మరోసారి పునరాలోచనచేయాలని లెఫ్టినెంట్ గవర్నర్ తిప్పిపంపించారు. ముఖ్యమంత్రివద్దనే ఈనిర్ణయం ఫైలు పదిరోజులు ఉందని, ఈనెల 12నుంచి 21వ తేదీవరకూ సిఎం వద్దనే ఉందని, తన కార్యాలయానికి ఈనెల 21వ తేదీ మాత్రమే వచ్చిందని గవర్నర్ కార్యా లయం వివరణ ఇచ్చింది. మొత్తంమీద ఢిల్లీలో లెఫ్టినెంట్ గవర్నర్; ఆప్ ప్రభుత్వం మధ్య ఉన్న ఈ అంతరాలు రోజురోజుకూ పతాకస్థాయికి చేరుతున్నాయి.

## విదేశీ సాయం నిలిపివేతకు రిషి సునాక్ నిర్ణయం

**లండన్, అక్టోబరు 29:** ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో కఠిన నిర్ణయాలు తప్పవని ఇప్పటికే స్పష్టంచేసిన బ్రిటన్ నూతన ప్రధాని రిషి సునక్ మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. విదేశీ సాయాన్ని మరో రెండేళ్లపాటు నిలిపివేయాలని భావిస్తున్నట్లు టెలిగ్రాఫ్‌పత్రిక తన కథనంలో వెల్లడించింది. మొత్తం జాతీయ ఆదాయంలో 0.5శాతం మొత్తాన్ని బ్రిటన్ విదేశీ సాయంకోసం వినియోగిస్తోంది. అయితే కరోనా నేపథ్యంలో ఆర్థికసంక్షోభంలో కూరుకుపోయిన యుకె రెండేళ్లక్రితం విదేశీ సాయాన్ని పూర్తిగా నిలిపివేసింది. తాజాగా రిషి సునక్ నేతృత్వంలోని ప్రభుత్వం దీనిని మరో రెండేళ్లపాటు పొడిగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. విదేశీ సాయానికి సంబంధించిన అన్ని నిర్ణయాలను ప్రధానితోపాటు ఛాన్సలర్ ఉమ్మడిగా తీసుకుంటారని యుకో ట్రెజరీ అధికారప్రతినిధి వెల్లడించారు. కరోనా విజృంభణకు ముందు బోరిస్‌జాన్సన్‌ప్రభుత్వంలో రిషిసునక్ ఆర్థికమంత్రిగా ఉన్నారు. పరిస్థితులు సాధారణ స్థితికి వస్తే 2025 నాటికి విదేశీ



సాయాన్ని 0.7శాతానికి పెంచుతామని అప్పట్లో ప్రకటించారు. అయితే తాజాగా 2026 వరకూ విదేశీ సాయాన్ని పూర్తిగా నిలిపివేయాలని రిషి ప్రభుత్వం యోచిస్తున్నట్లు టెలిగ్రాఫ్‌పత్రిక వెల్లడించింది. బ్రిటన్ తీవ్ర ద్రవ్యోల్బణపరిస్థితులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో కేవలం విదేశీ సాయాన్ని నిలిపివేయడమే కాకుండా ఇతర అంశాల్లోనూ మరో మూడేళ్లపాటు కోతలుపడే అవకాశం ఉందని రాసుకొచ్చింది. దేశంలో సాధారణ పరిస్థితులు తీసుకొచ్చేందుకు ఆహారం ఇంధనం గృహకొనుగోలుపై పన్ను తగ్గింపును రద్దుచేస్తూబ్రిటన్‌ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే.

## టోల్‌ప్లాజా సిబ్బందిపై ఎమ్మెల్యే దాడి



**రాంచి, అక్టోబరు 29:** జార్ఖండ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే టోల్‌ప్లాజా ఉద్యోగి చెంప ఛెళ్లుమనిపించాడు. హజారీబాగ్ పాట్నారోడ్‌లో ఉన్న నాగ్వాన్ టోల్‌ప్లాజా ఉద్యోగిపై బర్హి ఎమ్మెల్యే ఉమాశంకర్ అకేలా దాడిచేసారు. ఆలస్యంగా గేట్‌తీయడంతో ఎమ్మెల్యే ఉమాశంకర్ ఆగ్రహానికి గురయ్యారు. దాంతో లోపలికి ప్రవేశించి టోల్‌ప్లాజా ఉద్యోగిని కొట్టారు. గురువారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. ఇందుకు సంబంధించి సిసి ఫుటేజి వీడియోబయటకు రావడంతో వైరల్ అయింది. అయితే దీనిపై ఎవరూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయలేదు. ఎమ్మెల్యే ఉమాశంకర్ బర్హినుంచి రాంచీకి వెళుతుండగా ఆతడితోపాటు బాడీగార్డులు, భద్రతా సిబ్బందికూడా కారులో ఉన్నారు. నాగ్వాన్ టోల్‌ప్లాజాలోని రెండులైన్లలో బారికేడ్ వేయడంతో అక్కడ చాలాసేపు వాళ్లు ఆగిపోయారు. అయితే ఎమ్మెల్యే బాడీగార్డ్ కిందకు దిగి అడ్డంకులను తొలగించి టోల్‌ప్లాజా దాటేందుకు ప్రయత్నించాడు. అయినా వారిని అడ్డుకోవడంతో ఎమ్మెల్యే ఉమాశంకర్ కారుదిగి టోల్‌కార్మికుడిని కొట్టారు. స్థానిక కొర్రపోలీస్‌స్టేషన్ ఇన్‌ఛార్జి ఉత్తమ్ తివారీ ఎమ్మెల్యేకు, టోల్‌వర్కర్‌కు మధ్య వాగ్వాదంజరిగిందన్నాడు. అయితే ఇప్పటివరకూ ఎలాంటి ఫిర్యాదురాలేదని వెల్లడించారు. మరోవైపు ఇదే విషయమై ఎమ్మెల్యే స్పందించారు. టోల్‌ప్లాజా కార్మికుడు దుర్భాషలాడాడని అసభ్యకరకంగా ప్రవర్తించాడని ఎమ్మెల్యే చెప్పారు. అసభ్యకరంగాప్రవర్తించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని టోల్‌ప్లాజాలోని అన్ని లైన్లను తెరిచి ఉంచాలని టోల్ మేనేజర్‌ను కోరారు.

## ఎన్నికల బాండ్ల విరాళాల్లో 95 శాతం బిజెపికే..

### ఇతర పార్టీలకిస్తే ఇడి, ఐటి దాడులు: రాజస్థాన్ సిఎం అశోక్‌గెహ్లాట్



**సూరత్ :** ఎన్నికల బాండ్ల ద్వారా వస్తున్న విరాళాల్లో 95 శాతం బిజెపికే వెళ్తున్నాయని రాజస్థాన్ సిఎం, కాంగ్రెస్ నేత అశోక్‌గెహ్లాట్ ఆరోపించారు. దాతలు భయంతో ఇతర పార్టీలకు విరాళాలు ఇవ్వడంలేదన్నారు. గుజరాత్ అసెంబ్లీకి త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గెహ్లాట్ శనివారం సూరత్ లో మీడియాతో మాట్లాడారు. కార్పొరేట్లను బిజెపి బెదిరిస్తోందని, దాంతో అత్య ధిక విరాళాలను ఆ పార్టీకే ఇస్తున్నారని గెహ్లాట్ విమర్శించారు. కాంగ్రెస్‌తోపాటు ఇతర పార్టీలకు విరాళాలు ఇవ్వొద్దని బిజెపి బెదిరిస్తోందన్నారు. ఇతర పార్టీలకు ఎవరైనా విరాళాలు ఇస్తే..వెంటనే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఆదాయం పన్నుశాఖ అధికారులు విరాళాలిచ్చిన దాతల ఇళ్ల తలుపులు తట్టుతారని ఆయన అన్నారు. బిజెపి పెద్ద మొత్తాల్లో విరాళాలు వసూలు చేస్తోందని, ఆ డబ్బుతో ఫైవ్‌స్టార్ పార్టీ కార్యాలయాను నిర్మించుకుంటోందని గెహ్లాట్ ఆరోపించారు. విరాళాల డబ్బుతోనే రాష్ట్రాల్లోని ప్రతిపక్షాల ప్రభుత్వాలను కూలుస్తోందని ఆయన విమర్శించారు. మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలను కూలగొట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బిజెపిని ఫాసిస్ట్ శక్తిగా గెహ్లాట్ అభివర్ణించారు. మతం ఆధారంగా ఆ పార్టీ గెలుస్తోందని.. విధానాలు. పథకాల ప్రాతిపదికన గెలవడంలేదని ఆయన అన్నారు. మహాత్మాగాంధీ పుట్టిన గుజరాత్‌లో ఇప్పుడు హింస, అశాంతి నెలకొన్నాయని గెహ్లాట్ అన్నారు. ఈ పరిస్థితి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. బిజెపి పట్ల అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారన్నారు. ప్రభుత్వాన్ని మార్చేందుకు సమయం ఆసన్నమైందన్నారు. తదుపరి ప్రభుత్వం ఏర్పాటుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉన్నదన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీపైనా గెహ్లాట్ విమర్శలు గుప్పించారు. ఢిల్లీ సిఎం, ఆప్ అధినేత కేజ్రీవాల్ తనకు వ్యతిరేక వార్తలు రాకుండా మీడియాకు డబ్బులు వెదజల్లుతున్నారని ఆరోపించారు. అది కూడా ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు.

## జర్నలిస్టులకు కర్ణాటక సిఎంఒ నగదు గిప్టులు

### మరో వివాదంలో చిక్కుకున్న సిఎం బొమ్మయి

**బెంగళూరు, అక్టోబరు 29:** కర్ణాటకలో జర్నలిస్టులకు దీపావళి గిప్ట బాక్సుల్లో లక్షరూపాయల నగదును ముఖ్యమంత్రి కార్యాలయం పంపిణీ చేయడంపై జర్నలిస్టుల్లో నిరసన వ్యక్తం అవుతోంది. బెంగళూరుకు చెందిన కొందరు జర్నలిస్టులకు మాత్రమే ఈ గిప్టులు అందాయని తెలియడంతో మిగిలిన జర్నలిస్టులు తీవ్రనిరసన వ్యక్తంచేసారు. ఒక్కొక్క జర్నలిస్టుకు లక్షరూపాయలు నగదును కవర్‌లో ఉంచి ఈ గిప్టబాక్సులను ముఖ్యమంత్రి కార్యాలయం అందచేసిందన్న విమర్శలు వెల్లువెత్తడంతో ఇపుడు కర్ణాటక సిఎం బొమ్మయి మరో వివాదానికి గురయ్యారు. బొమ్మయి వెంటనే క్షమాపణలు చెప్పారని జర్నలిస్టుల కానుకగా ఇచ్చిన సొమ్ములపై తనకు తెలియదని సిఎంఒ వర్గాలు కూడా ప్రకటించాయి. ఆయన విచారణకు ఆదేశించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలంటున్నాయి. ఎంపికచేసిన మీడియా సంస్థల జర్నలిస్టులకు దీపావళి సందర్భంగా ఈనెల 22న స్వీట్లు డ్రైఫ్రూట్స్ తోకూడిన గిఫ్ట్ బాక్సులతోపాటు లక్ష రూపాయల నగదు ఉన్న కవర్ కూడా ఉందన్న ఆరోపణలు వినిపించాయి. అయితే ఈ మొత్తం వ్యవహారంలో ఇపుడు కర్ణాటక సిఎంఒ విమర్శలపాలయింది.



## ఆవును ఢీకొట్టిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు: నెల రోజుల్లో మూడో ప్రమాదం

**గాంధీనగర్:** కొన్ని వారాల క్రితం ప్రారంభమైన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు వరుస ప్రమాదాలు జరుగుతున్నాయి. శనివారం గుజరాత్‌లోని అతుల్ రైల్వే స్టేషన్ సమీపంలో సెమీ హైస్పీడ్ రైలును ఆవు ఢీకొనడంతో కొద్దిసేపు ఆగిపోయింది. ఉదయం 8 గంటల 17 నిమిషాల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో రైలులో డ్రైవర్ కూర్చునే బోగీ నోస్ కోన్ కవర్ ధ్వంసమైందని రైల్వేశాఖ తెలిపింది. నెల రోజుల వ్యవధిలో ఇది మూడో ఘటన. ఈ నెల 6న ఈ రైలు నాలుగు బర్రెలను ఢీకొట్టింది. ఆ మరుసటి రోజే గుజరాత్‌లోని ఆనంద్ స్టేషన్ సమీపంలో ఓ ఆవును ఢీకొట్టింది. గాంధీనగర్..ముంబయి మధ్య ప్రధాని మోడీ ఇటీ వలే వందేభారత్ సెమీ హైస్పీడ్ రైలును ప్రారంభించారు. అక్టోబర్ 1 నుం చి ఈ రైలు సేవలు ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చాయి. పశువులు ఢీకొనకుండా చేయలేకపోతున్నామని రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ గత ప్రమాదాల సందర్భంగా అన్నారు. రైలు డిజైనింగ్‌లో మార్పులు చేయడం ద్వారా వీలవుతుందేమో చూడాలన్నారు.



## ప్రపంచంలో 63.51కోట్లమందికి కరోనా, 65.92 లక్షలమంది మృతి

**జెనీవా, అక్టోబరు 29:** ప్రపంచదేశాల్లో కరోనా చాపకిందనీరులా విస్తరిస్తోంది. రోజురోజుకూ కొత్తకేసులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది శనివారం నాటికి ప్రపంచదేశాల్లో మొత్తం 63.51 కోట్లమందికి కరోనాసోకి 65.92 లక్షల మంది చనిపోయారు. మరో 36,287 మంది పరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 61.41 కోట్లకుపైగా ఉన్నాయి. మరో 1.44 కోట్లమంది ఇప్పటికీ ఆసుపత్రుల్లోనే ఉన్నారు. యూరోప్ దేశాల్లో మొత్తం 23.42 కోట్లమందికికరోనాసోకి వారిలో 19.41 లక్షలమంది చనిపోయారు. మరో 7726 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 22.67 కోట్లకుపైగా నమోదుకాగా వారిలో 55.02 లక్షలమంది ఇప్పటికీ కరోనాతో సతమతం అవుతున్నారు. ఉత్తర అమెరికా దేశాల్లో మొత్తం 11.77 కోట్లకుపైగా కరోనా కేసులురాగా వారిలో 15.52 లక్షలమంది చనిపోయారు. మరో 7873 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 11.32కోట్లకుపైగా నమోదుకాగా మరో 30.46 లక్షలమంది ఇప్పటికీ ఆందోళనకరంగానే కొనసాగుతున్నారు.

ఆసియా దేశాల్లో మొత్తం 19.35 కోట్లమందికికరోనాసోకి 14.87 లక్షల మంది చనిపోయారు. మరో 9535 మందిపరిస్థితి విషమించింది. రికవరీలు 18.70 కోట్లకుపైగా నమోదుకాగా మరో 49.22 లక్షలమంది ఇప్పటికీ మృత్యువుతోపోరా డుతున్నారు. దక్షిణ అమెరికా దేశాల్లో మొత్తం 6.44 కోట్లమందికికరోనాసోకి వారిలో 13.32 లక్షలమందిచనిపోయారు. మరో 10,152 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 6.27 కోట్లకుపైగా నమోదుకాగా మరో 3,29,851 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. ఆఫ్రికా దేశాల్లో మొత్తం 1.27 కోట్లకుపైగా కరోనా బాధితులుంటే వారిలో 2,57,850 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 1.20 కోట్లకుపైగా ఉంటే వారిలో 4,.09 లక్షలమంది ఇప్పటికీ విషమపరిస్థితుల్లోనే ఉన్నట్లు సమాచారం. 19 ద్వీపకల్పదేశాల్లో మొత్తం 1.26 కోట్లకుపైగా కరోనా కేసులునమోదుకాగా వారిలో 21,563 మందిచనిపోయారు. రికవరీలు 1.23కోట్లకుపైగా ఉంటే మరో 2,45,402 మందిపరిస్థితి మరింతగా విషమించినట్లు తేలింది.

# అది కదా 'మెగా' క్రేజ్..

తెలుగుసినీ పరిశ్రమ మొత్తం మీద ఎలాంటి సమస్య వచ్చినా ముందుగా గుర్తుకువచ్చే పేరు చిరంజీవి.. ఎలాంటి సినిమా బ్యాక్‌గ్రౌండ్‌లేకుండా సినీ పరిశ్రమలో ఎంట్రీ ఇచ్చిన ఆయన సినీ పరిశ్రమమొత్తానికి పెద్దదిక్కుగా మారారు. తనకు ఆ 'పెద్ద' అనే బాధ్యతలు వద్దు అంటూనే సినీ పరిశ్రమకు ఏ కష్టం వచ్చినా తానున్నాను తన భుజం కాస్తాను. అంటూ ఆయన అన్ని



విషయాల్లో నూ అండగా ఉంటూ వస్తున్నారు. మెగాస్టార్ కుర్ర హీరోలకు సైతం పోటీ ఇస్తూ తన చరిష్మాతో తెలుగు సినీ పరిశ్రమను ఎప్పటికపుడు ఆశ్చర్యపరుస్తూనే ఉంటారు. హిట్లు, ఫ్లాపులతో సంబంధం లేకుండా మెగాస్టార్ చిరంజీవి పేరు వింటేనే ఎంతోమందికి వైబ్రేషన్స్ వస్తూఉంటాయి.. సినీ పరిశ్రమలో సైతం ఎంతో మంది నటీనటులు, దర్శకులు, సాంకేతిక నిపుణులు మెగాస్టార్ చిరంజీవిని స్ఫూర్తిగా తీసుకుని సినీపరిశ్రమకు వచ్చారంటే అతిశయోక్తి కాదు.. సామాన్య ప్రేక్షకులకు గురించి చెప్పాల్సిన అవసరమే లేదు.. చిరంజీవి పేరు చెబితే దేనికైనా రెడీ అనే అభిమాన గణాన్ని ఆయన సంపాదించుకున్నారు. తాజాగా సీనియర్ జర్నలిస్టు ప్రభు 'శూన్యం నుంచి శిఖరాగ్రాలకు' అనే పుస్తకాన్ని రచించి మెగాస్టార్ చిరంజీవి చేతులమీదుగా ఆవిష్కరింపజేశారు.. ఇక ఈ ఈవెంట్‌కు మెగాస్టార్ చిరంజీవి ముఖ్యఅతిథిగా హాజరవ్వగా, ఆయనతో ఫొటోలు దిగేందుకు సెలబ్రిటీల భార్యలు సైతం ఆసక్తిచూపించటం చర్చనీయాంశమైంది.. వారంతా సినీ పరిశ్రమలో దర్శకులు, నిర్మాతలు అలాగే పలువురు ఉన్నతాధికారుల కుటుంబాలుకూడ ఉన్నాయి.. అయితేనేమీ మెగాస్టార్ అభిమానులే.. మెగాస్టార్‌చిరంజీవి హాజరైన కార్యక్రమానికి హాజరవుతున్నామనే ఆనందంతో వచ్చిన వారందరికీ ఆయనతోఫొటోదిగే అవకాశం వస్తే వదులుకుంటారా. వెంటనే వెళ్లి ఆయనతో ఫొటోలు దిగేందుకు ప్రయత్నించారు. అంతేకాదుమెగాస్టార్ కూడఫొటోలు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. దీంతో ఒక్కసారిగా సందడి నెలకొంది..

# 'బ్లాక్ అండ్ వైట్' టీజర్

గ్లామరస్ బ్యూటీ హెబ్బాపటేల్ ప్రధాన పాత్రలో తెరకెక్కినచిత్రం బిఅండ్‌డబ్ల్యు ('బ్లాక్ అండ్ వైట్).. పద్మనాభరెడ్డి, సందీప్ రెడ్డి ఈచిత్రాన్నినిర్మిస్తున్నారు.. ఎస్ఆర్ ఆర్ట్స్, ఏయూ అండ్ ఐ స్టూడియోస్ ప్రై.లి సహకారంతో ఎ.మేఘనారెడ్డి సమర్పిస్తున్నారు. ఎల్ఎన్‌వి సూర్యప్రకాష్ దర్శకత్వం వహిస్తున్న ఈచిత్రంలో సూర్య శ్రీనివాస్, లహరిశారి, నవీన్ నేని



ముఖ్యపాత్రల్లనటిస్తున్నారు.. తాజాగా ఈచిత్రం టీజర్‌ను ప్రముఖ రచయిత, రాజ్యసభ సభ్యుడు వి.విజయేంద్రప్రసాద్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈచిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కాగా ట్రైలర్ విశేషంగా ఆకట్టుకుంటోంది.. ఈచిత్రంలో హెబ్బాపటేల్ డిఫరెంట్‌షేడ్స్‌లో కన్పించారు.. ఉత్కంఠభరింగా ఉన్న ఈ టీజర్ థ్రిల్లర్ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంది.. ఇందులోయువతకు నచ్చే అంశాలు న్నాయి. టీజర్‌కట్‌తోదర్శకుడుసూర్య ప్రకాష్ ఆసక్తిని పెంచేశారు.. విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి.. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ఈసినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# 'హలో మీరా'



సింగిల్ క్యారెక్టర్, డిఫరెంట్ స్టోరీ లైన్ తీసుకుని హలోమీరా.. అనే ఓ కొత్త తరహా థ్రిల్లింగ్ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు దర్శకుడు కాకర్ల శ్రీనివాసు.. ఎలాంటి భారీ తారాగణం ఎంచుకోకుండా ప్రయోగాత్మక కథతో ఈ మూవీప్లాన్ చేసి షూట్ చేశారు. ప్రముఖ దర్శకులు బాపు గారితోపలుసినిమాలకు సహ దర్శకునిగా పనిచేసిన అనుభవాన్ని రంగరించి ఈ సినిమాను రూపొందిస్తున్నారు డైరెక్టర్ కాకర్ల శ్రీనివాసు. తాజాగా టీజర్‌ను రిలీజ్ చేసిన సినిమాపై అంచనాలను మరింత పెంచేశారు. ప్రముఖ దర్శకుడుహరీశ్ శంకర్ చేతుల మీదుగా ఈచిత్రం టీజర్‌నువిడుదల చేశారు. ఈసందర్భంగా హరీశ్ శంకర్ మాట్లాడారు.. ఈమూవీ ఎంతో ఆసక్తికరంగా ఉండటమేా కాకుండా వైవిధ్యభరితంగా కూడ ఉందన్నారు. ఈ విషయం టీజర్‌తో తెలిసిపోతోందన్నారు. యూనిట్‌కు ఆల్‌ది బెస్ట్ అని తెలిపారు. మీరాగా గార్గేయి యల్లా ప్రగడ నటించారు.. డాక్టర్ లక్ష్మణరావు దిక్కల, వరప్రసాదరావు దుంపల, పద్మ కాకర్ల నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఎస్ చిన్నసంగీతం అందిస్తున్నారు.. సస్పెన్స్ డ్రామా థ్రిల్లర్‌గా ఉండేఈచిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేయటానికి సన్నాహాలుచేస్తున్నారు.

# టైటిల్‌కు ఇంత స్పందన వస్తుందని అనుకోలేదు

సీట్ ఎడ్జ్ మూమెంట్స్‌తో రూపొందిన క్రైమ్ థ్రిల్లర్ తగ్గేదే లే .. భద్ర ప్రొడక్షన్స్ బ్యానర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. యువ హీరోనవీన్ చంద్ర లీడ్ రోల్‌లో నటిస్తున్న ఈచిత్రాన్ని శ్రీనివాస్ రాజు తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్, ఇంట్రెస్టింగ్ టీజర్, నైనా గంగూలీ నర్తించిన స్పెషల్ సాంగ్‌కు మంచి స్పందన వచ్చింది.. ప్రమోషన్స్‌లో భాగంగా దర్శకుడు శ్రీనివాస్‌రాజు మీడియాతో మాట్లాడారు. ఆయన మాటల్లోనే.. త్వరగా పూర్తిచేయాలనే ఉద్దేశ్యంతో మర్డర్ మిస్టరీని ఎంచుకున్నా. ఈ తరహా కథలను కరోనా సమయంలో అందరూ చూశారు. ఏ సినిమా కథ అయినా కూడ లవ్, లస్ట్, వెంజెన్స్ మీదే రన్ అవుతుంటాయి.. దండుపాళ్యం సినిమాను కరోనా సమయంలో చాలామందిచూసి ఫోన్లు చేశారు.. ఈ కథలో వెంజెన్స్ ఉంటుంది.. అయితే ఈసినిమాకు టైటిల్ ముందుగానే ఏమీ అనుకోలేదు.. కానీ కరోనా సమయంలోతగ్గేదే లే అనే పదం క్కువగా పాపులర్ అయ్యింది.ఈ కథలోకూడ తగ్గేదే లే అన్నట్టుగా పాత్రలుంటాయి.. అందుకే ఈ టైటిల్ పెట్టాం.. అయితే టైటిల్ ఇంతవైరల్ అవుతుందని, స్పందనవస్తుందని మేం అపుడు అనుకోలేదు.. ఈసినిమా నిడివి దాదాపు రెండు గంటల పదిహేను నిముషాలుంటుంది.. అందులో సగానికి పైగా లవ్ స్టోరీ ఉంటుంది. నాకు ఇపుడు ప్రేమ కథలు తీయాలని ఉంది.. ఎపుడూ ఒకే రకమైన జానర్‌లో ఉన్న సినిమాలనుచేయాలనుకోవటం లేదు.. ఇపుడుమంచి ప్రేమ కథలు తీయాలని అనుకుంటున్నాను.. అయితే ఇందులో దండుపాళ్యం టీం అంతా అనుకోకుండా వచ్చేసింది.. తెలిసిన కథనే కొత్తగా చెప్పాలని అనుకుంటున్నాను. చాలా సింపుల్‌గా చెప్పాలని అనుకున్నాను. మెదడు మీద ఒత్తిడి ఉండదు..అలా చూస్తుండిపోయేలా ఉంటుంది.. నవీన్ చంద్రకు కథ చాలా బాగా నచ్చింది. ఆయనది లవ్‌స్టోరీమాత్రమే..నేను ఆయనకు పాయింట్స్ రూపంలోనేచెప్పాను.. చాలా సింపుల్‌గా ఉందని, చేద్దామని వెంటనే ఓకే చెప్పారు.. ప్రేక్షకులకు నచ్చితేనే సినిమాలు చూస్తారు.. సినిమా అంటే వినోదం మాత్రమే.. హీరోకి ఉండే డెమీ గాడ్ ఇమేజ్ ఇపుడు పోతోంది..ఒరిజినల్ సినిమా అంటే ..ఇపుడు కాంతారా అందరినీ ఆకట్టుకుంటోంది.. లిప్‌లాక్స్ పెట్టినంత మాత్రాన ప్రేక్షకులు థియేటర్లకు రారు.. దర్శకుడిగా నేను నా స్క్రిప్టు విషయంలో వెనకడుగువేయను.. వెంటవెంటనే సినిమాలుచేయాలనే ఉద్దేశ్యం లేదు.. చేసిన ఒక్కసినిమాను మనసుపెట్టి చేయాలని అనుకుంటున్నాను..



'తగ్గేదే లే' దర్శకుడు శ్రీనివాస్ రాజు

**సమంత టైటిల్‌పాత్రలో నటించిన చిత్రం 'యశోద'.. ఇందులో వరలక్ష్మీశరత్‌కుమార్ కీలకపాత్ర చేశారు. శ్రీదేవి మూవీస్ పతాకంపై నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించారు.. హరి,హరీష్ దర్శకత్వం వహించారు. నవంబర్ 11న ఈచిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.. ఈసందర్భంగా వరలక్ష్మీ శరత్‌కుమార్‌తో ఇంటర్వ్యూ విశేషాలు.. ఈ ఆదివారం మీకోసం..**

# మీ మనీకి వాల్యూ ఇచ్చే మూవీ



**యశోద..కథ విన్నపుడు మీ రియాక్షన్ ఏంటి?**

ఇటువంటి క్యారెక్టర్లను ఎలా రాశారు... ఈ కథను ఎలా అలోచించారా అని ఆశ్చర్యపోతూ అడిగాను.. మీరు ట్రైలర్ చూస్తే.. నా క్యారెక్టర్ చాలా కామ్‌గా ఉంటుంది.. కథ ముందు సాగేటపుడు క్యారెక్టర్ గురించి మరింత రివీల్ అవుతుంది.. గ్రేషేడ్స్ ఉన్న రోల్ చేశా.. సమంత క్యారెక్టర్, నా క్యారెక్టర్ మధ్య రిలేషన్..మా కథలు ఆసక్తిగా ఉంటాయి.

**ఈ స్క్రిప్టు వరకు మీరు ఫేస్ చేసిన ఛాలెంజెస్?**

పెద్ద ఛాలెంజీస్ ఏమీ లేవు.. సమంతలా నేను ఫైట్స్ ఏమీ చేయలేను..నటిగా మంచి క్యారెక్టర్ చేశాను.ఒక డిఫరెంట్ రోల్ చేసేటపుడు నన్నునేను ఛాలెంజ్ చేసుకుంటూ ఆ విధంగా ఛాలెంజింగ్ అన్పించింది.

**మీరు యశోద చేయటానికి , ఈ కథలో మిమ్మల్ని ఆకట్టుకున్న అంశాలు?**

సమంతతోపాటు నా క్యారెకట్ర్ కూడ పార్లల్‌గా ఉంటుంది.. సినిమాలో లీడ్ రోల్ సమంతచేశారు. ఆమెకు ఒకరు అవసరం అవుతారు. అపుడు నా క్యారెక్టర్ ఎంటర్ అవుతుంది.. రెండు కథలు జరుగుతాయి.. ఆ రెండూ ఎలా కలిశాయి.. ? అనేది సినిమా . సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ సినిమా ఇది.. నాది సెకండ్‌లీడ్ అని చెప్పొచ్చు.. ఇంతకంటే ఎక్కువ చెబితే స్టోరీ రివీల్ అవుతుంది.. ప్రతిఒక్కరిలో మంచి,చెడులు చూపించారు.

**దర్శకుడు హరి, హరీష్ గురించి చెప్పండి?**

దర్శకులిద్దరూ చాలా కామ్.. నేనుపనిచేసినదర్శకుల్లో అంత కామ్‌గా ఎవరినీచూడలేదు. వాళ్లిద్దరూ అరవటం ఎపుడూచూడలేదు.. వాళ్లకు ఏం కావాలో చాలా తెలుసు.. ఒక్కో క్యారెక్టర్ కోసం చాలా రీసెర్చ్ చేశారు.మహిళల పాత్రలనుచాలా మంది రిలేట్ చేసుకుంటారు.. ఆ విధంగా క్యారెక్టర్లను డిజైన్ చేశారు..

**సమంతతో తొలిసారిగా సినిమాచేశారు కదా.. ఆమెతో వర్కింగ్‌ఎక్స్‌పీరియన్ ఎలా ఉంది?**

నాకు సమంత పది పన్నెండు ఏళ్ల క్రితమే తెలుసు.. మాకు చెన్నైలోపరిచయం అయ్యింది. సినిమాలో తనకు సీరియస్ సీన్స్ ఉన్నాయి.. నేను ఏమో షూటింగ్‌గ్యాప్ వస్తే జోక్స్ వేసేదాన్ని ..తను నవ్వేది..షాట్‌ముందే ఎందుకు ఇటువంటి జోక్స్ వేస్తావ్?.. అనేది.. తనతోనటించటం సరదాగా ఉంది..తను స్ట్రాంగ్ ఉమెన్.. పాత్రలో జీవించింది.. పవర్‌ఫుల్ రోల్ బాగా చేసింది.

**తెలుగు ప్రేక్షకుల గురించి?**

క్రాక్ ..మూవీలో జయమ్మ తర్వాత నాకు మంచి రోల్స్ వస్తున్నాయి.. రచయితలు నా కోసం ప్రత్యేకంగా క్యారెక్టర్లు రాస్తున్నారు.ఇపుడు నేను తెలుగులో ఎక్కువసినిమాలు చేస్తున్నాను. బయటకు వెళ్ళటానికి ఖాళీ లేదు.. తమిళసినిమాలుచేయటానికి డేట్స్ లేవు.. నాకు స్టీరియో టైప్‌రోల్స్‌రావటం లేదు.. అది సంతోషంగా ఉంది..

**ప్రస్తుతం చేస్తున్న చిత్రాలు?**

తెలుగులో 'శబరి' చేస్తున్నా.. అందులోనాది లీడ్ రోల్.. 'వీరసింహారెడ్డి' లో నాది క్రేజీ క్యారెక్టర్ ..ఇంకొన్ని సినిమాలు ఉన్నాయి.

# అశోక్ సెల్వన్ 'ఆకాశం'



వెర్సటైల్ యాక్టర్ అశోక్ సెల్వన్ తెలుగు, తమిళ ద్విభాషా చిత్రం ఆకాశం... కాగా ఈచిత్రం నీదాం ఒరు నానమ్‌గా తమిళంలోనవంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది.. ప్రముఖ నిర్మాణ సంస్థ వయాకామ్ 18, రైజ్ ఈస్ట్ బ్యానర్లపై ఆర్ఎ కార్తీక్ దర్శకత్వంలో రూపొందు తున్న ఈచిత్రంలో రీతూ వర్మ, అపర్ణ బాలమురళి, శివాత్మిక రాజశేఖర్ హీరో యిన్లుగా నటిస్తున్నారు. శుక్రవారం ఈ సినిమా ట్రైలర్‌ను నాచురల్‌స్టార్ నాని విడుదల చేశారు. రీసెం ట్‌గా విడుదల చేసిన ఆకాశం టీజర్‌కు మంచి స్పందన వచ్చిం ది.. అలాగే పాటలకూ కూడ మంచి స్పందన వచ్చింది. సినిమా రిలీజ్ సందర్భంగా ఇపుడు ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. అశోక్ సెల్వన్ మూడు డిఫరెంట్ పీరియడ్ ఆఫ్ టైమ్‌లో కన్పించారు.. అతని లైఫ్‌లో మూడు దశల్లోని జీవితాన్ని ఈచిత్రంలోఆవిష్కరించినట్టు తెలుస్తోంది.. ఇదొక ఫీల్ గుడ్ రొమాంటిక్ డ్రామాగా రూపొందుతోంది.. రీతూవర్మ, అపర్ణ బాలమురళి, శివాత్మిక పాత్రలను తీర్చిదిద్దిన తీరు వాటిని వారు క్యాచ్ చేసిన విధానం ప్రేక్షకులను మెప్పిస్తున్నాయి.. గోపీసుందర్ సంగీతం అందిస్తున్నారు. నవంబర్ 4న ఈచిత్రం విడుదల కాబోతోంది.

# మంచి, చెడులను చెప్పే 'కొరమీను'

జాలరిపేట నేపథ్యంలో సాగేసినిమాలు వాస్తవానికి దగ్గరగా ఉంటాయి.. అలాంటి ఆసక్తికరమైన , ఉత్కంఠభరితమైన చిత్రంగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది కొరమీను.. ఫుల్ బాటిల్ ఎంటర్ టైన్‌మెంట్స్ పతాకంపై ఆనంద్‌రవి , హరీష్ ఉత్తమన్, శత్రు, కిశోర్ రాత్రక్, రాజా రవీంద్ర, గిరిధర్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ నటించారు.. శ్రీపతి కర్రి దర్శకత్వంలో పెళ్లకూరు సామాన్య రెడ్డి



నిర్మించారు.. ఈ కొరమీను మోషన్ పోస్టర్‌ను సోషల్‌మీడియా ద్వారా ప్రముఖ హీరోయిన్ లావణ్య త్రిపాఠి శనివారం విడుదలచేశారు.. మోషన్ పోస్టర్‌లోఆకాశంలోవిపరీతమైన మబ్బులతో మేఘావృతమై ఉరుములు, మెరుపులమధ్య జాలర్లు పట్టే కొన్ని వందల బోట్స్ కన్పించగా, అందులోని ఒక బోట్‌పై మీసాల రాజ్ మీసాలు ఎవరో కత్తిరించారా? ఎందుకు అటూ పోస్టర్‌లోని బిజిఎం , ,సెట్టింగ్, మరియు పోస్టర్ చూస్తుంటేఎంతో క్యూరియాసిటీని కల్గిస్తోంది.. దర్శకుడు మాట్లాడుతూ, జాలారిపేట అనే మత్స్యకారుల కాలనీ నేపథ్యలోసాగే కథ అన్నారు. సరదా ప్రేమ గల డ్రైవర్, అతని యజమాని.. ఆయన అహంకారి ధనవంతుడు , వైజాగ్‌లో శక్తివంతమైన పోలీసు ఇలా మూడుముఖ్యమైన పాత్రలతోమంచి కంటెంట్‌తో ఈచిత్రం రాబోతోం దన్నారు. అందరికీ కచ్చితంగా నచ్చేలా ఉంటుందన్నారు.

# 25 మిలియన్ ప్లస్ వ్యూస్

మాస్ మహారాజా రవితేజ, కమర్షియల్ మేకర్‌త్రినాధరావు నక్కిన మాస్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ధమాకా.. రవి తేజ సరసన శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది.. ఈచిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్ భారీగానిర్మిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అండ్ అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పతాకాలపై రూపొందుతున్న ఈచిత్రానికి వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత.. ఇప్పటికే విడుదలైన ధమాకా పాటలు, టీజర్ సినిమాపై భారీ అంచనాలు పెంచాయి.. ధమాకా ఆల్బమ్‌లోని జింతాక్ పట మాస్ చార్ట్ బస్టర్ హిట్‌గా నిలిచింది.. తాజాగా ఈ పాట 26 మిలియన్ వ్యూస్‌ను క్రాస్ ఏసి సెన్సేషనల్ సాంగ్‌గా అలరిస్తోంది. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు.. ఈపాటకు అన్ని వర్గాల నుంచి ట్రెమండస్ రెస్పాన్స్ వస్తోంది.. ప్రతి రెండురోజులకు వన్ మిలియన్ వ్యూస్ పెంచుకుంటూ యూట్యూబ్, మ్యూజిక్ ప్లాట్‌ఫామ్స్‌లో దూసుకుపోతోంది.. ఈ పాటలో రవితేజ మాస్ డ్యాన్సులు ఫ్యాన్‌ను మెస్మరైజ్ చేస్తున్నాయి.. రవితేజ, శ్రీలీల కెమిస్ట్రీ ఆకట్టుకుం టోంది.. ఈచిత్రం డిసెంబర్ 23న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.. ప్రసన్నకుమార్ బెజవాడ కథ, స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు..



# 'వినరో భాగ్యము విష్ణు కథ'



సూపర్‌హిట్ చిత్రాలను నిర్మించిన జిఎ2 పిక్చర్స్‌లో రాబోతున్న మరో చిత్రం వినరో భాగ్యము విష్ణు కథ'. యంగ్ హీరో కిరణ్ అబ్బవరం ,కశ్మీర పరదేశి కాంబినేషన్‌లోఈచిత్రం రాబోతోంది.. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది.. ఈచిత్రాన్ని వచ్చే ఏడాది ఫిబ్రవరి 17న రిలీజ్ చేయబోతున్నారు.. ఈచిత్రాన్ని జిఎ2 పిక్చర్స్ బ్యానర్‌పై బన్నీవాసు నిర్మిస్తు న్నారు.. మెగా నిర్మాత అల్లు అరవింద్ సమర్పిస్తు న్నారు. మురళీ కిశోర్ అబ్బురూ దర్శ కత్వం వహిస్తున్నారు. చేతన్ భరద్వాజ్ సంగీతం అందిస్తు న్నారు. విలేజ్ డ్రామా నేపథ్యంలో సాగనున్న ఈసినిమా ఫిబ్రవరి 17న విడుదల మేకర్స్ ప్రకటించారు.

కర్ణాటక రాష్ట్ర సీనియర్ పొలిటీషియన్ జమీర్ అహ్మద్ కుమారుడు జైద్‌ఖాన్.. బెల్ బాటమ్‌ఫేమ్ జయతీర్థ దర్శకత్వం వహించిన పాన్ ఇండియా ప్రాజెక్టు 'బనారస్'తో సినీరంగ ప్రవేశం చేస్తున్నారు. బనారస్ సిటీ (వారణాసి) నేపథ్యంలో సాగే ఆహ్లాదకరమైన ప్రేమకథగా రూపొందుతోంది..సోనాల్ మోంటెరో హీరోయిన్‌గా నటిస్తోంది.. ఎస్‌కెప్రొడక్షన్స్ బ్యానర్‌పై తిలక్‌రాజ్ బల్లాల్ ఈచిత్రాన్నిభారీగా నిర్మిస్తున్నారు..నాంది సతీష్ వర్మ

# విజువల్ ట్రీట్‌లా ఉంటుంది



ఈచిత్రాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు.. భారీస్థాయిలోతెరకెక్కిన ఈ చిత్రం నవంబర్ 4న విడుదల కానుంది. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ, మలయాళ భాషల్లో విడుదల కానుంది.. ఈనేపథ్యంలో హీరో జైద్‌ఖాన్‌మీడియాతో మాట్లాడారు .ఆయన మాటల్లోనే.. ఈచిత్రం ప్రమోషన్స్‌ను దేశం మొత్తం కవర్ చేశాం.. ముంబై, పూణే, ఢిల్లీ, లక్నో, బనారస్,గుజరాత్, ఆంధ్రా, తెలంగాణ ,కోల్‌కతా, తమిళనాడు,ఇలా అంతా తిరిగాం.. అన్ని చోట్ల నుంచి మంచిస్పందన వచ్చింది. వైజాగ్‌ఈవెంట్‌లో వచ్చిన స్పందన చాలా ప్రత్యేకం.. ప్రేక్షకులు చూపిన అభిమానానికి కృతజ్ఞతలు..లక్నోలోకూడ బాగా అద్భుతమైన స్పందన వచ్చింది.. తొలుత నాంది సతీష్‌గారు ఒక తెలుగుసినిమాచేద్దామని కలిశారు. అయితే అప్పటికే నేను ఇంకా రెడీగా లేను.. ఒక కోర్సు ట్రైనింగ్‌లోఉన్నాను.. అలాగే హిందీ నుంచి కూడ రెండు అవకాశాలు వచ్చాయి.. అయితే నా దృష్టి సౌత్ సినిమాపైనే ఉంది.. బనారస్ చాయిస్ నాదే.. నేనే దర్శకుడు జయతీర్థను అప్రోచ్ అయ్యాను..చాలా కాలం నుంచి మంచి స్క్రిప్టు , దర్శకుడు కోసం ఎదురుచూశాను.. ఫైనల్‌గా బనారస్‌తో జయతీర్థగారు వచ్చారు. అలా మా ప్రయాణం మొదలైంది. పెద్ద సినిమాలు విడుదలై ఇండస్ట్రీపై అంచనాలు పెంచుతున్నాయి.. ఇపుడు బనారస్ వస్తోంది..అయితే ఎలాంటి ఒత్తిడి కాదు.. కానీ బాధ్యత ఉంటుంది..నేను కొత్త కావచ్చు.. కానీ పాన్‌ఇండియా అనేది చిన్న విషయం కాదు.. మా నిర్మాతలకు ముందే చెప్పాను. కన్నడ నుంచిమరో పాన్‌ఇండియా వస్తుందంటే ఒకస్థాయిలో ఉండాలి.. బనారస్ ను అన్నిభాషల పంపిణీదారులకు చూపించాం.. వాళ్లంతా ఈ సినిమా అన్ని భాషల ప్రేక్షకులను అలరిస్తుందని అభిప్రాయపడిన తర్వాతే పాన్‌ఇండియా విడుదలను నిర్ణయించాం..ఈచిత్రం ఒకమిస్టీరియస్ , డార్క్ ఎలిమెంట్ ఉంది.. దానికి బనారస్ నేపథ్యం ఎంచుకున్నాం.. కంటెంట్, బ్యాగ్రౌండ , రెండూప్రేక్షకులను థ్రిల్ చేస్తాయి..బనారస్ మంచి లవ్ స్టోరీ.. 85శాతం షూటింగ్ బనారస్‌లోనే తీశాం.. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది.. అన్ని ఎలిమెంట్స్ ఉంటాయి.. ఇందులో ఒక ప్రయోగం కూడ చేశాం.. అది ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుంది..ఇందులో టైం ట్రావెల్ కూడ ఉంటుంది..అయితే అది కథలో కొంత భాగమే.. ఎన్టీఆర్, రామ్‌చరణ్, రవితేజ గారు పర్సనల్‌గా తెలుసు. చిరంజీవిగారుకూడ తెలుసు.. అలాగే పవన్ కల్యాణ్‌గారు కూడ తెలుసు.. ఇపుడు కొత్తగా నాలుగు ప్రాజెక్టులున్నాయి.. బనారస్ విడుదల తర్వాత ఒక్కొక్కటిగా చేయాలి.. ప్రేమకథలు ఎక్కువగా చేయాలని ఉంది.

# 'భీమదేవరపల్లి బ్రాంచి' ఫస్ట్‌లుక్



భీమదేవరపల్లి బ్రాంచి .. ఇటీవల షూటింగ్‌పూర్తిచేసుకుని పోస్ట్‌ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది.. ఈచిత్రానికి సంబంధించిన ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్ ను ప్రముఖ దర్శకుడు వేణుశ్రీరామ్ విడుదల చేశారు.. ఇలాంటి కథాంశాన్ని కామెడీ వేలోచెప్పటం వల్లప్రేక్షకులకు ఈజీగా సినిమా రీచ్ అవుతుం దన్నారు.. టీంకు ఆల్‌ది బెస్ట్ అనితెలిపారు. చెప్పాల నుకున్న కథలోసహజత్వం పోకూడదని, వెతికి వెతికి అనేక మంది టాలెంటెడ్ థియేటర్ ఆర్టిస్టులతోచేయటం వల్ల ఈ సినిమాకు సహజత్వంగా ఉంటుందని, స్క్రీన్‌ప్లే రెండు గంటలు ప్రేక్షకుడిని కట్టిపడేస్తుందని అన్నా రు.. కాగా అంజిబాబు, రాజవ్వ, సుధాకర్‌రెడ్డి, కీర్తి లత, అభి, రూప శ్రీనివాస్, శుభోదయం సుబ్బారావు, సిఎస్ఆర్ వివరెడ్డి, పద్మ, సాయి ప్రసన్న, మానుకోట ప్రసాద్, గడ్డం నవీన్, తాటి గీత మల్లికార్జున్ నటిస్తున్నారు. బత్తిని కీర్తిలత గౌడ్, రాజా నరేందర్ చెట్లపెల్లి నిర్మాతలు. రమేష్ చెప్పాల రచన, దర్శకత్వం వహిస్తున్నారు.

30-10Pg7exHMNWJQE:Layout 1 10/30/22 11:50 PM Page 1



# శ్రీలంకపై న్యూజిలాండ్ ఘనవిజయం

## 65 పరుగుల తేడాతో లంకేయుల ఓటమి





**సిడ్నీ:** గ్లెన్‌ఫిలిప్స్ వీరోచిత శతకం, ట్రెంట్‌బౌల్ట్ అద్భుత బౌలింగ్‌తో సిడ్నీవేదికగా శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ 65 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన కివీస్ 20 ఓవర్లలో ఏడు వికెట్లనష్టానికి 167 పరుగులుచేయగా బదులుగా శ్రీలంక 19.2 ఓవర్లలోనే 102 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ విజయంతో న్యూజిలాండ్ టి20 ప్రపంచకప్ సెమీస్ బెర్త్‌ను దాదాపు ఖరారుచేసుకున్నట్లయింది. తర్వాత మ్యాచ్‌ల్లో ఇగ్లండ్, ఐర్లాండ్‌లతో తలపడనున్న కివీస్ ఇంగ్లండ్ చేతుల్లో ఓడినప్పటికీ మెరుగైన నెట్‌రన్‌సాయంతో సెమీఫైనల్‌కు చేరుకోగలుగుతుంది. ఈమ్యాచ్‌లో టాస్ గెలిచిన కివీస్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ బ్యాటింగ్ ఎంచుకోగా తొలి ఓవర్‌లోనే కివీస్‌కు షాక్ తగిలింది. అలెన్‌ను తీక్షణ ఔట్‌చేసాడు. ఫామ్‌లో ఉన్న కాన్వే విలియమ్సన్‌లు సైతం ఔట్ కావడంతో న్యూజిలాండ్ 15పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. కానీ ఫిలిప్స్ 64 బంతుల్లో 104 పరుగులు, మిచెల్ 22 పరుగులతో కివీస్‌ను ఆదుకున్నారు. ఇద్దరూ నాలుగో వికెట్‌కు 84 పరుగులు జోడించారు. 18వ ఓవర్‌లో శతకం బాదిన ఫిలిప్స్ 19 వ ఓవర్‌లో ఔట్ అయ్యాడు. ఇక 168 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక ఆరంభంలోనే వికెట్లునష్టపోయి కష్టాల్లో పడింది. తొలి ఓవర్‌లోనే సాథీ నిస్సంకను ఔట్‌చేయగా రెండో ఓవర్‌లో కుశాల్ మెండిస్ ధనంజయ డిసిల్వాను ఔట్‌చేసిన బౌల్ట్ మరుసటి ఓవర్‌లో అసలంకను సైతం ఔట్‌చేసాడు. దీనితో లంక ఎనిమిది పరుగులకే నాలుగు వికెట్లు నష్టపోయింది.

కరుణరత్నేకూడా తర్వాత ఔట్ కావడంతో 24 పరుగులకే సగం వికెట్లను కోల్పోయిన శ్రీలంక పీకల్లోతు కష్టాల్లోపడింది. ఈ దశలో భానుక రాజపక్స కివీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. 22 బంతుల్లో 34 పరుగులుచేసిన రాజపక్స ఫెర్గుసన్ బౌలింగ్‌లోభారీ షాట్‌కు యత్నించి ఔట్ అయ్యాడు. హసరంగ కాసేపటికే ఔట్‌కాగా కెప్టెన్ దసున్ షనక 32 బంతుల్లో 35పరుగులుచేసాడు. కివీస్ బౌలర్లను కట్టడిచేసాడు. కానీ ఆతడిని బౌల్ట్ పెవిలియన్‌కు పంపించాడు.

దీనితో 17 ఓవర్లలో ఆ జట్టు 93/9గా నిలిచింది. ఇష్‌సోదీ వేసిన చివరి ఓవర్‌లో లాహిరుకుమార స్టంపౌట్ కావడంతో శ్రీలంక 102 పరుగులకు ఆలౌట్ అయింది.

# రాహుల్‌కు మరో ఛాన్స్

## హ్యాట్రిక్ విక్టరీపై భారత్‌ఫోకస్

## నేడు పెర్త్‌లో భారత్ వర్సెస్ దక్షిణాఫ్రికా



**పెర్త్:** టి20 ప్రపంచకప్‌లో టీమిండియా హ్యాట్రిక్ విజయంపై ఫోకస్‌పెట్టింది. ఇప్పటికే రెండు మ్యాచ్‌లు నెగ్గిన భారత్ ఆదివారం కఠిన ప్రత్యర్థి దక్షిణాఫ్రికాతో తలపడుతోంది. ఈమ్యాచ్‌లో నెగ్గితే భారత్ సెమీఫైనల్‌కు సుమారుగాచేరుకున్నట్లే. దాంతో భారత్ ఈమ్యాచ్‌ను సీరియస్‌గా తీసుకుంది. పెర్త్‌వేదికగా ఈ మ్యాచ్ జరుగుతోంది. బౌలర్లకు పండగ అవుతోంది. భారత కాలమానంప్రకారం ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభం అవుతుంది. భారత్‌తోపాటు దక్షిణాఫ్రికాకు కూడా ఈమ్యాచ్‌కీలకం. ఈమ్యాచ్‌తర్వాత సఫారీజట్టు పాకిస్థాన్,నెదర్లాండ్స్‌తో ఆడాల్సి ఉంటుంది. టి20 ప్రపంచకప్‌లో ఇప్పటివరకూ బ్యాటింగ్‌పరంగా ఆశించిన స్థాయిలో ఆడని ప్లేయర్ ఒకే ఒక్కడు ఆతడు కెఎల్‌రాహుల్. తొలిమ్యాచ్‌లో కేవలం నాలుగుపరుగులు మాత్రమే చేసాడు. నెదర్లాండ్స్‌లో జరిగిన రెండోమ్యాచ్‌లో అంపైర్ తప్పిదం కారణంగా 12పరుగులుచేసి పెవిలియన్‌కు చేరాడు. దాంతో రాహుల్‌ను రిషబ్‌పంత్‌ను తీసుకోవాలని నెటిజన్లు సూచిస్తున్నారు. అయితే రాహుల్‌కు మరో అవకాశం ఇచ్చేందుకే టీమ్ డిసైడ్ అయినట్లు వార్తలు వస్తున్నాయి. దాంతో ఆతడు సౌతాఫ్రికాతోజరిగే పోరులో ఆడే అవకాశం ఉంది. గత మ్యాచ్‌లో రోహిత్ ఆడినా ఆది ఆతడి స్థాయికి తగ్గ ఆటకాదు. దాంతో దక్షిణాఫ్రికాపై భారీ ఇన్నింగ్స్ ఆడాలని పట్టుదలగా ఉన్నాడు. కోహ్లీ సూర్యకుమార్‌యాదవ్ హార్థిక్ ఫామ్‌లో ఉన్నారు. ఇక బౌలింగ్‌లో భువనేశ్వర్‌కుమార్ అర్షదీప్‌సింగ్, షమీలతోపాటు హార్థిక్ పాండ్యాలు మెరుగ్గానే ఉన్నారు. ఇక నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అక్షర్‌పటేల్ అశ్విన్‌లు మెరిసారు. పెర్త్‌పేస్‌కు సహకరించే పిచ్‌కావడంతో దక్షిణాఫ్రికా బౌలింగ్‌ను భారత్ ఏవిధంగా ఎదుర్కొంటుందో చూడాలి. గత రెండు మ్యాచ్‌ల్లో ఆడిన జట్టునే కొనసాగించే అవకాశం ఉంది. టీమిండియా మూడు విభాగాల్లో మెరుగుపడాలి. ఓపెనింగ్, పవర్‌ప్లే, డెత్‌ఓవర్లలో భారత్ మెరుగవ్వాలి. గత మ్యాచ్‌ల్లో భారత్ పవర్‌ప్లేలో ఆరుకంటే తక్కువరన్‌రేట్‌తో పరుగులుచేసింది. ఓపెనర్లు ఇప్పటివరకూ బోణీచేయలేదు. ఇక డెత్ ఓవర్స్‌లో భారత బౌలర్లు ధారాళంగా పరుగులు ఇచ్చేస్తున్నారు. దక్షిణాఫ్రికా బ్యాటింగ్ మంచి టచ్‌లో ఉంది. రోసో బంగ్లాదేశ్‌పై సెంచరీతోమెరిసాడు. డీకాక్‌కూడా టచ్‌లో ఉన్నాడు. వీరితోపాటు హిట్టర్లు మిల్లర్ స్టబ్స్ ఉండనే ఉన్నారు. అయితే వీరి ప్రధాన సమస్య కెప్టెన్ బవుమా. గాయంనుంచి కోలుకుని వచ్చాక ఒక్కసారికూడా మంచి ప్రదర్శనచేయలేదు. దాంతో ఆతడు జట్టుకు భారంగామారాడు. ఆతడిస్థానంలో క్లాసెన్‌ను తీసుకునే అవకాశం ఉంది. అదేజరిగితే మిల్లర్ కెప్టెన్‌గా వ్యవహరించే అవకాశం ఉంది. బౌలింగ్‌పరంగా నోకియా రబాడా, ఎంగిడిలతోబలంగా ఉంది.

# తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రల్వే, అక్టోబర్ 29 ప్రభాతవార్త:** .ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వేఉభయ తెలుగురాష్ట్రాల్లో ప్రత్యేక ఎక్స్ ప్రెస్ రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపారు. తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెళ్లే నెంబర్07481 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌లు ఈనెల 30న ఆదివారం రాత్రి 7:50 గంలకు తిరుపతి నుంచి బయల్దేరి సోమవారం ఉదయం 8:50 సికింద్రాబాద్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళ్లే నెంబర్07482 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 31న సోమవారం సాయంత్రం 7:05 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయల్దేరి మం గళవారం ఉదయం 8:10 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ఈ రైళ్ల మార్గ మధ్యంలో రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, మధిర, ఖమ్మం, డోర్నకల్, మహబూబాబాద్, వరంగల్, ఖాజీపేట, జనగాం రైల్వే స్టేషన్లలో నిలుస్తాయి. అలాగే, కాచిగూడ నుంచి యశ్వంతపూర్ వెళ్లే నెంబర్ 07421 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 30న ఆదివారం రాత్రి 10:30 గంటలకు కాచిగూడ నుంచి బయల్దేరి సోమవారం ఉదయం 10:50 గంటలకు యశ్వంతపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో యశ్వంతపూర్‌నుంచి కాచిగూడ వెళ్లే నెంబర్ 07422 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు యశ్వంతపర్ నుంచి సోమవారం ఉదయం 10:50 గంటలకు యశ్వంతపూర్ నుంచి సోమవారం మధ్యాహ్నం 3 : 50 గంటలకు బయల్దేరి, మంగళవారం తెల్లవారు జామున 4:00 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. ఈ రైళ్ల మార్గ మధ్యంలో షాద్ నగర్, జడ్చర్ల, మహబూబ్ నగర్, వనపర్తిరోడ్, గద్వాల, కర్నూలు, డ్రోణాచలం(డోన్), అనంతపురం, ధర్మవరం, హిందపురం, యలహంక రైల్వే స్టేషన్ల లో నిలుస్తాయి.

# కోహ్లీతో పాక్ బౌలర్ల చిట్‌చాట్



**పెర్త్:** టి20 ప్రపంచకప్ 2022లో భారత క్రికెట్ జైత్రయాత్ర కొనసాగుతోంది. రెండు మ్యాచ్‌ల్లో ఘనవిజయం అందుకుంది. ప్రత్యర్థులను చిత్తుచేసింద.ఇ గ్రూప్2 పాయింట్లపట్టికలో అగ్రస్థానంలో ఉంది. టీమిండియా ఖాతాలో నాలుగు పాయింట్లు ఉన్నాయి. తదుపరిమ్యాచ్ ఆదివారం ఆడనున్నది. దక్షిణాఫ్రికాను ఎదుర్కొనబోతోంది. ఈ రెండుజట్లు గ్రూప్2లో తొలిరెండుస్థానాల్లోనిలిచాయి. ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు మ్యాచ్ జరుగుతుంది. పెర్త్‌స్టేడియం ఇందుకు వేదిక అయింది. ఈ మ్యాచ్‌కోసం టీమ్ మొత్తం పెర్త్‌కు చేరింది. అక్కడే నెట్‌ప్రాక్టీస్‌చేస్తోంది. నెదర్లాండ్స్ ఓడించిన భారత్ పాకిస్తాన్‌ను కూడా మట్టికరిపించి ఇపుడు దక్షిణాఫ్రికాను ఢీకొంటోంది. ఈనేపథ్యంలోప్రాక్టీసులో ఉన్న పెర్త్ సేటడియంలో అరుదైన సన్నివేశం వెలుగుచూసింది. క్యాంటీన్‌లో విరాట్‌కోహ్లీ, పాకిస్థాన్ బౌలర్లు హ్యారిస్ రవూఫ్ షహీన్‌షా ఆఫ్రిదిలు ఎదురుపడ్డారు. అప్యాయంగా పలకరింపులు జరిగాయి. కోహ్లీ బౌల్‌తో క్యాంటీన్‌సూప్ తాగుతోండగా ఆతడిని పలకరించారు. ఆఫ్రిది, రవూఫ్ మాట్లాడుతుండగా కోహ్లీ నవ్వుతూ బదులిచ్చాడు. ఆఫ్రిదిచేతిలో జ్యూస్‌గ్లాస్, రవూఫ్ చేతిలో ఖాళీ ప్లేట్ కనిపించింది.

ఈనెల 23న మెల్‌బోర్న్ గ్రౌండ్‌లోజరిగిన మ్యాచ్‌లో కోహ్లీ ఈ ఇద్దరి బౌలింగ్‌ను చీల్చి చెండాడాడు. హ్యారిస్ రవూఫ్ బౌలింగ్‌లోనే కోహ్లీ రెండు సిక్సర్లు బాది టీమిండియాకు విజయం ఇచ్చాడు. చివరి 12 బంతుల్లో 33పరుగులుచేయాల్సిన దశలో 19వ ఓవర్‌ను బౌల్ చేసాడు రవూఫ్. చివరి రెండు బంతులను సిక్సర్లుగా మలిచాడు కోహ్లీ. దీనితో సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి.



## సిఎంకు ప్రాజెక్టులపై ఉన్న ప్రేమ

# రైతుల మీద లేదు

### వైఎస్సార్‌టిపి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

**ఇబ్రహీంపట్నం - ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు ప్రాజెక్టుల మీద ఉన్న ప్రేమ రైతుల మీద లేదని వైఎస్సార్‌టిపి అధ్యక్షురాలు షర్మిల తెలిపారు. శనివారం ప్రజాప్రస్థాన పాదయాత్రలో భాగంగా జగిత్యాల జిల్లాలోని మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామం మీదుగా రైతులు, మహిళలతో కలిసి పాదయాత్ర చేసుకుంటూ ఇబ్రహీంపట్నం మండలం గోధూర్ గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా గ్రామములో ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేసిన మాట ముచ్చట కార్యక్రమంలో పాల్గొని రైతుల సమస్యలపై, రైతు కూలీలు, మహిళల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో కోట్లు ఖర్చు చేసి కొల్లగొట్టిన డబ్బుల్లో కొంతైనా నిజాం షుగర్ ఫ్యాక్టరీలపై వెచ్చించి ఉంటే మూతపడిన షుగర్ ఫ్యాక్టరీలు తెరుచుకుని చెరుకు రైతులు, ఉద్యోగులు, ఫ్యాక్టరీపై ఆధారపడ్డ సిబ్బంది బాగుపడే వారాని తెలిపారు. తెలంగాణకే తల మాణికం అన్న నిజాం షుగర్ ఫ్యాక్టరీలను ముఖ్యమంత్రి కెసిఆర్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మూడు షుగర్ ఫ్యాక్టరీలను ముచ్చటగా మూసివేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. రాజన్న బ్రతికుంటే ఫ్యాక్టరీలు ప్రభుత్వపరమయ్యేవని తెలిపారు. రైతాంగం రోడ్డెక్కి పరిస్థితి వచ్చేది కాదన్నారు. ప్రభుత్వమే ఫ్యాక్టరీలను నడపలేని స్థితిలో ఉంటే రైతులు ఎలా నడిపిస్తారాని 80వేల పుస్తకాలు చదివిన కెసిఆర్‌కు సోయి లేదని ప్రశ్నించారు. వరి వేస్తే ఉరి అన్న సన్నాసి మన రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం దౌర్భగ్యమన్నారు. రైతు పక్షపాతి ప్రభుత్వం అని చెప్పుకోవడమే తప్ప రైతులకు చేసేంది ఏమి లేదన్నారు. నిజం దక్కన్ కర్మాగారాలు తెరిచే వరకు ఉద్యమాన్ని ఆపొద్దని రైతులకు భరోసా ఇచ్చారు. అధికారంలోకి వస్తే ఫ్యాక్టరీలను తెరిచి రైతుల చేతుల్లో పెడతామన్నారు. అనంతర గ్రామ శివారులో ఏర్పాటు చేసిన వసతిలో ఆమె బస చేశారు. ఆమె వెంట వైఎస్సార్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ, వైఎస్సార్ నాయకులు రెబ్బటి రాజేంధర్‌యాదవ్, మండల అధ్యక్షుడు గడ్డం శేఖర్, రైతు నాయకులు బద్దం శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రాజాసింగ్‌పై సస్పెన్షన్ ఎత్తివేసే యోచనలో బిజెపి అధిష్ఠానం

**హైదరాబాద్ (గోషామహాల్), అక్టోబరు 29, ప్రభాతవార్త:** గోషామహల్ నియోజకవర్గం బిజెపిశాసనసభ్యులు టి.రాజాసింగ్‌పై విధించిన సస్పెషన్ ఎత్తివేసే యోచనలో బిజెపి అధిష్టానం ఉన్నట్లు తెలుస్తుంది.రాజాసింగ్‌పై సస్పెషన్ ఎత్తివేత వెనుక తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు బండి సంజయ్ కీలకంగా వ్యవహరిస్తున్నట్లు ఆపార్టీ బిజెపి నేతలు చర్చించుకుంటున్నారు.రాజాసింగ్‌పై సస్పెషన్ ఎత్తివేయాలని అధ్యక్షులు బండి సంజయ్ కోరారు.మునుగోడు ఎన్నికల పోలింగ్ ముందే సస్పెషన్ ఎత్తివేసే యోచనలో బిజెపి ఉన్నట్లు సమాచారం. రాజాసింగ్ ఇచ్చిన వివరణపై బిజెపి హైకమాండ్ సంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తుంది.రాజాసింగ్‌కు అన్నివిధాలుగా మద్దతివ్వాలని అధిష్టానం నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు.రాజాసింగ్‌కు సంబంధించిన కేసుల విషయంతోపాటు పార్టీకి వ్యవహారాల్లో ఎప్పటికప్పుడు బిజెపి లీగల్‌సెల్ టీమ్‌తో బండి సంజయ్ చర్చిస్తున్నారు.పార్టీ తరపున రాజాసింగ్‌పై ఎమ్మెల్యే రఘునందన్‌రావు,మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు న్యాయ సహాయం అందిస్తున్నారు.రాజాసింగ్‌పై సస్పెషన్ ఎత్తివేసే మునుగోడులో బలం పెరుగుతుందని రాష్ట్రబిజెపి నేతలు భావిస్తున్నారు.ఆగస్టు25వ తేదిన రాజాసింగ్‌పై పిడియాక్టు నమోదు చేసి చర్లపల్లి జైల్‌కు తరలించిన విషయం తెలిసిందే.

## సుప్రీంకోర్టు జడ్జి పర్యవేక్షణలో

# ఎమ్మెల్యేల కొనుగోలు కేసుపై విచారణ జరిపించాలి

- ఎ1, ఎ2లుగా కెసిఆర్, కెటిఆర్‌లను చేర్చాలి
- పిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డి

**మునుగోడు, అక్టోబరు 29, ప్రభాతవార్త:** సుప్రీం కోర్టు జడ్జి పర్యవేక్షణలో ఎమ్మెల్యేల కొనుగోలు కేసును విచారించాలని టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని కొంపల్లిలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రను, మునుగోడు ఉప ఎన్నికలను పక్కదోవ పట్టించే క్రమంలో టిఆర్‌ఎస్, బిజెపిలు ఎమె ్మల్యేల కొనుగోలు అంటూ నాటకాలు ఆడుతున్నాయని ఆయన విమర్శించారు. సిబిఐ, ఈడి, ఐటి సంస్థలు కేంద్రం చేతుల్లో ఉన్నాయని, రాష్ట్ర పోలీసులు, ఎసిబి కెసిఆర్ డైరెక్షన్‌లో పనిచేస్తున్నాయన్నారు. ఈ నేపధ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మీద నమ్మకం లేదని సుప్రీం కోర్టు జడ్జి పర్యవేక్షణలో రోజూ నివేదికలు ఇచ్చే విధంగా ఎమ్మెల్యేల కొనుగోలు కేసును విచారించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కేసులో ఎ1, ఎ2లుగా కెసిఆర్, కెటిఆర్‌లను చేర్చాలన్నారు. రాష్ట్రంలో ఉప ఎన్నికలు వచ్చినప్పుడల్లా రాజకీయంగా కాంగ్రెస్ పార్టీకి నష్టం చేసే విధంగా టిఆర్‌ఎస్, బిజెపిలు సమన్వయంతో పని చేస్తున్నాయన్నారు. కెసిఆర్‌ను ఓడించాలనుకునే వారు బిజెపికి, బిజెపిని ఓడించాలనుకునే వారు టిఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేసేలా పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. తద్వారా కాంగ్రెస్ పార్టీ లేకుండా చేయాలనుకుంటున్నాయన్నారు. దుబ్బాక ఉప ఎన్నికల్లో ఇదే జరిగిందని, అప్పుడు హరీష్‌రావు ఏదో ఒక వివాదం సృష్టించే వారన్నారు. ఆ ఎన్నిక సందర్భంగా రఘునందన్‌రావు బంధువు వద్ద డబ్బులు దొరికాయి. రఘునందన్‌రావు మీద కేసులు పెట్టారు. ఫలితంగా రఘునందన్‌రావు మీద సానుభూతితో కెసిఆర్‌ను ఓడించాలనే లక్ష్యంతో దుబ్బాకలో బిజెపికి ఓటు వేశారన్నారు. గెలిచిన రఘునందన్‌రావు అసెంబ్లీకి పోయారని, ఆయన మీద పెట్టిన కేసులు, దొరికిన డబ్బులు ఎటుపోయాయో ఇప్పటికీ తెలియదన్నారు. హుజూరాబాద్‌లో కూడా ఈటెల రాజేందర్ సానుభూతితోనే గెలిచాడన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

సానుభూతితో కాంగ్రెస్ ఓట్లు కూడా ఈటెలకు పడ్డాయన్నారు. గెలిచిన తరువాత ఈటల ఆక్రమించుకున్న భూముల కేసులు ఏమయ్యాయని, ఆయనను జైలుకు పంపిస్తామన్న వారు ఏమయ్యారని ఆయన ప్రశ్నించారు. ఢిల్లీలో అమిత్‌షా, రాష్ట్రంలో కెసిఆర్ ఇద్దరు కలిసి ఉమ్మడి శత్రువు కాంగ్రెస్ పార్టీని ఆటలో నుండి తప్పించే కుట్రలకు పాల్పడుతున్నారన్నారు. ఉప ఎన్నికలు వచ్చినప్పుడల్లా భావోద్వేగాలను ముందు పెట్టి రాజకీయ ప్రయోజనం పొందుతున్నాయన్నారు. మునుగోడు ఉప ఎన్నికల్లో కూడా అదే జరిగే అవకాశం ఉందని, ఇలాంటి కుట్రలను తిప్పి కొట్టాలని కొన్ని రోజులకు ముందే పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చామన్నారు.
మూడు రోజుల క్రితం వెలుగు చూసిన ఫామ్‌హౌజ్‌లో నాటకం పరాకాష్టకు చేరిందన్నారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రను, మునుగోడు ఉప ఎన్నికల నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకు నాటకానికి తెర లేపారన్నారు. కెసిఆర్, కెటిఆర్‌లకు ఫామ్‌హౌజ్‌లుగా బాగా అచ్చొచ్చాయన్నారు. అందుకే టిఆర్‌ఎస్ ఎమ్మెల్యే కొనుగోలు అంశాన్ని చర్చకు తెచ్చారని, ఇప్పటి వరకు విడుదలైన ఆడియో రికార్డుల ప్రకారం పైలట్ రోహిత్‌రెడ్డి వాళ్లను డబ్బులు అడుగుతున్నాడని, ఇతరులను తీసుకువస్తానని బేరం చేసు_న్నాడన్నారు. అప్పుడు రోహిత్‌రెడ్డితో పాటు అతని వెంట ఉన్న ఎమ్మెల్యేలను నిందితులుగా చేర్చకుండా పీసీ యాక్టు ఎలా నిలబడుతుందన్నారు. డబ్బు డిమాండ్ చేసిన రోహిత్‌రెడ్డిని నిందితుడిగా చేర్చకుండా ఆ డిమాండ్‌ను నెరవేరుస్తామన్న తాంత్రికుల మీద కేసు పెడితే ఎలా నిలబడుతుందని, అందుకే ఏసీబి రిమాండ్‌ను తిరస్కరించిందన్నారు. ఈ మాత్రం కూడా స్టీఫెన్ రవీంద్రకు తెలియదా అని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో భాగస్వాములైన తాంత్రికుల ఫోన్లను సీజ్ చేసిన పోలీసులు ఎమ్మెల్యేల ఫోన్‌లను ఎందుకు సీజ్ చేయలేదన్నారు. కేసును నిరూపించాలన్న సెల్‌ఫోన్‌లు, సిసి కెమెరాలు చాలా కీలకమన్నారు. నేరం జరిగిన ప్రదేశం నుండి ఎమ్మెల్యేలను ప్రగతిభవన్‌కు పోలీసులే తీసుకెళ్లారని, అప్పటి నుండి ఎమ్మెల్యేలు కనిపించడం లేదన్నారు. కెసిఆర్ పర్యవేక్షణలోనే ఈ వ్యవహారమంతా నడిచిందని కెసిఆర్‌ను ఎ1గా, కెటిఆర్‌ను ఎ2గా సంతోష్‌జీని ఎ3గా తర్వాత తాంత్రికులను నిందితులుగా చేర్చి వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. మునుగోడు ఎన్నికల్లో డబ్బులు, మందు పంచకుండా ఓటు అడగాలని యాదగిరిగుట్ట నర్సింహస్వామిపై ఒట్టు వేస్తారా అని నేను సవాల్ విసరగా బండి సంజయ్, కెటిఆర్ వచ్చి ప్రమాణం చేస్తారా అని లేకపోతే అభ్యర్థులు వచ్చి ఒట్టేస్తారా అని ప్రశ్నించారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ సిద్దంగా ఉందన్నారు. మునుగోడు ఆత్మగౌరవాన్ని కాపాడి కాంగ్రెస్ అభ్యర్థి పాల్వాయి స్రవంతిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.
ఈ సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరామారావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, చెరుకు సుధాకర్, పిసిసి అధికార ప్రతినిధి పున్నా కైలాష్‌నేత, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

# సిసిఎస్‌కు చిక్కిన నైజీరియా సైబర్ నేరగాడు

- వివాహాల పేరిట మహిళలకు టోకరా

**హైదరాబాద్, అక్టోబరు 29, ప్రభాతవార్త:** భారత్‌లో అక్రమంగా వుంటూ, వివాహాల పేరిట అమాయక యువతులను నమ్మించి వారి వద్ద నుంచి దండిగా డబ్బులు దో చుకుంటున్న ఓ నైజీరియా సైబర్ నేరగాడిని సిసిఎస్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నిందితుడి వద్ద నుంచి కొన్ని వస్తువులను జప్తు చేశారు. దీనికి సంబం ధించిన వివరాలను సిసిఎస్ జాయింట్ సిపి గజారావు భూపాల్ శనివారం మీడియాకు వెల్లడించారు. నైజీరియా దేశానికి చెందిన అమూల్యన్స్ ప్రిన్స్ ఫెలిక్స్ (50) అనే వ్యక్తి 2012లో భారత్‌కు బిజినెస్ వీసాపై వచ్చాడు.
ఈ వీసా గడువు 2016లో ముగిసింది. అయినా ఇతను తన దేశానికి వెళ్లకుండా భారత్‌లో అక్రమంగా వుంటూ మ్యాట్రమోనియల్ నేరాలకు పాల్పడుతున్నాడు. తన వద్ద వున్న సెల్‌ఫోన్‌లో కొన్నిరకాల ఉపకరణాలను వాడి +44, +1 సీరీస్ వచ్చేలా చేస్తూ తాను విదేశాలలో వు న్నట్లు అమాయక మహిళలను మ్యాట్రమోనియల్ పేరిట నమ్మించేవాడు. అవివాహితులు, రెండవ వివాహం చేసుకోవాలనుకునే మహిళలను టార్గెట్ చేసేవాడు. ఈ క్రమ ంలో ఇతను అనేక మంది మహిళలను మోసం చేసి వారి వద్ద నుంచి లక్షలాది రూపాయలను దండుకుని తప్పించుకుని తిరుగసాగాడు.
నగరంలోని సంజీవరెడ్డి నగర్‌కు చెందిన ఓ యువతి ఇతని మాటలను నమ్మి నిండా మునిగి 18 లక్షల రూపాయలు పోగొట్టుకుంది, ఈ యువతిని మ్యాట్రమోనియల్ పేరిట ఈ నేరగాడు వంచించాడు. తాను అమెరికాలో ఉన్నత ఉద్యోగినని నమ్మించాడు. అనంతరం ఆ యువతితో కొంకాలం చాటింగ్ చేయడంతో పాటు ఫోన్‌లో మాట్లాడాడు. ఆ తరువాత అమెరికా నుంచి ఖరీదైన బహుమతి పంపుతు న్నట్లు నమ్మించాడు. దీని తరువాత ఇదే నేరగాడు ఢిల్లీ విమానాశ్రయం అధికారిగా నమ్మించి ఆ యువతికి ఫోన్‌చేసి మీకు అమెరికా నుంచి ఖరీదైన బహుమతి వచ్చింది, కస్టమ్స్ ఛార్జీల కింద 18 లక్షల రూపాయలు చెల్లించాలని కోరా డు. ఇది నిజమని నమ్మిన యువతి 18 లక్షల రూపాయలు ఇచ్చి మోసపోయింది. దీని తరువాత బాధిత యువతి ఈ ఏడాది జూన్ నెలలో సిసిఎస్ పోలీసులకు ఫిర్యాదు చేయగా దీనిపై కేసు నమోదు చేసిన సైబర్ క్రైం పోలీసులు నిందితుడి గురించి ఆరా తీయగా ఇతను నైజీరియాకు చెందిన అమూల్యన్స్ ప్రిన్స్ ఫెలిక్స్‌గా తేలింది. ఇతను ఢిల్లీ సమీపంలోని గ్రేటర్ నోయిడాలో వుంటున్నట్లు తెలగా అక్కడికి వెళ్లిన సిసిఎస్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నిందితుడి వద్ద నుంచి మూడు లాప్ టాప్‌లు, ఎనిమిది సెల్‌ఫోన్లు. పది సిం కార్డులు, రెండు డెబిట్ కార్డులను జప్తు చేశారు.
నిందితుడిని శనివారం హైదరాబాద్‌కు తరలించి ఇక్కడి కోర్టులో హాజరుపరిచి న్యాయ మూర్తి ఆదేశాల మేరకు రెండు వారాల రిమాండు నిమిత్తం చంచల్‌గూడ జైలుకు తరలించారు.



సిసిఎస్‌కు చిక్కిన నైజీరియా సైబర్ నేరగాడు

# నా రాజీనామాతో అసెంబ్లీనే మునుగోడుకు రప్పించా: కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

**మర్రిగూడ, అక్టోబరు 29, ప్రభాతవార్త :** కనీసం మునుగోడు సమస్యలను వినడానికి కూడా సమయం కేటాయించని ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రివర్గం, అసెంబ్లీని నా రాజీనామాతో మునుగోడుకు రప్పించానని మాజీ ఎమ్మెల్యే, బిజెపి అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేరొ ్కన్నారు. శనివారం మండలంలోని తిరుగండ్లపల్లి, తమ్మడపల్లి, యరుగండ్లపల్లి, మర్రిగూడ, కొండూరు, కమ్మగూడెం, వట్టిపల్లి గ్రామాల్లో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. యరుగండ్లపల్లిలో గజమాలతో ఆయనను పార్టీ నాయకులు గజమాలతో సన్మానించారు. మహిళలు బోనాలు, బతుకమ్మలు, కోలాటాలతో ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో పలుమార్లు మునుగోడు అభివృద్ధి విషయంపై గళం విప్పినప్పటికీ నిర్లక్ష్య ధోరణి వ్యవహరించారని సిఎం కెసిఆర్‌పై ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీకి, తన పదవికి రాజీనామా అనంతరం తెలంగాణలో 10 లక్షల మందికి ఫించన్లు, మునుగోడు నియోజకవర్గంలో గట్టుప్పల్ మండలం, రోడ్ల మరమ్మత్తులు కొనసాగాయన్నారు. బిజెపి అభ్యర్థి అయిన నన్ను ఓడించడానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ఇంచార్జిలు మునుగోడు నియోజకవర్గం నిండా ప్రచారంలో పాల్గొనడమే తన బలానికి నిదర్శనమన్నారు. బిజెపితో రాష్ట్ర ప్రభుత్వాన్ని కూలదోయడమే తన కర్తవ్యమని, కెసిఆర్ కుటుంబ పాలనను అంతమొందించేందుకు రాజీనామాకు సిద్ధమయ్యానని తెలిపారు. తనను ఓడించడానికి రాష్ట్ర సిఎం కెసిఆర్ ఎన్నో ఎత్తులు, కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. మునుగోడు ప్రజల అభివృద్ధి తన ధ్యేయంగా ఈ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో భాగంగా తండ్రి గెలుపు కోసం కొడుకు సంకీర్తన్‌రెడ్డి కూడా రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేయడం మరింత ఆకర్షణీయంగా మారింది. ఈ కార్యక్రమంలో మండల బిజెపి ఇంచార్జి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, స్థానిక నాయకులు అమరేందర్‌రెడ్డి, రాందాసు శ్రీనివాస్, నర్సిరెడ్డి, పిట్టల శ్రీనివాస్, యాదయ్య, రాజేందర్‌నాయక్, ఎంపిటిసి బాలయ్య, కృష్ణారెడ్డి, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

30-10Pg10exHMNWJQEBPR:Layout 1 10/30/22 11:47 PM Page 1







కోట్లాదిమంది వచ్చేసారు, మ్యూచువల్ ఫండ్స్ గ్రౌండ్‌లోకి.

ఇప్పుడు మీరూ దిగండి!

MUTUAL FUNDS నిజమే మరి

మ్యూచువల్ ఫండ్స్ గురించి మరింత తెలుసుకునేందుకు, మీ మ్యూచువల్ ఫండ్ డిస్ట్రిబ్యూటర్‌ని కానీ, ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్‌ని కానీ సంప్రదించండి ఇవాళే!

సందర్శించండి: mutualfundssahihai.com

ఫాలో కండి:

మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు మార్కెట్‌లోని సంక్షోభాలకు లోబడి ఉంటాయి, స్కీముకి సంబంధించిన అన్ని డాక్యుమెంట్స్‌నీ జాగ్రత్తగా చదవండి.


Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.